www.peoplesnews.in

హైదరాబాద్
# పీపుల్స్ న్యూస్
దినపత్రిక

ప్రజల గొంతుక...

ఎడిటర్ : కె. శ్రావణ్ కుమార్

తెలంగాణ - ఆంధ్రప్రదేశ్ సంపుటి : 16 సంచిక : 50 ఆదివారం, జూలై 05, 2026, పేజీలు - 12 వెల: 2/-

Circulated to Hyderabad, Rangareddy, Karimnagar, Nalgonda, Adilabad, Mahaboobnagar, Khammam, Medak, Warangal, Nizamabad

రండి.. అక్షరాన్ని
అనుకున్న విధంగా రాద్దాం

అసలైన అక్షరాన్ని రుచి చూపేందుకు..
కన్నది విన్నది పంచుకున్నది ప్రజలకు అందించాలని..
వారి సాధకబాధకాల్లో మమేకమై
పరిష్కార మార్గాలకు దిక్సూచిగా
మారాలని అనుకుంటున్నారా? విశాలమైన జర్నలిజం
వృత్తిలో రాణించాలని కోరుకుంటున్నారా? అయితే..

హైదరాబాద్ పీపుల్స్ న్యూస్ దినపత్రిక
జిల్లా, మండల మరియు నియోజకవర్గాల
వారిగా రిపోర్టర్లు కావలెను
సంప్రదించండి
తెలంగాణ | ఆంధ్రప్రదేశ్
9866330400






- పేదలకు సేవచేసే భాగ్యం దక్కడం అదృష్టం


● పాలమూరు నుంచి ఎందరో మహానుభావులు వచ్చారు ● పాలమూరు బిడ్డలు పాల పట్టగలరు..పాలన చేయగలరు ● మిడ్జిల్ నన్ను భుజానికెత్తుకుని ఆదరించింది ● మిడ్జిల్ మండల అభివృద్ధి బాధ్యత ఇక భట్టిదే ● బిఆర్ఎస్ పాలకులు రాష్ట్రాన్ని అప్పుల్లో ముంచారు ● ఆకుటుంబాలకు వేల ఎకరాల ఫామ్‌హౌజ్‌లు ఎలా వచ్చాయి ● మిడ్జిల్ రాజకీయ కృతజ్ఞతా సభలో సిఎం రేవంత్ రెడ్డి

## మిడ్జిల్‌లో నాటిన మొక్క..
# మహావృక్షమైంది

**మహబూబ్‌నగర్, జూలై 4 :** ఆనాడు మిడ్జిల్ మండల ప్రజలు నాటిన మొక్క ఇవాళ మహా వృక్షమై, ప్రజలకు చేవ చేస్తోందని సీఎం రేవంత్‌రెడ్డి అన్నారు. తొలిసారిగా 2006 జులై 4న మిడ్జిల్ ప్రజలు ఆశీర్వదించారని గుర్తు చేసుకున్నారు. 20 ఏళ్ల రాజకీయ జీవితం పూర్తయిన సందర్భంగా నాగర్‌కర్నూల్ జిల్లా మిడ్జిల్‌లో నిర్వహించిన కృతజ్ఞత సభలో సీఎం మాట్లాడారు. తన రాజకీయ ప్రయాణంలో కీలకమైన మండల ప్రజలకు కృతజ్ఞతలు తెలిపారు. మిడ్జిల్, కల్వకుర్తి ప్రాంతాలకు గతంలోనూ గొప్ప గొప్ప నాయకులు ఉండేవారు. హైదరాబాద్ రాష్ట్రానికి తొలి సీఎంగా చేసిన బూర్గుల రామకృష్ణారావు మహబూబ్‌నగర్ బిడ్డే. ఎంపీగా, కేంద్రమంత్రిగా దేశానికి సేవలందించిన జైపాల్‌రెడ్డి ఈ జిల్లా బిడ్డే. 2006లో జడ్పీటీసీ మిగతా2లో...

## యుద్ధం వేళ ఇంధన సంక్షోభాన్ని
# అధిగమించాం

● ఇంధనంపై ప్రజలను భయపెట్టే యత్నాలు జరిగాయి
● అయితే సమర్థంగా సవాళ్లను అధిగమంచగలిగాం
● రాజస్థాన్‌లో గ్రీన్ రిఫైనరీని ప్రారంభించిన ప్రధాని మోడీ



**జయపుర,జూలై 4 :** పశ్చిమా సియా సంక్షోభం వేళ దేశంలో ఇంధన సంక్షోభాన్ని విజయవంతం ఎదుర్కొన్నట్లు ప్రధాని మోడీ అన్నారు. ప్రజలను భయపెట్టే ప్రయత్నాలు జరిగాయి. రాజకీయాలు చేశారు. కానీ వారి కుట్రలు ఫలించ లేదు. కొన్ని చిన్న చిన్న ఇబ్బందులు తప్ప దేశంలో ఎక్కడా ఇంధన సరఫరా ఆగలేదని అన్నారు.


మిగతా2లో...

## ప్రజారోగ్య పరిరక్షణకు
# పకడ్బందీ చర్యలు

● ఆహార భద్రతను కట్టుదిట్టంగా అమలు ● డ్రగ్ కంట్రోలర్ , ఫుడ్ సేఫ్టీ విభాగాలు కలిసి పనిచేయాలి ● అధికారులకు సిఎస్ సంజయ్ జాజూ ఆదేశం



**హైదరాబాద్,జూలై 4 :** ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆదేశాల మేరకు ప్రజారోగ్య పరిరక్షణకు పకడ్బందీ చర్యలు తీసుకోవాలని రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సంజయ్ జాజు అధికారులను ఆదేశించారు. రాష్ట్రంలో ఆహార భద్రతా నిబంధనలను కట్టు దిట్టంగా అమలు చేయాలని, మిగతా2లో...



## పార్లమెంట్ వర్షాకాల
# షెడ్యూల్ ఖరారు

జూలై20 నుంచి ఆగస్ట్ 13 వరకు సమావేశాలు

ఎక్స్ వేదికగా వెల్లడించిన కేంద్రమంత్రి కిరణ్ రిజిజు

**న్యూఢిల్లీ,జూలై 4 :** పార్లమెంట్ వర్షాకాల సమావేశాల షెడ్యూల్ ఖరారయ్యింది. ఈ మేరకు పార్లమెంటరీ వ్యవహారాల మంత్రి కిరణ్ రిజిజు సోషల్ మీడియా ఎక్స్‌లో పేర్కొన్నారు. జూలై 20 నుంచి ఆగస్టు 13 వరకు సమావేశాలు జరగనున్నట్లు తెలిపారు. కేంద్ర ప్రభుత్వ సిఫారసు మేరకు పార్లమెంట్ 2026 వర్షాకాల సమావేశాలను నిర్వహించేందుకు రాష్ట్రపతి ద్రౌపది ముర్ము ఆమోదం తెలిపారు. దేశ ప్రాధాన్యత కలిగిన కీలక అంశాలపై అర్థవంతమైన చర్చలు, సమగ్ర మిగతా2లో...

## నిజమైన ప్రజానాయకుడు
# మన రేవంత్

- ప్రజల కోసం పరితపించే పెద్ద మనసు ఆయన సొంతం
- నిరంతరం పేదల సంక్షేమం లక్ష్యంగా పనిచేస్తున్న వ్యక్తి
- మిడ్జిల్ సభలో సిఎం రేవంత్‌పై భట్టి ప్రశంసలు



**నాగర్‌కర్నూలు,జూలై 4 :** తనను ఆదరించిన ప్రజల దీవన పొందాలని, వారికి కృతజ్ఞతలు తెలపాలని వచ్చిన సిఎం రేవంత్ రెడ్డిది పెద్ద మనసని డిప్యూటి సిఎం భట్టి విక్రామార్క అన్నారు. ప్రజలకు సేవ చేయాలన్న తపన, పేదలను ఆదుకోవాలన్న ఆకాంక్ష రేవంత్ రెడ్డిలో ఉన్నాయని అన్నారు. రేవంత్‌ను దగ్గరగా చూసిన వ్యక్తిగా ఆయనలో ఉదాత్తమైన ఆశయాలు ఉన్నాయన్నారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి 20 ఏళ్ల రాజకీయ ప్రస్థానాన్ని పూర్తి చేసుకున్న సందర్భంగా మిడ్జిల్‌లో ఏర్పాటు చేసిన భారీ బహిరంగ సభలో డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క మాట్లాడారు. రెండు దశాబ్దాల క్రితం తనను జడ్పీటీసీగా దీవించిన ఈ ప్రాంత ప్రజల చెంతకు, నేడు రాష్ట్ర ముఖ్యమంత్రిగా మారి కృతజ్ఞతలు చెప్పుకోవడానికి రావడం రేవంత్ రెడ్డి ఉన్నతమైన సంస్కారానికి మిగతా2లో...

## అభివృద్ధి కార్యాక్రమాల్లో
# వేగం పెంచాలి

● క్యూర్ పరిధిలో అర్బన్ హౌసింగ్‌కు అత్యంత ప్రాధాన్యత ● రెవెన్యూ, రిజిస్ట్రేషన్ శాఖలకు ఆధునిక శాశ్వత భవనాలు ● ప్రభుత్వ ప్రాధాన్యతల అమలులో సమన్వయంతో పనిచేయాలి ● అధికార యంత్రాంగానికి మంత్రి పొంగులేటి దిశానిర్దేశం



**హైదరాబాద్,జూలై 4 :** రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపడుతున్న అభివృద్ధి కార్యక్రమాలలో వేగం పెంచాలని, ప్రభుత్వ ప్రాధాన్యతలకు అనుగుణంగా పనిచేయాలని రాష్ట్ర రెవెన్యూ, హౌసింగ్, సమాచార పౌరసంబంధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి అధికారులను ఆదేశించారు. క్యూర్ పరిధిలో అఫర్డబుల్ ఎల్ఐజి అర్బన్ హౌసింగ్ స్కీమ్, సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాలకు శాశ్వత భవనాల నిర్మాణంపై శనివారం నాడు సచివాలయంలోని తన కార్యాలయంలో అధికారులతో సమీక్షించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆలోచనలకు అనుగుణంగా పేదల సొంతింటి కలను నెరవేర్చాలన్న సంకల్పంతో గ్రామీణ ప్రాంతాలలో చేపట్టిన ఇందిరమ్మ ఇళ్ల పథకం విజయవంతమైంది. ఇది దేశానికే ఆదర్శంగా నిలిచింది. ఇదే స్ఫూర్తిని క్యూర్ పరిధిలో చేపట్టబోయే మిగతా2లో...




## భట్టి విక్రమార్క
# గోబెల్స్ ప్రచారం

● అప్పలపై తప్పడు లెక్కలు ● రంకెలు వేసినంత మాత్రాన అంకెలు మారవు ● బిఆర్ఎస్ దిగిపోయేనాటికి అప్ప రూ.4.14 లక్షల కోట్లు మాత్రమే. ● మీడియా సమావేశంలో మండిపడ్డ హరీష్ రావు

**హైదరాబాద్,జూలై 4 :** బీఆర్ఎస్ ప్రభుత్వం చేసిన మొత్తం అప్పు రూ. 5.16 లక్షల కోట్లు అని ఉపముఖ్యమంత్రి భట్టి విక్రమార్క చెప్పిన మాటలు అవాస్తవమని మాజీ మంత్రి, ఆ పార్టీ ఎమ్మెల్యే హరీశ్‌రావు అన్నారు. కాంగ్రెస్ చేసిన రూ.15 వేల కోట్ల అప్పును కూడా బీఆర్ఎస్ ఖాతాలో చూపారని విమర్శిం చారు. రంకెలు వేసినంత మాత్రాన అంకెలు మారిపోవంటూ ఘాటుగా స్పందిం చారు. హైదరాబాద్‌లో ఆయన మీడియాతో మాట్లా డుతూ.. బీఆర్ఎస్ ప్రభుత్వం దిగిపోయేనాటికి చెల్లించాల్సిన మొత్తం అప్పు మిగతా2లో...

## రేవంత్ రెడ్డికి బండి
# శుభాకాంక్షలు



# మిడ్జిల్‌లో నాటిన మొక్క..మహావృక్షమైంది

(మొదటి పేజీ తరువాయి)

స్వతంత్ర అభ్యర్థిగా పోటీ చేసిన నన్ను ఇక్కడి ప్రజలు అక్కున చేర్చుకున్నారు. నాది ఈ నియోజకవర్గం కాకపోయినా.. నమ్మకంతో గెలిపించారు. మీరు నాపై పెట్టిన నమ్మకమే.. ఇవాళ నన్ను ఈ స్థాయికి తీసుకొచ్చిందని అన్నారు. మహబూబ్‌నగర్ జిల్లాలోని పలు మండలాలు 2006లో డార్క్ మండలాలుగా ఉండేవి. నా రాజకీయ జీవితంలో కీలకమైన మిడ్జిల్ మండలానికి ఏదైనా చేయాల్సిన బాధ్యత నాపై ఉంది. ఈ మండలాన్ని దత్తత తీసుకోవాలని డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్కను కోరుతున్నానని ప్రకటించారు. నేను ఏనాడూ పదవి, అధికారాన్ని దుర్వినియోగం చేయలేదు. వందేళ్లుగా కులగణన జరగలేదు. రాష్ట్రంలో కులగణన చేపట్టి దేశానికే దిక్సూచిగా నిలిచాం. దొర దురహంకారాన్ని మరోసారి బొందపెట్టాల్సిన అవసరం ఉందన్నారు. తెలంగాణ కోసం పోరాడిన గద్దర్ అన్నను దొర గడీ ముందు గంటల కొద్దీ నిలబెట్టారు. రాష్ట్రంలో పదేళ్లపాటు పేదలకు సొంతింటి కల నెరవేరలేదు. ఈ ప్రభుత్వం గ్రామగ్రామాన ఇందిరమ్మ ఇళ్లు నిర్మించి పేదల కలను సాకారం చేస్తోంది. రూ.70వేల కోట్ల అప్పు ఉన్న రాష్ట్రాన్ని రూ.8.50 లక్షల కోట్ల అప్పుల స్థాయికి దిగజార్చారు. కేసీఆర్ ఏ గ్రామంలోనైనా డబుల్‌బెడ్ రూమ్ ఇళ్లు ఇచ్చారా? మూడెకరాల భూమి ఇచ్చారా? కోటి ఎకరాలకు నీరు ఇచ్చారా?ఇంటికో ఉద్యోగం ఇచ్చారా? అంటూ ప్రజలను ప్రశ్నించారు. ఇసుక దోపిడీకి అడ్డువచ్చిన నేరెళ్ల దళితులను లారీలతో తొక్కించారు. పదేళ్లు తన కుటుంబానికి, బంధువులకు తప్ప.. ఎవరికైనా ఉద్యోగాలు, పదవులు వచ్చాయా అని అన్నారు. కేసీఆర్ కుటుంబం దోపిడీలు, దొంగతనాలు మళ్లీ మొదలు కావడానికి ప్రజాపాలన పోవాలా? కేసీఆర్‌కు గజ్వేల్‌లో వెయ్యి ఎకరాల ఫామ్‌హౌస్ ఎలా వచ్చిందన్నారు. కేటీఆర్, కవిత, హరీశ్‌రావుకు రూ.వేల కోట్ల విలువైన భూములు, ఫామ్‌హౌస్‌లు ఎక్కడి నుంచి వచ్చాయని రేవంత్‌రెడ్డి ప్రశ్నించారు. మిడ్జిల్ డార్క్ మండల కాదు.. వెలుగు రేఖ అని నిరూపించాలన్నారు. 2006లో జెడ్పీటీసీగా తనపై పోటీ చేసిన రబ్బానీకి ప్రభుత్వ పదవి ఇస్తామని చెప్పారు. పేదల మధ్య పెరిగిన తనకు పేదల కష్టాలు, సమస్యలు తెలుసని అన్నారు. కానీ దొరలకు గ్రామాల్లోని సమస్యలను పరిష్కరించాలనే ఆలోచన ఉండదన్నారు. అన్ని గ్రామాల్లో సమస్యలు పరిష్కారమైతే దేశం అభివృద్ధి చెందుతుందన్నారు. ఈ కార్యక్రమంలో డిప్యూటి సిఎం భట్టి విక్రమార్క,ఎంపి మల్లు రవి, జితేందర్ రెడ్డి

# యుద్ధం వేళ ఇంధన సంక్షోభాన్ని అధిగమించాం

(మొదటి పేజీ తరువాయి)

శనివారం రాజస్థాన్‌లోని బాలోత్రా జిల్లా పచ్‌పద్రాలో దేశంలోని తొలి గ్రీన్‌ఫీల్డ్ సమగ్ర రిఫైనరీ-పెట్రోకెమికల్ కాంప్లెక్స్‌ను మోడీ ప్రారంభించారు. సుమారు రూ.1.06 లక్షల కోట్ల విలువైన పెట్రోకెమికల్స్, రైల్వేలు, రహదారులు, మెట్రో, పునరుత్పాదక ఇంధనం, విద్యుత్ ప్రసార ప్రాజెక్టులకు శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాలు కూడా నిర్వహించారు. మోడీ మాట్లాడుతూ.. దేశ ఇంధన భద్రత, పశ్చిమాసియా యుద్ధం సమయంలో భారత్ ఎదుర్కొన్న సవాళ్లు, వాటిని అధిగమించిన విధానంపై కీలక వ్యాఖ్యలు చేశారు. పశ్చిమాసియా యుద్ధం కారణంగా ప్రపంచ ఇంధన మార్కెట్లు తీవ్రంగా దెబ్బతిన్నాయని ప్రధాని తెలిపారు. ఈ సమయంలో భారత్‌లో ఇంధన కొరత వస్తుందని కొందరు ప్రజలను తప్పుదోవ పట్టించే ప్రయత్నం చేశారని ప్రతిపక్షాలను ఉద్దేశించి ఆరోపించారు. ఏప్రిల్ నుంచి జూన్ మధ్యకాలంలో అంతర్జాతీయంగా ముడి చమురు ధరలు భారీగా పెరగడంతో ప్రభుత్వ చమురు మార్కెటింగ్ సంస్థలు రూ.75 వేల కోట్లకు పైగా నష్టాన్ని భరించాయని తెలిపారు. ప్రజలపై భారం పడకుండా కేంద్ర ప్రభుత్వం లీటరుకు రూ.10 ఎక్సైజ్ సుంకాన్ని కూడా తగ్గించిందని పేర్కొన్నారు. భారత్‌కు పెద్దగా చమురు నిల్వలు లేవని గుర్తుచేసిన ప్రధాని.. యుద్ధం సమయంలో ముడి చమురు ధర బ్యారెల్‌కు 70 డాలర్ల నుంచి 120 డాలర్లకు పెరిగిందన్నారు. కొన్ని దేశాల్లో పెట్రోల్, డీజిల్ ధరలు 40-50 శాతం పెరగడమే కాకుండా రేషన్ విధానం కూడా అమలు చేశారని చెప్పారు. అయితే భారత్‌లో మాత్రం ఒక్కరోజు కూడా ఇంధన కొరత తలెత్తలేదని స్పష్టం చేశారు. సంక్షోభానికి ముందు భారత్ కేవలం 25-26 దేశాల నుంచే ఇంధనం దిగుమతి చేసుకునేదని.. కానీ యుద్ధం ప్రారంభమైన తర్వాత భారత దౌత్యపరమైన ప్రయత్నాల వల్ల 40కిపైగా దేశాల నుంచి చమురు, ఇంధనం దిగుమతి చేసుకున్నామని ప్రధాని వెల్లడించారు. దేశ ప్రయోజనాలు, ప్రజల సంక్షేమమే భారత్‌కు అత్యంత ప్రాధాన్యం అనే సందేశాన్ని ప్రపంచానికి ఇచ్చామని అన్నారు. భారత్‌కు అవసర మైన ఎల్పీజీలో దాదాపు 60 శాతం దిగుమతుల ద్వారానే వచ్చేదని.. అందులో 90 శాతం హార్ముజ్ జలసంధి మార్గంలో గల్ఫ్ దేశాల నుంచే వచ్చేదని తెలిపారు. యుద్ధం కారణంగా సరఫరా దాదాపు నిలిచిపోయిన సమయంలో రిఫైనరీల సామర్థ్యాన్ని వినియోగించి కేవలం ఏడు రోజుల్లోనే దేశీయ ఎల్పీజీ ఉత్పత్తిని 35 వేల మెట్రిక్ టన్నుల నుంచి 54 వేల మెట్రిక్ టన్నులకు పెంచామని చెప్పారు. ఇప్పటివరకు ఎల్పీజీ ఉత్పత్తి చేయని కొన్ని రిఫైనరీలను కూడా ఈ అవసరానికి అనుగుణంగా మార్చినట్లు తెలిపారు. దేశవ్యాప్తంగా పైప్ ద్వారా సహజ వాయువు కనెక్షన్లను వేగంగా విస్తరించామని, 11 లక్షలకుపైగా కుటుంబాలకు కొత్త పీఎన్‌జీ కనెక్షన్లు అందించామని ప్రధాని వెల్లడించారు. మార్కెట్ అంచనాల ప్రకారం గృహ వినియోగ ఎల్పీజీ సిలిండర్ ధర రూ.2,000 వరకు చేరే అవకాశం ఉన్నప్పటికీ.. ప్రస్తుతం రూ.950లోపే అందిస్తున్నామని పేర్కొన్నారు. పశ్చిమాసియా యుద్ధం 21వ శతాబ్దంలోనే అతిపెద్ద ఇంధన సంక్షోభానికి కారణమైందన్నారు. సమస్యను ముందుగానే అంచనా వేసి సరైన నిర్ణయాలు తీసుకున్నాం. దేశ వనరులను సమర్థంగా వినియోగించాం. దౌత్య శక్తిని సానుకూల ంగా ఉపయోగించాం. ఇది దేశ ఇంధన భద్రతను పెంచడంతో పాటు పెట్రోకెమికల్ రంగంలో స్వయం సమృద్ధికి దోహదపడుతుందని.. వేలాది మందికి ఉపాధి అవకాశాలు కల్పిస్తుందని కేంద్ర ప్రభుత్వం పేర్కొంది. అదనంగా జైపూర్ మెట్రో రెండో దశ, రైల్వే డబ్లింగ్ ప్రాజెక్టులు, జాతీయ రహదారులు, బికానేర్ సోలార్ పార్కులు, విద్యుత్ ప్రసార లైన్లు సహా పలు అభివృద్ధి ప్రాజెక్టులను కూడా ప్రధాని దేశానికి అంకితం చేశారు.

# పార్లమెంట్ వర్షాకాల షెడ్యూల్ ఖరారు

(మొదటి పేజీ తరువాయి)

చర్చోపచర్చలు, నిర్ణయాలు తీసుకునేందుకు ఈ సమావేశాలు వేదిక కానున్నాయని కేంద్ర ప్రభుత్వం తెలిపింది. ఇక ఈ సమావేశాల్లో పలు కీలక బిల్లులను ప్రభుత్వం ప్రవేశపెట్టే అవకాశముండగా దేశ ఆర్థిక వ్యవస్థ, జాతీయ భద్రత, అభివృద్ధి కార్యక్రమాలు, ప్రజా సంక్షేమం, ఇతర సమకాలీన అంశాలపై కూడా ఇరు సభల్లో విస్తృతంగా చర్చలు జరిగే అవకాశం ఉంది. అలాగే ప్రతిపక్ష పార్టీలు కూడా వివిధ ప్రజా సమస్యలను సభలో ప్రస్తావించే అవకాశముంది. ఇటీవలి పరిణామాలు, దేశీయ, అంతర్జాతీయ అంశాలతో పాటు పలు రాష్ట్రాలకు సంబంధించిన సమస్యలను కూడా ప్రతిపక్ష పార్టీలు ఈ సమావేశాల్లో ప్రస్తావించే అవకాశం ఉందని రాజకీయ వర్గాలు భావిస్తున్నాయి. మరోవైపు ప్రభుత్వం కూడా తన కీలక విధానాలు, సంస్కరణలు, అభివృద్ధి కార్యక్రమాలకు సంబంధించిన అంశాలను సభ ముందుకు తీసుకురానుంది. స్వాతంత్య్ర దినోత్సవ వేడుకలకు ముందు ముగియనున్న ఈ సమావేశాల్లో పలు కీలక నిర్ణయాలు, చర్చలు జరిగే అవకాశముందని విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు. వర్షాకాల సమావేశాల్లో ఎన్డీఏ ప్రభుత్వం పలు కీలక బిల్లులను ప్రవేశపెట్టేందుకు సిద్ధమవుతోంది. ముఖ్యంగా రెండు రాజ్యాంగ సవరణ బిల్లులను తీసుకురానున్నట్లు తెలుస్తోంది. 131వ రాజ్యాంగ సవరణ బిల్లు మహిళా రిజర్వేషన్, నియోజకవర్గాల పునర్విభజనను సవరణలతో మళ్లీ ప్రవేశపెట్టే అవకాశం ఉంది. ఈ బిల్లులో లోక్‌సభ, రాష్ట్ర అసెంబ్లీల సభ్యుల సంఖ్యను 50 శాతం పెంచే ప్రతిపాదన కూడా ఉండొచ్చని సమాచారం. ఇక ప్రతిపక్షాలు కేంద్ర ప్రభుత్వాన్ని పలు అంశాలపై నిలదీయడానికి సిద్ధమవుతున్నాయి. ముఖ్యంగా నీట్ ప్రశ్నాపత్రం లీక్ వ్యవహారం, అయోధ్య రామమందిర విరాళాల దుర్వినియోగం ఆరోపణలు, పెట్రోల్, డీజిల్ ధరల పెరుగుదల, ద్రవ్యోల్బణం, నిరుద్యోగ సమస్య వంటి అంశాలపై కేంద్రాన్ని ఇరుకున పెట్టేందుకు వ్యూహరచన చేస్తున్నట్లు సమాచారం. దీంతో ఈసారి పార్లమెంట్ వర్షాకాల సమావేశాలు హాట్ హాట్‌గా జరిగే సూచనలు కనిపిస్తున్నాయి.

# సత్యసాయి ఆస్పత్రిని సందర్శించిన విజయ్ దేవరకొండ

### ఇక్కడ చిన్నారులకు హృద్రోగ చికిత్సలు చేయడం అభినందనీయం

### సత్యసాయి స్కూల్ విద్య వల్లనే ఇంతటి వాడినయ్యానని వెల్లడి




**సిద్దిపేట, జూలై 4 :** జిల్లాలోని కొండపాక సత్యసాయి సంజీవని శిశు హృదయాలయ హాస్పిటల్‌ను సినీ నటుడు విజయ్ దేవరకొండ, మాజీమంత్రి హరీశ్ రావు సందర్శించారు. ఆస్పత్రిలో 500 మంది చిన్నారులకు గుండె ఆపరేషన్లు పూర్తయిన సందర్భంగా ప్రత్యేక కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా మాజీ మంత్రి మాట్లాడుతూ.. దేశవ్యాప్తంగా ప్రతి ఏటా 6000 గుండె ఆపరేషన్లు జరుగుతున్నాయని తెలిపారు. ఇక్కడెక్కడి నుంచో పిల్లలు సత్యసాయి ఆస్పత్రికి వచ్చి చికిత్స చేయించుకుంటున్నారన్నారు. ప్రతి మనిషి తనకు చేతనైన సాయం చేయాలని... మనం చేసిన మంచే చివరకు మిగులుతుందని చెప్పుకొచ్చారు. తన ఏడాది జీతాన్ని ఈ దేవాలయానికి విరాళంగా ఇస్తున్నట్లు హరీశ్ ప్రకటించారు. పుట్టిన బిడ్డ గుండెలో రంధ్రం ఉంది, ప్రాణాలు నిలవడం కష్టం అన్న స్థితిలో వారికి ప్రాణాలు పోస్తే.. ఆ చిన్నారి ప్రాణాలతో పాటు వారి తల్లిదండ్రులు ప్రాణాలనూ కాపాడినట్లు అవుతుందన్నారు. ఈ ఆస్పత్రిని రాబోయే రోజుల్లో రీసెర్చ్ సెంటర్‌గా అభివృద్ధి చేస్తామని చైర్మన్ చెప్పారన్నారు. తెలంగాణ నుంచి స్వతహాగా హీరోగా ఎదిగిన వ్యక్తి విజయ్ దేవరకొండ అని.. ఎంత ఎదిగినా ఒదిగి ఉండే స్వభావం ఆయనదని కొనియాడారు. కరోనా సమయంలో వేలాది మందికి సాయం అందించారని గుర్తుచేశారు. ఒకటో తరగతి నుంచి పదో తరగతి వరకు సత్యసాయి స్కూల్లోనే విజయ్ దేవరకొండ చదివారన్నారు. ఇక్కడ కులం, మతం లేదని.. ఆపదలో ఉన్న పిల్లలకు సేవలందిస్తున్నారని హరీశ్ రావు పేర్కొన్నారు. అనంతపురంలో ఓ వ్యక్తి ఏర్పాటు చేసిన వ్యవస్థ ఎన్నో రకాల సేవలందిస్తోందని హీరో విజయ్ దేవరకొండ అన్నారు. 'ఈరోజు నేను ఇలా ఉన్నానంటే సత్యసాయి స్కూల్లో అందించిన విద్యే కారణం. కొందరు వ్యక్తులు చూపించే ప్రేమ, దయ వల్ల అనేక మంది జీవితాలు మారిపోతాయి. అలాంటి ప్రేమను చూపించిన గొప్ప వ్యక్తి సత్యసాయి. ఇక్కడ చికిత్స పొందిన చిన్నారులు రేపు ఎలాంటి మార్పులు తీసుకొస్తారో సమాజం చూస్తుంది. ఒక లీడర్ తీసుకున్న నిర్ణయం ఈ ప్రాంతానికి, పిల్లల వైద్యానికి ఎంతో మేలు చేస్తోంది. హరీశ్ రావు తీసుకున్న నిర్ణయం, శ్రమ వల్ల ఇంత గొప్ప ఆస్పత్రి ఇక్కడికి వచ్చింది. చైర్మన్ శ్రీనివాస్, ఆయన వైద్య బృందం చేస్తున్న సేవలు వెలకట్టలేనివి' అని విజయ్ దేవరకొండ కొనియాడారు. ఈ సందర్భంగా ఆసుపత్రిలో గుండె చికిత్సలు పొందుతున్న చిన్నారులతో వారిద్దరూ కాసేపు సరదాగా గడిపి ముచ్చటించారు. తనకు హరీష్ రావు అన్న అంటే ఎంతో అభిమానమని, ఆయన్ను 'సిద్ధిపేటకా షేర్' అని సంబోధిస్తూ కొనియాడారు. రాజకీయాలకు అతీతంగా, నిస్వార్థంగా పిల్లల గుండె జబ్బుల నివారణకు మరియు సమాజ సంక్షేమం కోసం హరీష్ రావు చేస్తున్న కృషి అభినందనీయమని విజయ్ దేవరకొండ కొనియాడారు. పేద పిల్లల గుండె ఆపరేషన్లకు ఆయన అందిస్తున్న సాయాన్ని ప్రత్యేకంగా ప్రస్తావిస్తూ, ఇలాంటి నాయకులు జనరేషన్‌కు ఒక్కరే ఉంటారని ప్రశంసించారు. చిన్నారుల కోసం ఏర్పాటు చేసిన ఈ ప్రత్యేక వైద్య శిబిరంలో పాల్గొనడం, హరీష్ రావు చేస్తున్న ప్రజా సేవను ప్రత్యక్షంగా చూడడం తనకు ఎంతో సంతోషాన్ని ఇచ్చిందని విజయ్ దేవరకొండ ఈ సందర్భంగా స్పష్టం చేశారు.

# ప్రజారోగ్య పరిరక్షణకు పకడ్బదీ చర్యలు

(మొదటి పేజీ తరువాయి)

కల్తీ ఆహార పదార్థాలపై ప్రత్యేక దృష్టి సారించి నిరంతరం తనిఖీలు చేపట్టాలని సిఎస్ పేర్కొన్నారు. డాక్టర్ బి.ఆర్.అంబేద్కర్ రాష్ట్ర సచివాలయంలో శనివారం సిఎస్ సంబంధిత అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ డ్రగ్ కంట్రోలర్ విభాగం, ఫుడ్ సేఫ్టీ విభాగాలు సమన్వయంతో పని చేస్తూ రాష్ట్రంలో ఆహార భద్రతా ప్రమాణాల అమలు, నాణ్యతలపై నిరంతరం తనిఖీలు నిర్వహించి ప్రజలకు నాణ్యమైన ఆహారాన్ని అందించేందుకు తగు చర్యలు తీసుకోవాలన్నారు. ఇప్పటి వరకు ఉన్న రెండు విభాగాలను ఏకతాటిపై నడిపేందుకు తగిన ప్రతిపాదనలను వారం రోజుల్లోగా సిద్ధం చేయాలని సిఎస్ సూచించారు. దీంతో ఆయా విభాగాలు సమర్థవంతంగా విధులు నిర్వహించేందుకు అవకాశం ఉందన్నారు. ఇతర రాష్ట్రాలలో అమలు చేస్తున్న విధానాన్ని అధ్యయనం చేసి మన రాష్ట్రంలో కూడా తగిన విధంగా అమలు చేసేందుకు తగిన ప్రణాళికలను రూపొందించాలన్నారు. రాష్ట్రంలో ఇప్పటివరకు నమోదైన కేసులు, వాటి పురోగతి, సిబ్బంది తదితర అంశాలపై చర్చించారు. సిఎం సలహాదారు, ఎక్స్-అఫీషియో ప్రత్యేక ప్రధాన కార్యదర్శి కె.రామకృష్ణారావు, డిజిపి సి.వి.ఆనంద్, సిఎంఒ ప్రిన్సిపల్ సెక్రటరీలు శేషాద్రి, ఎన్.శ్రీధర్, జిఎడి ప్రిన్సిపల్ సెక్రటరీ అహ్మద్ నదీం, అడిషనల్ డిజి(ఇంటెలిజెన్స్) విజయ్ కుమార్, వైద్యశాఖ ప్రిన్సిపల్ సెక్రెటరీ క్రిస్టినా చొంగ్తూ, జిహెచ్‌ఎంసి కమిషనర్ ఆర్.వి.కర్ణన్, వైద్యశాఖ కమిషనర్ సంగీతా, డ్రగ్ కంట్రోలర్ డిజి అవినాష్ మొహంతి ఇతర ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

# నిజమైన ప్రజానాయకుడు మన రేవంత్

(మొదటి పేజీ తరువాయి)

నిదర్శనమని కొనియాడారు. కేవలం అధికారుల సలహాలకే పరిమితం కాకుండా, పేదోడి కష్టాలు స్వయంగా తెలిసిన నాయకుడిగా రేవంత్ రెడ్డి క్షేత్రస్థాయిలో అద్భుతమైన ప్రజాపాలన అందిస్తున్నారని, ప్రకృతి కూడా ఆశీర్వదించేంత మంచి సంకల్పంతో ఆయన నిరంతరం ప్రజల కోసమే పరితపిస్తున్నారని భట్టి విక్రమార్క పేర్కొన్నారు. రాష్ట్రంలో ఆకలి లేని సమాజమే లక్ష్యంగా కోటి పదిహేను లక్షల కుటుంబాలకు సన్నబియ్యం పంపిణీ చేయాలని ముఖ్యమంత్రి తీసుకున్న నిర్ణయం చారిత్రాత్మకమని, అలాగే 27 లక్షల మంది విద్యార్థులకు పాఠశాలల్లో పౌష్టికాహారం అందించడం ప్రజల పట్ల ఆయనకున్న నిబద్ధతను చాటుతోందని భట్టి విక్రమార్క వివరించారు. నిరుపేదలకు అండగా ఇందిరమ్మ ఇళ్లు, మహిళల ఆర్థిక స్వావలంబన కోసం అక్కాచెల్లెమ్మలకు వడ్డీ లేని రుణాలు అందిస్తూ ప్రజా సంక్షేమమే అజెండాగా ఈ ప్రభుత్వం ముందుకు సాగుతోందన్నారు. గత పాలకుల హయాంలో నిరంతరం భయంతో బతికిన తెలంగాణ ప్రజలకు, నేడు నిజమైన స్వేచ్ఛా స్వతంత్ర జీవనాన్ని ప్రసాదించిన ధీశాలి రేవంత్ రెడ్డి అని డిప్యూటీ సీఎం కొనియాడారు.

# అభివృద్ధి కార్యాక్రమాల్లో వేగం పెంచాలి

(మొదటి పేజీ తరువాయి)

అఫర్డబుల్ ఎల్‌ఐజి అర్బన్ హౌసింగ్ పై కూడా చూపించాలన్నారు. క్యూర్ పరిధిలో పేదల జీవనోపాధికి ఇబ్బంది లేకుండా నియోజకవర్గాన్ని యూనిట్‌గా తీసుకొని పేదలు ప్రస్తుతం నివసిస్తున్న ప్రాంతాలకు సమీపంలో ఇండ్లు నిర్మించాలని ప్రభుత్వం నిర్ణయించింది. ప్రభుత్వ ఆలోచనల మేరకు రెవెన్యూ , హౌసింగ్ విభాగాల అధికారులు సమిష్టిగా సమన్వయంతో పనిచేయాలని సూచించారు. వీలైనంత త్వరితగతిన పేదలకు ఇళ్లు అందించే విధంగా స్థానిక పరిస్థితులకు అనుగుణంగా ఇప్పటికే ఖరారైన స్థలాలలో పొజిషన్ తీసుకొని ఇళ్ల నిర్మాణాలకు అవసరమైన కార్యాచరణను వేగవంతంగా రూపొందించాలి. ఇంకా కొన్ని నియోజకవర్గాలలో స్థలాలను గుర్తించి తక్షణమే ఖరారు చేయాలి. క్యూర్ పరిధిలోని 26 నియోజకవర్గాలకు గాను ప్రతి నియోజకవర్గంలో తొలి విడతలో 500 ఇళ్లు నిర్మిస్తున్నాం. ఈ ఇళ్లకు సంబంధించి టెండర్లను వీలైనంత త్వరలో ఖరారు చేస్తాం అని అన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా పది ఆర్డీవో, 107 తహశీల్దార్, స్టాంప్స్ / రిజిస్ట్రేషన్‌కు సంబంధించి రెండు డిఐజి , నాలుగు జిల్లా సబ్ రిజిస్ట్రార్ 52 సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాలకు శాశ్వత భవనాలు నిర్మిస్తున్నాం. ఈ భవనాలన్నీ ఒకే డిజైన్‌లో ఉంటాయన్నారు. ఈ భవనాలన్నీ ఒకే నమూనాలో, ఆధునిక సదుపాయాలతో, ప్రజలకు సౌకర్యవంతంగా ఉండేలా నిర్మిస్తున్నాం. భవిష్యత్ అవసరాలను దృష్టిలో ఉంచుకుని విద్యుత్ ఆదా, పర్యావరణ పరిరక్షణ లక్ష్యాలతో సోలార్ పార్కింగ్ సదుపాయాలు కల్పిస్తాం' అని మంత్రి పొంగులేటి తెలిపారు. ఈ సమావేశంలో హౌసింగ్ కార్యదర్శి వి.పి. గౌతమ్, స్టాంప్స్ / రిజిస్ట్రేషన్ ఐజీ రాజీవ్ గాంధీ హనుమంతు తదితరులు పాల్గొన్నారు.

# భట్టి విక్రమార్క గోబెల్స్ ప్రచారం

(మొదటి పేజీ తరువాయి)

రూ.4.14 లక్షల కోట్లు మాత్రమే. కల్యాణ లక్ష్మి, కేసీఆర్ కిట్ వంటి పథకాలను కేసీఆర్ అమలు చేశారు. నిధులు లేవని కేసీఆర్ ఏనాడూ సంక్షేమ పథకాలను ఆపలేదు. ఎన్నో చేస్తామని ఆనాడు కాంగ్రెస్ నేతలు బాండ్లు రాసిచ్చారు. కాంగ్రెస్ నేతల అనుభవం స్కామ్‌లు చేసేందుకే ఉపయోగపడుతోందని విమర్శించారు.రాష్ట్ర అప్పులపై డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క అసత్యాలు చెబుతున్నారని, హామీల నుంచి ప్రజల దృష్టి మళ్లించేందుకే గోబెల్స్ ప్రచారం చేస్తున్నారని హరీశ్ రావు అన్నారు. రాష్ట్రంలో లేని అప్పులను ఉన్నట్టుగా చూపిస్తూ కాంగ్రెస్ నేతలు గోబెల్స్ ప్రచారం చేస్తున్నారని ఆయన మండిపడ్డారు. ప్రభుత్వం ఎదుర్కొంటున్న వైఫల్యాల నుంచి, తమపై జరుగుతున్న డ్యామేజ్ నుంచి తప్పించుకునేందుకే భట్టి విక్రమార్క ఇప్పుడు కొత్త డ్రామాలకు తెరలేపారని, అందులో భాగమే ఇలా మాట్లాడుతున్నారని హరీశ్ రావు ఎద్దేవా చేశారు. ఎన్నికల ముందు ప్రజలను ఆకట్టుకోవడానికి కాంగ్రెస్ నేతలు అడ్డగోలుగా హామీలు ఇచ్చారు. అధికారంలోకి వచ్చాక వాటిని అమలు చేయలేక చేతులెత్తేస్తూ ఇలాంటి కుంటిసాకులను చెబుతున్నారు. ప్రజలను నమ్మించి ఓట్లు రాబట్టుకునేందుకే ఆనాడు గ్యారంటీ కార్డులు పంచారు. తీరా ఇప్పుడు వాటిని అమలు చేయాల్సి వచ్చేసరికి రోజుకో మాట, పూటకో సాకు చెబుతూ కాలయాపన చేస్తున్నారు. కాంగ్రెస్ నేతలు కోపంతో ఊగిపోయినంత మాత్రాన వాస్తవాలు మారిపోవు. ఇచ్చిన హామీల నుంచి ప్రజల దృష్టిని మళ్లించేందుకే కాంగ్రెస్ ఈ విధమైన రాజకీయ ఎత్తుగడలు వేస్తోందని అన్నారు.

# రేవంత్ రెడ్డికి బండి శుభాకాంక్షలు



**హైదరాబాద్, జూలై 4 :** ప్రజా జీవితంలో రెండు దశాబ్దాలు పూర్తి చేసుకున్న ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి కేంద్ర మంత్రి బండి సంజయ్ శుభాకాంక్షలు తెలియజేశారు. శనివారం మీడియాతో మాట్లాడుతూ.. కేసీఆర్, రేవంత్‌రెడ్డి ఇద్దరూ కూడా కష్టపడి పైకొచ్చినవారే అని అన్నారు. సీఎం రేవంత్ 6 గ్యారంటీలు అమలు చేయాలని కోరారు. సర్ పేరుతో కాంగ్రెస్ ప్రభుత్వం కుట్ర చేస్తోందని ఆరోపించారు.హిందువుల ఓట్లను తొలగించే కుట్ర జరుగుతోందని కేంద్ర మంత్రి విమర్శించారు. ఇదే జరిగితే తెలంగాణలో హిందువులే మైనారిటీలయ్యే ప్రమాదం ఉందన్నారు. మజ్లిస్‌తో కుమ్మక్కై హిందువుల ఓట్లు తొలగించే కుట్ర జరుగుతోందని మండిపడ్డారు. అధికారులకు

# ములుగు పోలీసుల ఆధ్వర్యంలో ఉచిత రెసిడెన్షియల్ పోలీసు రిక్రూట్‌మెంట్ కోచింగ్

- 7000 పోలీసు ఉద్యోగాలకు గ్రీన్ సిగ్నల్
- యువతకు బంగారు అవకాశం
- సమీప పోలీస్ స్టేషన్ లో పేర్లు నమోదు చేసుకోండి



**ములుగు జిల్లా ప్రతినిధి జూలై 04(పీపుల్స్ న్యూస్)**
మహిళా అభ్యర్థులను స్వాగతిస్తున్నాం... తమ కలల్ని సాకారం చేసుకోండిపేద, గ్రామీణ, మారుమూల ప్రాంతాల యువత సద్వినియోగం చేసుకోవాలిజిల్లా ఎస్ పి కేకాన్ సుధీర్ రామనాథ్ ఐ పి ఎస్ తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం పోలీసు శాఖ, ఎస్‌పీఎఫ్ ( ఎస్ పి ఎఫ్), జైళ్ల శాఖ ) తదితర విభాగాల్లో సుమారు 7,000 ఖాళీల భర్తీకి గ్రీన్ సిగ్నల్ ఇచ్చిన నేపథ్యంలో, ములుగు జిల్లా నిరుద్యోగ యువతకు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకునేలా ములుగు జిల్లా పోలీసు శాఖ ఉచిత శిక్షణ కార్యక్రమం చేపట్టింది.జిల్లా ఎస్ పీ కేకన్ సుధీర్ రామనాథ్ ఐ పి ఎస్ పర్యవేక్షణలో ఈ యొక్క కార్యక్రమం జరగనుంది. అనుభవజ్ఞులైన, అర్హత కలిగిన అధ్యాపకులు ఫిజికల్ ట్రైనర్లతో ఉచిత రెసిడెన్షియల్ కోచింగ్ నిర్వహించేందుకు సన్నాహాలు జరుగుతున్నాయి. ఈ కోచింగ్‌లో ఉచిత వసతి, తరగతి బోధన, శారీరక శిక్షణ అందించబడుతుంది.ములుగు జిల్లాలో ముఖ్యంగా పేద, గ్రామీణ, గిరిజన మారుమూల ప్రాంతాల యువతీ యువకులు ఈ అరుదైన అవకాశాన్ని సద్వినియోగం చేసుకుని తమ జీవిత లక్ష్యాన్ని సాధించాలని జిల్లా పోలీసు శాఖ కోరుతోంది.పోలీసు శాఖలో చేరాలనే ఆసక్తి ఉన్న అభ్యర్థులు తమ సమీప పోలీస్ స్టేషన్‌లో పేర్లు నమోదు చేసుకోవాలి.కోచింగ్ ప్రారంభ తేదీ, స్థలం మరియు ఇతర పూర్తి వివరాలను త్వరలో అధికారికంగా మీడియా ద్వారా ప్రకటించబడుతుంది."ఈ సువర్ణావకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని... కష్టపడి శ్రమించి తెలంగాణ పోలీసు శాఖలో ఉద్యోగం సాధించి జీవితంలో ఉన్నత స్థాయికి చేరుకోవాలని." ఎస్ పి యువతకు తెలియచేయడం జరుగుతుంది.

# బీసీలు బానిసలు కాదు..బాద్ షాలు కావాలి

-బీసీ సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షుడు వేముల మహేందర్ గౌడ్



**మొగుళ్ళ పల్లి ప్రతినిధి జూలై 04 ( పీపుల్స్ న్యూస్)**
దశాబ్దాల రాజకీయ బానిసత్వానికి చరమగీతం పాడి..బీసీలు బానిసలుగా కాకుండా..బాద్ లుగా ఎదగాలని బీసీ సంక్షేమ సంఘం జయశంకర్ భూపాలపల్లి జిల్లా అధ్యక్షుడు వేముల మహేందర్ గౌడ్ పిలుపునిచ్చారు. శనివారం ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. రాష్ట్ర జనాభాలో 60 శాతానికి పైగా ఉన్న 136 బీసీ కులాలు బలహీన వర్గాలు కావని, సమాజానికి వెన్నెముక లాంటి శక్తి అని అన్నారు. రాజకీయంగా బీసీలు మరింత బలోపేతం కావాల్సిన అవసరం ఉందని, దశాబ్దాలుగా కొనసాగుతున్న బానిసత్వానికి ముగింపు పలకాలని మహేందర్ గౌడ్ బీసీ సమాజాన్ని కోరారు. 2028 ఎన్నికలను లక్ష్యంగా చేసుకొని బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు జాజుల శ్రీనివాస్ గౌడ్ నేతృత్వంలో కార్యాచరణను రూపొందిస్తున్నామని తెలిపారు. 2028లో జరిగే అసెంబ్లీ, పార్లమెంట్ ఎన్నికల్లో బీసీల రాజకీయ బలాన్ని నిరూపించేందుకు కృషి చేస్తామన్నారు. గ్రామ స్థాయి నుండి వార్డుల స్థాయి వరకు బలమైన కమిటీలను ఏర్పాటు చేసి, బీసీ ఉద్యమాన్ని ప్రతి ఇంటికి తీసుకెళ్లేందుకు చర్యలు చేపడతామని వెల్లడించారు.

# ములుగు సర్కిల్‌లో బదిలీపై వెళ్లిన అధికారులకు ఘన సన్మానం

-- నూతన అధికారులకు ఆత్మీయ స్వాగతం

**ములుగు జిల్లా ప్రతినిధి జూలై 04 (పీపుల్స్ న్యూస్)**
ములుగు సర్కిల్ విద్యుత్ శాఖ ఆధ్వర్యంలో శనివారం ములుగులోని ఆర్ /బి గెస్ట్ హౌస్లో బదిలీపై వెళ్లిన అధికారులకు ఘన సన్మాన కార్యక్రమం నిర్వహించారు. అదే సందర్భంగా నూతనంగా బాధ్యతలు స్వీకరించిన అధికారులకు ఆత్మీయ స్వాగతం పలికారు.ఈ కార్యక్రమంలో బదిలీపై వెళ్లిన సూపరింటెండింగ్ ఇంజనీర్ ఏ ఆనందం, బదిలీపై వెళ్లిన డివిజనల్ ఇంజనీర్, ములుగు పి నాగేశ్వరరావు ను ఘనంగా సన్మానించి, ములుగు సర్కిల్ అభివృద్ధికి వారు అందించిన విశిష్ట సేవలను కొనియాడారు.అలాగే నూతన సూపరింటెండింగ్ ఇంజనీర్ బి బిక్షపతి, డివిజనల్ ఇంజనీర్/టెక్నికల్ ఇన్చార్జి డివిజినల్ ఇంజనీర్ ములుగు కన్న రాజు, డివిజనల్ ఇంజనీర్, ఏటూరునాగారం జె పురుషోత్తం, అకౌంట్స్ ఆఫీసర్, ములుగు రాజ్‌కుమార్ కు పుష్పగుచ్చాలు అందజేసి, శాలువాలతో సత్కరించి నూతన బాధ్యతల్లో విజయవంతం కావాలని ఆకాంక్షించారు.ఈ సందర్భంగా అధికారులు మాట్లాడుతూ, విద్యుత్ వినియోగదారులకు నాణ్యమైన, అంతరాయం లేని విద్యుత్ సరఫరా అందించేందుకు అధికారులు, ఉద్యోగులు, కార్మికులు సమన్వయంతో పనిచేయాలని పిలుపునిచ్చారు.ఈ కార్యక్రమంలో ఇంజినీరింగ్, అకౌంట్ సిబ్బంది, కార్మిక సోదరులు, కట్టర్ , బ్రేక్ డౌన్ టీం సభ్యులు, వివిధ ఉద్యోగ సంఘాల నాయకులు, కాంట్రాక్టర్లు పెద్ద సంఖ్యలో పాల్గొని, బదిలీపై వెళ్లిన అధికారులకు శుభాకాంక్షలు తెలియజేసి, నూతన అధికారులకు ఆత్మీయ స్వాగతం పలికారు.



# సీఎం రేవంత్ రెడ్డి నీ సన్మానించిన మంత్రి సీతక్క



**ములుగు జిల్లా ప్రతినిధి జూలై 04 ( పీపుల్స్ న్యూస్)**
ప్రజా ప్రతినిధిగా ప్రజా సేవలో 20 ఏళ్లు పూర్తి చేసుకున్న సీఎం రేవంత్ రెడ్డిని తన నివాసంలో కలిసి శాలువాతో సన్మానించి శుభాకాంక్షలు తెలిపిన మంత్రి సీతక్క

# మీసేవలో మరో కొత్త సర్వీస్ ఎస్ ఎస్ సి ఈ మే ప్రింట్ సౌకర్యం అందుబాటులో ఈ-డిస్ట్రిక్ట్ మేనేజర్ దేవేందర్





**ములుగు జిల్లా ప్రతినిధి జూలై 04 (పీపుల్స్ న్యూస్)**
తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం డిజిటల్ తెలంగాణ లక్ష్య సాధనలో భాగంగా పౌరులకు మరొక ముఖ్యమైన సేవను మీసేవ ద్వారా అందుబాటులోకి తీసుకువచ్చింది.ఎస్ఎస్‌సీ మార్క్ మెమోను కోల్పోయిన లేదా పోగొట్టుకున్న విద్యార్థులు ఇకపై తమ ఎస్ ఎస్ సి ఈ మెమో ను మీసేవ కేంద్రాల ద్వారా సులభంగా పొందవచ్చని ఈ-డిస్ట్రిక్ట్ మేనేజర్ సామాజి దేవేందర్ తెలిపారు.ఈ ఎస్ డి మీసేవ కమిషనర్ జారీ చేసిన ఉత్తర్వుల మేరకు 2004 సంవత్సరం నుండి పూర్తయిన ఎస్ఎస్‌సీ పరీక్షల ఈ మెమో లను మీసేవ ద్వారా ప్రింట్ తీసుకునే సౌకర్యాన్ని ప్రభుత్వం కల్పించినట్లు ఆయన వివరించారు.దరఖాస్తుదారులు తమ ఎస్ఎస్‌సీ హాల్ టికెట్ నంబర్ పరీక్ష పూర్తయిన సంవత్సరం వివరాలను అందజేస్తే, వెంటనే మీసేవ స్టేషనరీపై అధికారిక ఎస్ ఎస్ సి ఈ మెమో ప్రింట్ అందజేయబడుతుందని తెలిపారు.ఈ సేవకు ప్రభుత్వం నిర్ణయించిన రూ.62/- సేవా రుసుము చెల్లించాల్సి ఉంటుందని, ఈ సౌకర్యం రాష్ట్రంలోని అన్ని మీసేవ కేంద్రాల్లో అందుబాటులో ఉందని పేర్కొన్నారు.ములుగు జిల్లా ప్రజలు ఈ సేవను సద్వినియోగం చేసుకోవాలని ఈ-డిస్ట్రిక్ట్ మేనేజర్ సామాజి దేవేందర్ కోరారు.

# టీజీ ఎప్‌సెట్ మాక్ సీట్ల అలాట్‌మెంట్ పూర్తి

- ఏ కళాశాలలో మీకు సీటొచ్చింది



తెలంగాణ రాష్ట్రంలో ఇంజినీరింగ్ సీట్ల భర్తీ కోసం నిర్వహించిన ఎప్‌సెట్ తొలి విడత కౌన్సెలింగ్‌కు సంబంధించి శనివారం మాక్ అలాట్‌మెంట్ ప్రక్రియను అధికారులు పూర్తి చేశారు. ఈ మాక్ అలాట్‌మెంట్‌లో 79,313 మంది విద్యార్థులకు మాక్ సీట్లను కేటాయించారు. విద్యార్థులు ఎంపిక చేసుకున్న వివరాల ప్రకారం కళాశాల, కోర్సుల వారీగా మాక్ సీట్ల కేటాయింపు చేపట్టి జాబితాను సంబంధిత వెబ్‌సైట్‌లో అందుబాటులో ఉంచారు. విద్యార్థులు తమ లాగిన్‌లో లాగిన్ ఐడీ నంబర్, ఎప్‌సెట్ హాల్‌టికెట్ నెం, పాస్‌వర్డ్, డేట్ ఆఫ్ బర్త్, క్యాప్చా కోడ్ తదితర వివరాలు నమోదు చేసి మాక్ అలాట్‌మెంట్ ఆర్డర్‌ను డౌన్‌లోడ్ చేసుకోవచ్చు.
షెడ్యూల్ ప్రకారమే మాక్ సీట్ల కేటాయింపు : రాష్ట్రంలోని 179 కళాశాలల్లో కన్వీనర్ కోటా కింద విద్యార్థులకు 89వేలకు పైగా సీట్లు అందుబాటులో ఉండగా ఎప్‌సెట్-2026 కౌన్సెలింగ్ కోసం దాదాపు 94వేల మంది స్లాట్‌బుకింగ్ చేసుకున్నారు. అయితే, సీట్ల కోసం 88వేల మంది అభ్యర్థులు ఆన్‌లైన్లో ఆప్షన్లు నమోదు చేశాంతొలివిడత సీట్ల కేటాయింపు జులై 10న : ప్రాథమిక అంచనా ప్రకారం వచ్చే అవకాశమున్న సీటు^. ఈ క్రమంలో తొలుత ప్రకటించిన షెడ్యూల్ ప్రకారమే ఉన్నత విద్యామండలి అధికారులు ఈ సాయంత్రం కాలేజీల వారీగా మాక్ సీట్ల అలాట్‌మెంట్ వివరాలను విడుదల చేశారు.కాలేజీల వారీగా సీట్ అలాంట్‌మెంట్ వివరాల కోసం ఈ లింక్?పై క్లిక్ చేయండితొలివిడత సీట్ల కేటాయింపు జులై 10న : ప్రాథమిక అంచనా ప్రకారం వచ్చే అవకాశమున్న సీటు నచ్చకున్నప్పటికీ, ఇతర కాలేజీల్లో మెరుగైన సీటు కోరుకుంటే ఆప్షన్లను పునఃసమీక్షించుకుని ప్రాధాన్య క్రమాన్ని విద్యార్థులు మార్చుకోవచ్చు. ఈ పునఃసమీక్ష కోసం జులై 5వ తేదీ నుంచి 7 వరకు అవకాశం ఉంటుంది. ఒకవేళ అభ్యర్థి త్రొలివిడత సీట్ల కేటాయింపు జులై 10న : ప్రాథమిక అంచనా ప్రకారం వచ్చే అవకాశమున్న సీటు పాథమిక సీట్ల కేటాయింపులో మార్పులు అవసరం లేదని భావించినట్లయితే తొలుత ఇచ్చిన ఆప్షన్లనే పరిగణనలోకి తీసుకుని సీట్లను కేటాయిస్తారు. తొలి విడత సీట్ల కేటాయింపు జులై 10వ తేదీన వెల్లడిస్తామని, ప్రవేశాలకు 14 తుది గడువుగా ఉంటుందని ఇప్పటికే షెడ్యూల్‌లో పేర్కొన్నారు.

# పెద్దపల్లి జోన్‌లో పోలీస్‌స్టేషన్ల పరిధిలో పలు గ్రామాల మార్పులు



**పెద్దపల్లి : పెద్దపల్లి జోన్ ( )**
పరిధిలో ఉన్న గోదావరిఖని వన్‌టౌన్, రామగుండం, బసంత్‌నగర్ పోలీస్ స్టేషన్ల పరిధిలో మార్పులు చేస్తూ తెలంగాణ ప్రభుత్వం అధికారిక గెజిట్ ఉత్తర్వులు జారీ చేసిందని రామగుండం పోలీస్ కమిషనర్ అంబర్ కిశోర్ ఝా ) తెలిపారు.పరిపాలన సౌలభ్యం, ప్రజలకు పోలీసు సేవలను మరింత చేరువ చేయడం, శాంతిభద్రతల నిర్వహణను సమర్థవంతంగా చేపట్టడం లక్ష్యంగా ప్రభుత్వం ఈ నిర్ణయం తీసుకుందని వెల్లడించారు. ప్రస్తుతం గోదావరిఖని టూ టౌన్ పోలీస్ స్టేషన్ పరిధిలో ఉన్న జనగామ గ్రామం, సమ్మక్క,సారలమ్మ గద్దెలు గోదావరి వంతెన, గంగానగర్ ప్రాంతాలను గోదావరిఖని వన్‌టౌన్ పోలీస్ స్టేషన్ పరిధిలోకి మార్చారని వివరించారు.ప్రస్తుతం పెద్దపల్లి సర్కిల్ పరిధిలో ఉన్న బసంత్‌నగర్ పోలీస్ స్టేషన్‌ను రామగుండం సర్కిల్ పరిధిలోకి మార్చి, ప్రస్తుతం గోదావరిఖని టూ టౌన్ పోలీస్ స్టేషన్ పరిధిలో ఉన్న జనగామ గ్రామం, సమ్మక్క,సారలమ్మ గద్దెలు గోదావరి వంతెన, గంగానగర్ ప్రాంతాలను గోదావరిఖని వన్‌టౌన్ పోలీస్‌గోదావరిఖని ఉపవిభాగం (సబ్‌డివిజన్) పరిధిలో చేర్చారని ఆయన వివరించారు. అంతర్గాం పోలీస్ స్టేషన్ పరిధిలో ఉన్న లింగాపూర్, కుందన్‌పల్లి గ్రామాలను రామగుండం పోలీస్ స్టేషన్ పరిధిలోకి చేర్చారని వెల్లడించారు.

## ప్రమాదవశాత్తు నీటిలో పడి వృద్ధుడు మృతి.



**జనగామ/ బచ్చన్నపేట, జూలై 4 :** జనగామ జిల్లా బచ్చన్నపేట మండలంలోని బీడీ కాలనీ శివారులో ఉన్న గోధుమ కుంటలో... ప్రమాదవశాత్తు నీటిలో పడి ఓ వృద్ధుడు మృతి చెందిన సంఘటన శనివారం చోటుచేసుకుంది.మృతుడు ఏలూరి బాలరాం (60), తండ్రి మల్లయ్య, వృత్తి: చేనేత కార్మికుడు, నివాసం: బచ్చన్నపేట. శనివారం ఉదయం కాలకృత్యాలు తీర్చుకునేందుకు గోధుమ కుంట వద్దకు వెళ్లిన సమయంలో ప్రమాదవశాత్తు నీటిలో పడి మృతి చెందినట్లు ప్రాథమిక విచారణలో వెల్లడైంది. మృతుడికి గతంలో గుండె సంబంధిత ఆరోగ్య సమస్యలు కూడా ఉన్నట్లు కుటుంబ సభ్యులు తెలిపారు.మృతుడి భార్య భవాని ఇచ్చిన ఫిర్యాదు మేరకు బచ్చన్నపేట పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టినట్లు హెడ్ కానిస్టేబుల్ శోభన్ తెలిపారు.ఈ సందర్భంగా వర్షాకాలంలో ప్రజలు నీటి కుంటలు, వాగులు, చెరువులు మరియు ఇతర నీటి వనరుల సమీపంలో అత్యంత అప్రమత్తంగా ఉండాలని, ప్రమాదకర ప్రాంతాలకు వెళ్లకుండా తగిన జాగ్రత్తలు తీసుకోవాలని బచ్చన్నపేట పోలీసులు విజ్ఞప్తి చేశారు.


## మిస్సింగ్ కేసును ఛేదించిన రామగుండం పోలీసులు


**:- తల్లి,కుమారుడిని కుటుంబ సభ్యులకు అప్పగింత**



**రామగుండం,జులై 4:-**
రామగుండం పోలీస్ కమిషనరేట్ పరిధిలోని రామగుండం పోలీస్ స్టేషన్ పోలీసులు సాంకేతిక పరిజ్ఞానాన్ని వినియోగించి ఓ మిస్సింగ్ కేసును విజయవంతంగా ఛేదించి,రెండేళ్లుగా కనిపించకుండా ఉన్న తల్లి,కుమారుడిని గుర్తించి వారి కుటుంబ సభ్యులకు అప్పగించారు.భరత్‌నగర్‌కు చెందిన చెట్టి రమేష్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు,ఆయన భార్య చెట్టి సంధ్య,12 ఏళ్ల కుమారుడు, 2024 మార్చి 8న ఇంటి నుంచి వెళ్లిపోయి కనిపించకపోవడంతో రామగుండం పోలీస్ స్టేషన్‌లో మిస్సింగ్ కేసు నమోదు చేశారు.కేసు నమోదు అనంతరం హెడ్ కానిస్టేబుల్ బానయ్య,పోలీస్ కానిస్టేబుల్ అశోక్ కేసును ప్రత్యేకంగా పరిశీలిస్తూ బంధువులు, స్నేహితులు, పరిచయస్తులను విచారించారు.అలాగే సాంకేతిక పరిజ్ఞానాన్ని వినియోగించి ఫోన్ కాల్ వివరాలు,ఇతర ఆధారాలను విశ్లేషించారు.ఈ క్రమంలో వారు నెల్లూరులో ఉన్నట్లు గుర్తించి,అక్కడి నుంచి వారిని సురక్షితంగా తీసుకువచ్చారు.శనివారం గోదావరిఖనిలో ఏసీపీ ఎం.రమేష్,రామగుండం సీఐ కృష్ణ,ఎస్ఐ సంధ్యారాణి సమక్షంలో తల్లి, కుమారుడిని వారి కుటుంబ సభ్యులకు అప్పగించారు.ఈ సందర్భంగా మిస్సింగ్ కేసును చాకచక్యంగా ఛేదించి,తల్లి,కుమారుడి ఆచూకీ కనుగొన్న హెడ్ కానిస్టేబుల్ బానయ్య,పోలీస్ కానిస్టేబుల్ అశోక్‌లను ఏసీపీ ఎం.రమేష్ అభినందించి,వారి విధి నిర్వహణలో చూపిన చొరవను ప్రశంసించారు.

## పీపుల్స్ న్యూస్ కథనానికి స్పందించిన అధికారులు.. నర్సింగాపూర్ రోడ్డు మరమ్మతులకు శ్రీకారం







**ములుగు జిల్లా ప్రతినిధి జూలై 04 (పీపుల్స్ న్యూస్)**
లక్ష్మీదేవిపేట ములుగు జిల్లా,ఇటీవల పీపుల్స్ న్యూస్లో ప్రచురితమైన అధ్వానంగా మారిన తండా నర్సింగాపూర్ రోడ్డు" కథనానికి అధికారులు స్పందించారు. కథనం ప్రచురితమైన వెంటనే సంబంధిత అధికారులు సమస్యను పరిశీలించి, నర్సింగాపూర్ రోడ్డు మరమ్మతుల పనులకు చర్యలు ప్రారంభించారు.వర్షాల కారణంగా రోడ్డంతా గుంతలమయంగా మారి, బురదతో నిండిపోవడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని పీపుల్స్ న్యూస్ కథనం ద్వారా వెలుగులోకి వచ్చింది. దీనిపై స్పందించిన అధికారులు రోడ్డును పరిశీలించి, తాత్కాలికంగా గుంతలు పూడ్చే పనులను ప్రారంభించారు. త్వరలోనే శాశ్వత పరిష్కారం కోసం అవసరమైన చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు.ఈ సందర్భంగా గ్రామస్థులు, ప్రజాప్రతినిధులు పీపుల్స్ న్యూస్కు కృతజ్ఞతలు తెలిపారు. ప్రజా సమస్యలను వెలుగులోకి తీసుకువచ్చి, అధికారుల దృష్టికి తీసుకెళ్లడంలో మీడియా కీలక పాత్ర పోషిస్తోందని వారు పేర్కొన్నారు. ప్రజా సమస్యల పరిష్కారానికి స్పందించిన అధికారులను కూడా స్థానికులు అభినందించారు.

## పంట మార్పిడి, ఆయిల్ పామ్ పంటల సాగును ప్రోత్సహించాలి.

**- కాలానుగుణ వ్యాధులు వ్యాపించకుండా తగు చర్యలు తీసుకోవాలి.**
**- రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సంజయ్ జాజు.**





**ములుగు జిల్లా ప్రతినిధి జూలై 04 (పీపుల్స్ న్యూస్)**
పంట మార్పిడి విధానాలు, ఆయిల్ పామ్ పంటల సాగు విస్తీర్ణం పెంచేలా రైతులను అధికారులు ప్రోత్సహించాలని రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సంజయ్ జాజు అధికారులను ఆదేశించారు.శనివారం, హైదరాబాదులోని రాష్ట్ర సచివాలయం నుంచి సీఎస్ సంజయ్ జాజు అన్ని జిల్లాల కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్షా సమావేశం నిర్వహించారు.ఈ సందర్భంగా కలెక్టరేట్ కార్యాలయంలోని వీడియో కాన్ఫరెన్స్ హాల్ నుంచి జిల్లా కలెక్టర్ అదనపు కలెక్టర్ స్థానిక సంస్థలు సంపత్ రావు హాజరయ్యారు.ఈ సందర్భంగా సీఎస్ మాట్లాడుతూ.. రాష్ట్రంలో 2026 – 27 సంవత్సరానికి 85 వేల ఎకరాలలో ఆయిల్ పామ్ పంట సాగు చేసేందుకు లక్ష్యంగా నిర్దేశించామన్నారు. దీనికి అనుగుణంగా జిల్లాలలో అధికారులు చొరవ తీసుకోవాలన్నారు. పంట మార్పిడి విధానాలను అవలంబించాలన్నారు. కూరగాయల సాగు వైపు దృష్టి సారించాలని వివరించారు. సూక్ష్మ సేద్య పద్ధతులు రైతులు పాటించేలా వారిని ప్రోత్సహించాలని తెలిపారు.యూరియా, డిఎపి, ఇతర కాంప్లెక్స్ ఎరువులన్నీ రైతులకు సరిపడినన్ని అందించాలన్నారు.ఎరువులను పక్కదారి పట్టిస్తే కఠిన చర్యలు తీసుకోవాలన్నారు. జిల్లాల కలెక్టర్లు స్వయంగా ఈ అంశంపై పటిష్ట నిఘా ఉంచాలని వివరించారు. ఫార్మర్ రిజిస్ట్రీ ప్రక్రియను త్వరితగతిన పూర్తి చేయాలని ఆదేశించారు.జిల్లాల వారీగా ఫార్మర్ రిజిస్ట్రీ ప్రక్రియను సమీక్షిస్తూ, దేశంలోనే ఫార్మర్ రిజిస్ట్రీలో తెలంగాణ రాష్ట్రం 71.45 శాతంతో మొదటి స్థానంలో ఉందన్నారు.వర్షాకాలం కాలానుగుణ వ్యాధులు వ్యాపించే ప్రమాదం ఉందని, అధికారులంతా అప్రమత్తంగా ఉండాలని సూచించారు. డెంగ్యూ, మలేరియా, టైఫాయిడ్, తదితర వ్యాధులు వ్యాపించకుండా ముందస్తు చర్యలు తీసుకోవాలన్నారు. ఈ వీడియో కాన్ఫరెన్స్ లో డి ఎం హెచ్ ఓ గోపాల్ రావు, డీఈవో సిద్ధార్థ రెడ్డి, ఇరిగేషన్ ఈ ఈ అప్పలనాయుడు, మిషన్ భగీరథ డి ఈ సునీత సంబంధిత అధికారులు, పాల్గొన్నారు.

## ఎన్యూమరేషన్ ఫారాల డిజిటలీకరణ ప్రక్రియను వేగవంతం చేయాలి

**- మల్లంపల్లి మండలంలోని పోలింగ్ కేంద్రాలను పరిశీలించిన ఎన్నికల రిజిస్ట్రేషన్ అధికారి,ఆర్డీఓ కృష్ణవేణి**

**ములుగు జిల్లా ప్రతినిధి జూలై 04 ( పీపుల్స్ న్యూస్)**
ప్రత్యేక ఓటరు జాబితా సవరణ కార్యక్రమంలో భాగంగా ఎన్యూమరేషన్ ఫారాల డిజిటలీకరణ ప్రక్రియను వేగవంతంగా పూర్తి చేయాలని ఎన్నికల రిజిస్ట్రేషన్ అధికారి, ఆర్డీవో కృష్ణవేణి సంబంధిత బూత్ స్థాయి అధికారులను ఆదేశించారు.
శనివారం మల్లంపల్లి మండల కేంద్రం లోని, గౌస్‌పల్లి గ్రామంలోని పోలింగ్ కేంద్రాలను ఎన్నికల రిజిస్ట్రేషన్ అధికారి, ఆర్డీవో కృష్ణవేణి పరిశీలించారు. ఈ సందర్భంగా ఇంటింటికీ సేకరించిన ఎన్యూమరేషన్ ఫారాల వివరాలను బూత్ స్థాయి అధికారుల ద్వారా బీఎల్ఓ యాప్‌లో నమోదు చేస్తున్న విధానాన్ని పరిశీలించారు.ఎన్యూమరేషన్ ఫారాల డిజిటలీకరణను ఎలాంటి జాప్యం లేకుండా వేగవంతంగా పూర్తి చేయాలని, ప్రతి ఫారంలో నమోదు చేసే వివరాలను క్షుణ్ణంగా పరిశీలించి ఖచ్చితత్వంతో బీఎల్ఓ యాప్‌లో నమోదు చేయాలని




బూత్ స్థాయి అధికారులకు సూచించారుఈ తనిఖీలో సంబంధిత ఎన్నికల సిబ్బంది, బూత్ స్థాయి అధికారులు పాల్గొన్నారు.

## కోర్టు విధులలో అలసత్వం వహించరాదు

**-నేర నిరూపనకు కోర్టులో సాక్షుల హాజరు అత్యంత కీలకము**
**- ఎస్ హెచ్ ఓ లు విచారణలో ఉన్న కేసుల పురోగతిని పరిశీంచాలి**
**--- ములుగు డి.ఎస్.పి రవీందర్**



**ములుగు జిల్లా ప్రతినిధి జూలై 04 (పీపుల్స్ న్యూస్)**
కోర్టులలో నేరనిరూపణకు సాక్షుల యొక్క హాజరు ఎంతో కీలకంగా మారుతుందని ములుగు డి.ఎస్.పి రవీందర్ తెలియజేశారు. ఈరోజు అనగా 04.07.2026 నాడు ములుగు డీఎస్పీ కార్యాలయం నందు ములుగు సబ్ డివిజన్ అధికారులతో నిర్వహించిన సమీక్ష సందర్భంగా పై వ్యాఖ్యలు చేశారు. కోర్టు కానిస్టేబుల్ లు విధులలో అలసత్వం వహించరాదని, వారి విధులలో పారదర్శకత లోపిస్తే అట్టి వారిపై కఠినమైన చర్యలు తీసుకోబడతాయని హెచ్చరించారు. కోర్టు కానిస్టేబుల్ లు సకాలంలో సమన్స్ అందజేయాలని, విచారణలో ఉన్న కేసులు యొక్క పురోగతిని ఎప్పటికప్పుడు ఆన్లైన్లో నమోదు చేయాలని ఆదేశించారు. ఎస్హెచ్వోలు కూడా క్రమం తప్పకుండా కోర్టు కానిస్టేబుల్ యొక్క పనితీరును పరిశీలించాలని సూచించారు. విచారణలో ఉన్న కేసుల పురోగతిపై అవగాహన కలిగి ఉండాలని, సాక్షుల ను ప్రవేశపెట్టడంలో ఆసక్తిని కనబరచాలని నేరస్తులకు శిక్ష పడే విధంగా కృషి చేయాలని ఆదేశించారు. కోర్టులు జారీ చేసే నాన్ బెయిలబుల్ వారెంట్లను అమలు చేయడంలో నిర్లక్ష్యం వహించరాదని, నేరస్తులకు ఏ విధంగాను సహకరించరాదని హెచ్చరించారు.ప్రస్తుతం వర్షాకాలం ప్రారంభమైనందున ఎల్లవేళలా అప్రమత్తంగా ఉండాలని అధికారులందరూ వారి వారి పోలీస్ స్టేషన్ పరిధిలో ఉన్న నదులు, చెరువుల పైన అవగాహన కలిగి ఉండాలని, విపత్కర పరిస్థితి ఎదురైతే ఎల్లవేళలా ఎదుర్కొనేందుకు సిద్ధంగా ఉండాలని సూచించారు.

## రాష్ట్రంలో వీబీ జీ రాం జీకి ప్రభుత్వం పచ్చజెండా

**హైదరాబాద్:** ఉపాధి హామీ పథకంలో మార్పులు చేస్తూ కేంద్ర ప్రభుత్వం కొత్తగా తీసుకొచ్చిన వీబీ జీ రాం జీ తెలంగాణలోనూ అమలు కానుంది. ఈ మేరకు రాష్ట్ర ప్రభుత్వం ఇవాళ గెజిట్ నోటిఫికేషన్ జారీ చేసింది. ఈ పథకం నిబంధనల ప్రకారం ఒక ఆర్థిక సంవత్సరంలో కనీసం 100 రోజులు ఉండే పని దినాలు, 125కు పెరగనున్నాయి. ఈ నెల ఒకటో తేదీ నుంచే ఈ పథకాన్ని రాష్ట్రంలో అమలు పరచినట్లుగా రాష్ట్ర ప్రభుత్వం ఉత్తర్వులో పేర్కొంది. అమలు కోసం రాష్ట్రంలో ముఖ్యమంత్రి అధ్యక్షతన రాష్ట్ర స్థాయి రోజ్?గార్? గ్యారంటీ కౌన్సిల్? ఏర్పాటవుతుంది.ఈ శాఖ కమిషనర్ మెంబరే సెక్రటరీగా : రోజ్‌గార్ గ్యారంటీ కౌన్సిల్? ఏర్పాటైన తర్వాత గ్రామీణాభివృద్ధి, పంచాయతీ రాజ్? శాఖ మంత్రి దీనికి ఉపాధ్యక్షులుగా వ్యవహరిస్తారు. రాష్ట్ర ఆర్థిక, నీటి పారుదల, అటవీ, పురపాలిక, రెవన్యూ, పశు సంవర్ధక, వ్యవసాయ, విద్య, కార్మిక, ఎస్సీ, ఎస్టీ,



మహిళా, శాసనసభ వ్యవహారాల మంత్రులు, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శితో పాటు ఆయా శాఖల ఉన్నతాధికారులు కూడా సభ్యులుగా ఉంటారు. పంచాయతీరాజ్? కమిషనర్? సభ్యుడు? కార్యదర్శిగా పని చేస్తారు.ఆయా స్థాయిల్లో అమలు చేసేందుకు : రోజ్?గార్ గ్యారంటీ కౌన్సిల్ తమ వార్షిక నివేదికను అసెంబ్లీలో సమర్పించాలి. ఈ మేరకు రాష్ట్ర స్థాయి స్టీరింగ్ కమిటీ ఏర్పాటవుతుంది. దీనికి ప్రధాన కార్యదర్శి లేదా స్పెషల్ చీఫ్ సెక్రటరీ హోదా ఉన్న అధికారి నేతృత్వం వహిస్తారు. ఇది రాష్ట్ర ప్రణాళికను అమలు పరుస్తూ, ప్రభుత్వం అప్పగించే ఇతర కార్యకలాపాలను చేపడుతుంది. జిల్లా స్థాయిలో పథకాన్ని అమలు చేసేందుకు కలెక్టర్ సమన్వయకర్తగా పనిచేస్తారు. జిల్లా, ఈ పథకంలో చేరేందుకు అర్హులు వీరే : వీబీ జీరాంజీలో పని చేసేందుకు గ్రామీణ ప్రాంతాల్లో స్వచ్ఛందంగా ముందుకొచ్చే ప్రతి కుటుంబాన్ని గ్రామ పంచాయతీ నమోదు చేసుకొని, వారికి గ్రామీణ రోజ్?గార్? గ్యారంటీ కార్డులు అందించాలి. ఈ పథకంలో నైపుణ్యం లేని శారీరక శ్రమ కోసం నమోదిత కుటుంబంలోని ప్రతి వయోజన సభ్యునికి అప్లై చేసుకోవడానికి అర్హత ఉంటుంది. వీరికి కనీసం 125 రోజుల పాటు ఒక ఆర్థిక సంవత్సరంలో పని కల్పించాలి. వేతనాలను కేంద్ర ప్రభుత్వం నోటిఫై చేసిన ప్రకారం చెల్లిస్తారు.

## రాజధాని విషయంలో విధానం లేని నినాదం



**అమరావతి, జూలై 4:** వైసీపీ అధినేత వైఎస్ జగన్ మోహన్ రెడ్డిపై ఇరవై సూత్రాల కార్యక్రమాల అమలు చైర్మన్ లంకా దినకర్ తీవ్ర స్థాయిలో విరుచుకుపడ్డారు. రాజధానిపై జగన్‌కు కనీస అవగాహన లేదన్నారు. 'మావిగన్' తూటా లేని గన్ అని.. అది పేలదంటూ సెటైర్ విసిరారు. 'నిన్న మూడు రాజధానులు మా నినాదం అన్నారు.. ఈరోజు మావిగన్ మా నినాదం అన్నారు.. రేపు ఏమిటో అర్థం కానీ అయోమయం జగన్నాథం మా నినాదం అనే విధంగా జగన్ తీరు ఉంది' అంటూ వ్యాఖ్యానించారు. ప్రధాని నరేంద్ర మోదీ సంకల్పం వికసిత్ భారత్, ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ధ్యేయం స్వర్ణ ఆంధ్రప్రదేశ్ అని అన్నారు. జగన్ సంకల్పం, ధ్యేయం మాత్రం వినాశక ఏపీ అంటూ మండిపడ్డారు. డబుల్ ఇంజన్ సర్కార్ నేతృత్వంలో రాష్ట్రం సమగ్ర సమ్మిళిత అభివృద్ధి లక్ష్యంగా దూసుకుపోతోందని లంకా దినకర్ అన్నారు. హార్టికల్చర్ హబ్‌గా 1 లక్ష కోట్ల పెట్టుబడితో రాయలసీమ, మార్కాపురం జిల్లాల అభివృద్ధికి ప్రత్యేక కృషి చేస్తున్నట్లు తెలిపారు. సర్వతోముఖాభివృద్ధికి డబుల్ ఇంజి న్ సర్కార్ కృషి చేస్తోందన్నారు. జగన్ ఈ అభివృద్ధి నుంచి విషం కక్కుతున్నారని మండిపడ్డారు. మిగిలిన ప్రాంత ప్రజలను రెచ్చగొట్టి పబ్బం గడుపుకునే ప్రయత్నాలు చేస్తున్నారంటూ లంకా దినకర్ తీవ్రస్థాయిలో విరుచుకుపడ్డారు.

# పాలకులు మారినా పాలసీలు మారకూడదు ప్రపంచస్థాయి కోచ్‌లను తీసుకొస్తాం

రాష్ట్రంలో క్రీడాభివృద్ధికి వరల్డ్ క్లాస్ సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్ ఏర్పాటుకు జేఎస్?డబ్ల్యూ సంస్థ ముందుకు వచ్చిందని విద్య, ఐటీ శాఖల మంత్రి నారా లోకేశ్ తెలిపారు. ఉండవల్లి నివాసంలో శుక్రవారం రాత్రి కామన్ వెల్త్, ఆసియా క్రీడలకు ఎంపికైన ఎలైట్ ప్లేయర్స్‌తో మంత్రి డిన్నర్ మీట్ నిర్వహించారు. అంతర్జాతీయ క్రీడల్లో రాణిస్తూ రాష్ట్రానికి మంచిపేరు తీసుకురావాలని లోకేశ్ ఆకాంక్షించారు. ఏపీలో క్రీడల అభివృద్ధికి చేపట్టాల్సిన చర్యలపై వారి నుంచి సలహాలు స్వీకరించారు. ప్రస్తుతం ప్రభుత్వం నుంచి క్రీడాకారులకు అందుతున్న ప్రోత్సాహంపై వాకబు చేశారు. గతంలో ఏపీలో మంచి కోచ్‌లు ఉండేవారని, 2019లో ప్రభుత్వం మారాక వారందరినీ తొలగించారని పలువురు క్రీడాకా ఓరులు మంత్రి దృష్టికి తెచ్చారు. పాలకులు మారినా పాలసీలు మారకూడదన్న లోకేశ్ క్రీడాకారులకు అత్యుత్తమ శిక్షణ ఇచ్చేందుకు కోచ్‌లను నియమిస్తామన్నారు. అథ్లెట్ల శిక్షణ కోసం రూ.2.23 కోట్లు విడుదల: రాష్ట్రంలో స్పోర్ట్స్ ట్రైనింగ్ అండ్ ఎడ్యుకేషన్ పై ప్రత్యేకంగా దృష్టిసారించినట్లు చెప్పారు. ఆంధ్రా క్రికెట్ అసోసియేషన్ క్రికెట్?తో పాటు ఇతర క్రీడలను ప్రోత్సహిస్తోందన్నారు. ప్రభుత్వ స్కూళ్లలో ప్రతి శనివారం నో బ్యాగ్ డేగా ప్రకటించి విద్యార్థులను ఆటల్లో ప్రోత్సహిస్తున్నామన్నారు. ఈ ఏడాది ఆసియన్ గేమ్స్, కామన్ వెల్త్ గేమ్స్, పారా కామన్ వెల్త్ గేమ్స్‌కు ఎంపికైన 18 మంది అథ్లెట్ల శిక్షణ కోసం ప్రభుత్వం రూ.2.23 కోట్లు విడుదల చేసిందని లోకేశ్ అన్నారు. క్రీడాకారుల మరింత సాయం అందించేందుకు ప్రభుత్వం సిద్ధంగా ఉందన్నారు. అంతర్జాతీయ స్థాయి మెడల్స్ సాధించి రాష్ట్రాన్ని ప్రపంచ క్రీడాపటంలో నిలపాలని ఈ సందర్భంగా మంత్రి కోరారు. పాలకులు మారినా పాలసీలు మారకూడదు: ఈ సందర్భంగా పలువురు క్రీడాకారులు మాట్లాడుతూ వైఎస్సార్సీపీ ప్రభుత్వం మంచి కోచ్‌లను తొలగించిందని తెలిపారు. గతంలో గుంటూరులో విదేశీ కోచ్‌లతో సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్‌కు సీఎం చంద్రబాబు ఏర్పాటు చేశారని గుర్తు చేశారు. దీనిపై స్పందించిన లోకేశ్ పాలకులు మారినా పాలసీలు మారకూడదని అన్నారు. 'క్రీడాకారులకు అత్యుత్తమ శిక్షణ ఇచ్చేందుకు ప్రపంచస్థాయి కోచ్‌లను రాష్ట్రానికి తీసుకొస్తామన్నారు. అత్యుత్తమ క్రీడా మౌలిక సదుపాయాల కల్పనకు జేఎస్‌డబ్ల్యూ సంస్థ అంగీకారం తెలిపిందని వెల్లడించారు. స్పోర్ట్స్ ట్రైనింగ్ అండ్ ఎడ్యుకేషన్‌పై ప్రత్యేక దృష్టి సారిస్తున్నామని మంత్రి లోకేశ్ అన్నారు. శిక్షణ ఇచ్చేందుకు ప్రపంచస్థాయి కోచ్‌లను ఈ సమావేశంలో పీవీ సింధు, సాత్విక్ సాయిరాజ్ (బ్యాడ్మింటన్), జ్యోతిక శ్రీ, వెంకటరామిరెడ్డి, ఆర్.స్వాతి, భవానీ యాదవ్, కుసుమ రావాడ, రష్మి, మల్లల అనూష, శిరీష, కుంజా రజిత (అథ్లెటిక్స్), గణేష్ మణిరత్నం, యుక్తశ్రీ (ఆర్చరీ), తీర్థసామదేవ్ (స్విమ్మింగ్), భవానీ కార్తీక్ (పారా స్విమ్మింగ్) పాల్గొన్నారు.



# సంజీవని ప్రాజెక్టు అమలు తీరుపై సీఎం చంద్రబాబు ఆరా

**కుప్పం/అమరావతి, జూలై 4:** కుప్పంలో ముఖ్యమంత్రి చంద్రబాబు పర్యటన రెండో రోజు కొనసాగుతోంది. ఈ సందర్భంగా వివిధ అభివృద్ధి కార్యక్రమాల్లో పాల్గొన్నారు. కుప్పం ఏరియా ఆస్పత్రిలో ఏర్పాటు చేసిన సీటీ స్కాన్, డయాలసిస్ సెంటర్లను చంద్రబాబు ప్రారంభించారు. సీటీ స్కాన్ ద్వారా రోజూ ఎంత మందికి సేవలు అందుతున్నాయో అడిగి తెలుసుకున్నారు. ప్రతి రోజూ 30 నుంచి 40 మందికి పరీక్షలు చేసే అవకాశం ఉందని అధికారులు తెలిపారు. కుప్పం ఏరియా ఆస్పత్రిని సందర్శించి.. వ్యర్థాలను వదిలేయడంపై ఆరా తీశారు. చెత్తను వెంటనే తొలగించేలా చర్యలు తీసుకోవాలని ముఖ్యమంత్రి ఆదేశించారు. సంజీవని కార్యక్రమంలో డేటా అనుసంధానమనేది ముఖ్యమని చంద్రబాబు వెల్లడించారు. హెల్త్ రికార్డులు డిజిటలైజ్ చేయడంతోపాటు.. ప్రతి అంశంలోనూ డేటా ఇంటిగ్రేషన్ చేయాలని ఆదేశించారు. దయాలసిస్ వార్డును సందర్శించగా.. పొరుగు రాష్ట్రాల నుంచి కూడా కుప్పం ఏరియా ఆస్పత్రికి డయాలసిస్ నిమిత్తం వస్తున్నారని అధికారులు తెలిపారు. సంజీవని ప్రాజెక్టు అమలు తీరుపై ముఖ్యమంత్రి ఆరా తీశారు. సంజీవని ప్రాజెక్టు ద్వారా ప్రజలు సంతృప్తి చెందాలని.. కుప్పంలో ఏ మేరకు ప్రజలకు మేలు కలిగిందనే వివరాలను సిద్ధం చేయాలని ఆదేశించారు. కుప్పం ఏరియా ఆస్పత్రిలో పంచతత్వ కాన్సెప్టుతో ఏర్పాటు చేసిన వాకింగ్ ట్రాక్ పరిశీలించిన ముఖ్యమంత్రి.. ఆపై మొక్క నాటారు. కుప్పం ఏరియా ఆస్పత్రిలో ఏర్పాటు చేసిన వివిధ స్టాళ్లను పరిశీలించారు. గంజాయి, డ్రగ్స్ బారిన పడ్డవారికి మెడిటేషన్ ద్వారా ఆరోగ్యం మెరుగుపడేలా సహకారం అందిస్తున్నట్టు సీఎంకు బ్రహ్మకుమారీ సంస్థ ప్రతినిధులు వివరించారు. డ్రగ్స్, గంజాయి వంటి వాటిని నివారించేలా మరింత కఠినంగా ఉండాలని పోలీసు ఉన్నతాధికారులకు సీఎం ఆదేశాలు జారీ చేశారు. రోడ్డు ప్రమాదాల సమయంలో వైద్యులకు తక్షణ సమాచారం అందించేలా ఓ ఎక్విప్మెంట్‌ను రూపొందించిన బాలుడిని సీఎం అభినందించారు. కుప్పం నగరంలో ఏర్పాటు చేసిన స్వర్ణ కుప్పం-స్వచ్ఛ కుప్పం ఎంట్రన్స్ ఆర్చ్‌ను ముఖ్యమంత్రి చంద్రబాబు ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో మంత్రి మండిపల్లి రాంప్రసాద్ రెడ్డి, చిత్తూరు ఎంపీ దగ్గుమళ్ల ప్రసాదరావు, చిత్తూరు జిల్లా ప్రజాప్రతినిధులు, కుప్పం స్థానిక నేతలు, చిత్తూరు జిల్లా అధికారులు పాల్గొన్నారు.




## మా బిడ్డను పోలీసులే చంపేశారు



**విజయవాడ, జూలై 4 :** గాదె సాయికృష్ణ కేసుకు సంబంధించి మెజిస్టీరియల్ విచారణ కొనసాగుతోంది. విజయవాడలోని సబ్ కలెక్టర్ కార్యాలయంలో జరిగిన విచారణకు సాయికృష్ణ తల్లి విజయలక్ష్మి, మేనమామ నాగేశ్వరరావు, మేనత్త (శనివారం) హాజరై తమ వాంగ్మూలాల ను సమర్పించారు. ఈ కేసు విచారణ సందర్భంగా.. పోలీసులపై విజయలక్ష్మి సంచల న ఆరోపణలు చేశారు. తన కుమారుడు సాయికృష్ణను పోలీసులే చంపేసి, అనంతరం మృతదేహాన్ని మాయం చేశారని ఆరోపించారు. కృష్ణలంక పోలీస్ స్టేషన్‌లో సాయికృష్ణ ఉన్నట్లు సమాచారం అందడంతో అక్కడికి వెళ్లామని విజయలక్ష్మి తెలిపారు. అయితే, అప్పటి సీఐ నాగరాజు తన కుమారుడిని చూడనీయకుండా వెనక్కి పంపించారని అన్నారు. ఈ కేసులో న్యాయం చేయాలని విచారణాధికారిని సాయికృష్ణ తల్లి విజయలక్ష్మి వేడుకున్నారు. దాదాపు రెండు గంటలకు పైగా మెజిస్టీరియల్ విచారణ కొనసాగింది. ఈ కేసులో పూర్తి నిజాలు వెలుగులోకి రావాలంటే సమగ్ర, నిష్పాక్షిక విచారణ అవసరమని డిమాండ్ చేశారు. ఈ కేసు ఇప్పటికే రాష్ట్రవ్యాప్తంగా చర్చనీయాంశంగా మారగా, మెజిస్టీరియల్ విచారణలో వెలుగులోకి వచ్చే అంశాలు కీలకంగా మారనున్నాయి.

# ఆంధ్రాలో విషాదం.. ఒకే ఇంట్లో ముగ్గురు మహిళల ఆత్మహత్య




**కృష్ణా జిల్లా:** ఏపీలోని కృష్ణా జిల్లాలో తీవ్ర విషాదం నెలకొంది. గూడూరు మండలం అనంతయ్యపేటలోని ఒకే ఇంట్లో ముగ్గురు మహిళలు ఆత్మహత్య చేసుకోవడం సంచలనంగా మారింది. మృతులను అనుముకొండ రజిని (60), ఆమె కుమార్తె తోట గౌరి(40), కోడలు మధు(35)గా పోలీసులు గుర్తించారు. ఒకే ఇంట్లో ముగ్గురు మహిళలు ఆత్మహత్య చేసుకోవడం స్థానికంగా కలకలం రేపింది. ఈ ఘటనతో గ్రామంలో విషాదఛాయలు అలుముకున్నాయి. దీనిపై సమాచారం అందుకున్న పోలీసులు ఘటనాస్థలికి చేరుకుని పరిశీలించారు. ఈ ఘటనపై పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేపట్టారు. ముగ్గురు మహిళల మృతదేహాలకు పంచనామా నిర్వహించిన పోలీసులు.. పోస్టుమార్టం నిమిత్తం ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. కుటుంబసమస్యల కారణంగానే వీరు ఆత్మహత్యకు పాల్పడి ఉంటారని ప్రాథమికంగా భావిస్తున్నాయి. అయితే అసలు కారణాలపై ఇంకా స్పష్టత రావాల్సి ఉంది. దీంతో అనుమానాస్పద మృతిగా కేసు నమోదు చేసుకున్న పోలీసులు దర్యాప్తు చేపట్టారు. మృతుల కుటుంబసభ్యులు, బంధువులు, గ్రామస్తుల నుంచి వివరాలు సేకరిస్తున్నారు.

# ఆదివాసీల హక్కుల కోసం అల్లూరి పోరాడారు:

**విశాఖపట్నం, జూలై 4 :** మన్యం వీరుడు అల్లూరి సీతారామరాజు త్యాగం, ధైర్యసాహసాలు, దేశభక్తి భావం భావితరాలకు స్ఫూర్తిదాయకమని తెలుగుదేశం పార్టీ ఆంధ్రప్రదేశ్ అధ్యక్షుడు పల్లా శ్రీనివాసరావు కొనియాడారు. ఆదివాసీల హక్కుల కోసం పోరాడి బ్రిటిష్ పాలనకు సవాల్ విసిరిన మహావీరుడిగా అల్లూరి చరిత్రలో చిరస్థాయిగా నిలిచారని వ్యాఖ్యానించారు. అల్లూరి సీతారామరాజు జయంతి సందర్భంగా (శనివారం) గాజువాకలోని ఆయన విగ్రహానికి ఘన నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా ఆయన మీడియాతో మాట్లాడారు. అల్లూరి ఆశయాలను ప్రతి ఒక్కరూ ఆదర్శంగా తీసుకుని దేశ, సమాజ అభివృద్ధికి కృషి చేయాలని పల్లా శ్రీనివాసరావు పిలుపునిచ్చారు. స్వామి వివేకానంద.. యువతలో ఆత్మవిశ్వాసాన్ని పెంపొందించారు: పల్లా శ్రీనివాసరావుఅలాగే, గాజువాకలోని తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో స్వామి వివేకానంద వర్ధంతి సందర్భంగా ఆయన చిత్రపటానికి టీడీపీ ఏపీ అధ్యక్షుడు పల్లా శ్రీనివాసరావు ఘన నివాళులు అర్పించారు. యువతలో ఆత్మవిశ్వాసం, దేశభక్తి, సేవాభావాన్ని పెంపొందించిన మహనీయుడు స్వామి వివేకానంద అని కొనియాడారు. వివేకానంద చూపిన మార్గం నేటి సమాజానికి స్ఫూర్తిదాయకమని ప్రశంసించారు. యువత వివేకానంద ఆశయాలను ఆదర్శంగా తీసుకుని దేశాభివృద్ధికి తమ వంతుగా కృషి చేయాలని పిలుపునిచ్చారు. కొణిజేటి రోశయ్య.. ప్రజాసేవ పట్ల అంకిత భావంతో పనిచేశారు: వాన్ని పెంపొందించిన మహనీయుడు స్వామి పల్లా శ్రీనివాసరావుమాజీ ముఖ్యమంత్రి కొణిజేటి రోశయ్య జయంతి సందర్భంగా పల్లా శ్రీనివాసరావు ఘన నివాళులు అర్పించారు. నిజాయితీ, నిరాడంబరత, ఆర్థిక క్రమశిక్షణతో కూడిన రాజకీయాలకు రోశయ్య ఆదర్శప్రాయమని కొనియాడారు. ప్రజా సమస్యలపై అపారమైన అవగాహన, శాసనసభలో ఆయన చూపిన ప్రతిభ చిరస్మరణీయమని వ్యాఖ్యానించారు. ప్రజాసేవ పట్ల అంకితభావంతో పనిచేసిన నాయకుడిగా రోశయ్య సేవలు చిరస్థాయిగా నిలిచిపోతాయని పేర్కొన్నారు. నేటి తరానికి రోశయ్య జీవితం, స్ఫూర్తిదాయకమని అభిప్రాయపడ్డారు.




# కుప్పం ఆస్పత్రి ఆవరణలో చెత్తాచెదారం - సీఎం చంద్రబాబు ఆగ్రహం

**కుప్పం:** కుప్పం ఏరియా ఆసుపత్రిలో సీటీ స్కాన్ సెంట ర్‌ను ముఖ్యమంత్రి చంద్రబాబు ప్రారంభించారు. ఆ తర్వాత సంజీవని ఎగ్జిబిషన్ స్టాల్‌ను సందర్శించారు. అనంతరం ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న రోగులను పరామర్శించి, వైద్య సేవలపై సీఎం ఆరా తీశారు. హాస్పిటల్ ఆవరణలో చెత్తాచెదారం, వ్యర్థాలు ఉండటంపై సీఎం ఆగ్రహం వ్యక్తం చేశారు. పరిస్థితి ఎందుకిలా ఉందని ఆసుపత్రి సూపరింటెండెంట్‌పై అసహనం వ్యక్తం చేశారు. వీలైనంత త్వరగా వ్యర్థాలు క్లియర్ చేయాలని అధికారులను ఆదేశించారు. చిత్తూరు జిల్లా కుప్పం నియోజకవర్గంలో ముఖ్యమంత్రి చంద్రబాబు 2వ రోజు పర్యటన కొనసాగుతోంది. నియోజకవర్గ అభివృద్ధి, స్థానిక సమస్యల పరిష్కారమే ధ్యేయంగా సీఎం చంద్రబాబు పర్యటన సాగుతోంది. స్థానికులు, పార్టీ అభిమానులు ముఖ్యమంత్రిని కలిసేందుకు భారీగా తరలి వచ్చారు. ఈ క్రమంలో ప్రజల వద్దకు వెళ్లిన సీఎం, వారిని ఎంతో ఆప్యాయంగా పలకరించారు. స్థానికులతో కాసేపు ముచ్చటించారు. వారి యోగక్షేమాలు అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా పలువురు స్థానికులు తమ నియోజకవర్గ, వ్యక్తిగత సమస్యలపై ముఖ్యమంత్రికి వినతి పత్రాలు అందజేశారు. అర్జీలను స్వీకరించిన సీఎం సమస్యలను త్వరితగతిన పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు. నెట్ జీరో మోడల్ గృహాలు సందర్శన: అనంతరం చంద్రబాబు నలగంపల్లె గ్రామంలో పర్యటించారు. గ్రామంలో వినూత్నంగా జీరో విధానాన్ని అవలంబిస్తోన్న ఇళ్లను సీఎం ప్రత్యేకంగా పరిశీలించారు. పర్యావరణహితంగా రూపుదిద్దుకున్న ఈ ఇళ్లలోని రూఫ్‌టాప్ సోలార్ వ్యవస్థ, ఇండక్షన్ కుక్?టాప్ వినియోగం, టెర్రస్ గార్డెనింగ్, వర్షపునీటి సంరక్షణ వ్యవస్థలను క్షుణ్ణంగా పరిశీలించారు. సోలార్ విద్యుత్ వినియోగంపై ఆరా: గ్రామీణ ప్రాంతంలో ఇలాంటి పర్యావరణహిత పద్ధతులను పాటించడంపై సీఎం హర్షం వ్యక్తం చేశారు. నలగంపల్లిలోని ఓ గ్రామస్థుడి ఇంటికి ముఖ్యమంత్రి స్వయంగా వెళ్లారు. ఆ కుటుంబ సభ్యులతో సీఎం ముచ్చటించారు. అదే విధంగా సోలార్ విద్యుత్ వినియోగంపై ఆరా తీశారు. ఇంటిపై ఎన్ని ప్యానెళ్లు పెట్టారు? సోలార్ ప్యానెళ్ల ద్వారా ఉత్పత్తి అయ్యే విద్యుత్ మీ ఇంటి అవసరాలకు సరిపోతుందా? బిల్లులు ఏమైనా తగ్గాయా? అంటూ వివరాలు అడిగి సీఎం తెలుసుకున్నారు. ముఖ్యమంత్రి తమ ఇంటికి రావడం, స్వయంగా వివరాలు అడగడంతో ఆ కుటుంబం ఆనందం వ్యక్తం చేసింది. త్వరలో కుప్పంలో బంగారం ఉత్పత్తి చేస్తాం: రాయలసీమలో రూ.లక్ష కోట్లతో హార్టికల్చర్ హబ్ ఏర్పాటు చేస్తున్నట్లు సీఎం చంద్రబాబు తెలిపారు. ఇందులో ప్రైవేటు రంగం వాటా రూ.60 వేల కోట్లు కాగా ప్రభుత్వం రూ.40 వేల కోట్ల పెట్టుబడి పెడుతున్నట్లు చెప్పారు. కుప్పం నియోజకవర్గంలో రెండో రోజు పర్యటించిన చంద్రబాబు రూ.117 కోట్లతో అధునాతన బస్‌స్టేషన్, డిపో నిర్మాణాలకు శంకుస్థాపన చేశారు. అనంతరం ఏర్పాటు చేసిన బహిరంగ సభలో ఆయన మాట్లాడుతూ కుప్పం చరిత్ర మార్చే కార్యక్రమాలకు శ్రీకారం చుట్టినట్లు తెలిపారు. పలుకుదాం. అడిడాస్ పరిశ్రమ ద్వారా 20 వేల మందికి ఉపాధి అవకాశాలు లభిస్తాయి. డెయిరీ, ఫుడ్ ప్రాసెసింగ్, పౌల్ట్రీ పరిశ్రమలు వచ్చాయి. 10 చేరుతుంది. డ్వాక్రా సంఘాల ద్వారా గడ్డి పెంచి కమ్యూనిటీ ఫోరమ్‌ల ద్వారా సరఫరా చేస్తాం. కుప్పం నియోజకవర్గం ఆగ్రికల్చర్ హబ్‌గా తయారు కావాలి. వాణిజ్య, కూరగాయ పంటల ద్వారా మంచి ఆదాయం వస్తుంది." - సీఎం చంద్రబాబు



## మావిగన్ అంటే కూటమి నేతల్లో భయం



**అమరావతి :** అమరావతి ఎరుతో చంద్రబాబు అంతులేని అవినీతి, మోయలేని అప్పులు చేస్తున్నారని వైసీపీ మాజీ మంత్రి పేర్నినాని ఆరోపించారు. మావిగన్ పేరు చెప్పగానే కూటమి నేతల్లో భయం చుట్టుకుంటుందని విమర్శించారు. వైసీపీ కేంద్ర కార్యాలయం తాడేపల్లిలో ఏర్పాటుచేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. రాజధాని ఎప్పుడు పూర్తి అవుతుందో , ఎన్ని కోట్లు ఖర్చు పెడుతున్నారో సమాధానం చెప్పడం లేదని దుయ్యబట్టారు. రాష్ట్ర ప్రజలను తాకట్టు పెట్టి రూ. 50 వేల కోట్లు అప్పులు తెచ్చి ఆఫీసులు కడుతున్నారని పేర్కొన్నారు. రైతుల జీవితాలతో చంద్రబాబు ఆటలాడు ని మండిప డ్డారు. అమరావతి రైతులను కలిసేందుకు వెళ్తే దాడులు చేస్తున్నారని అన్నారు. కచ్చితంగా అమరావతి రైతుల వద్దకు అండగా ఉంటామని స్పష్టం చేశారు. రాజధానిలో పేదలకు జగన్ ఇచ్చిన 50 వేల ఇళ్ల పట్టాలు రద్దు చేశారని, జనాలు లేని చోటు రాజధాని ఎందుకని ప్రశ్నించారు. రెండేళ్ల పాలనలో కులాల పేరుతో రెచ్చగొట్టడం తప్ప ఏం చేశారని నిలదీశారు. యూట్యూబర్ రావణ్‌ను అరెస్ట్ చేసి వేధిస్తున్నారని ఆరోపించారు. కులాల పేరుతో ప్రజలను రెచ్చగొడుతున్నారని పేర్నినాని విమర్శించారు. సాయికృష్ణ మృతదేహం పోలీసు స్టేషన్ టెర్రస్‌పై కాల్చి బూడిద చేశారా? స్టేషన్‌లో సీసీ ఫుటేజీ ం బయటపెట్టడం లేదని ప్రశ్నించారు.

# 'తీస్తా' ప్రాజెక్ట్ విషయంలో అన్ని పరిణామాలను పరిగణనలోకి తీసుకుంటాం



**న్యూ ఢిల్లీ :** బంగ్లాదేశ్‌లోని ప్రాజెక్ట్‌ల అభివృద్ధికి తాము అందిస్తున్న సహాయం పరస్పరం అంగీకరించిన రోడ్‌మ్యాప్ ఆధారంగా సాగుతున్నాయని, తీస్తా నది విషయంలో జరుగుతున్న తాజా పరి ణామాలన్నింటినీ నిశితంగా పరిశీలిస్తున్నామని భారత విదేశాంగ మంత్రిత్వ శాఖ స్పష్టం చేసిం ది. తీస్తా నది ప్రాజెక్ట్‌కు సంబంధించి తమ సమగ్ర విధానంలో ఉన్న అన్ని పరిణామాలను ఢిల్లీ పరిగణనలోకి తీసుకుంటుందని పేర్కొంది. తీస్తా నది ప్రాజెక్ట్‌పై తమ అభిప్రాయాలను గత ంలోనే బంగ్లాదేశ్‌కు తెలియజేశామని వెల్లడ ించింది. బంగ్లాదేశ్ ప్రధాని తారిక్ రెహమాన్ ఇటీవల చైనా పర్యటన సందర్భంగా ఢాకా, బీజి ంగ్‌లు తీస్తా నది సమగ్ర నిర్వహణ, పున రుద్ధరణ ప్రాజెక్ట్‌పై చర్చించాయి. అనంతరం ఈ ప్రాజెక్ట్‌కు సాయం చేస్తామని చైనా ప్రకటించింది. ఈ నేపథ్యంలో భారత విదేశా ంగ ప్రతినిధి రణధీర్ జైస్వాల్ తాజాగా స్పంది ంచారు. బంగ్లాదేశ్‌లోని ప్రాజెక్ట్‌ల అభివృద్ధికి భారత్ అందించే సహాయం పరస్పరం అంగీ కరించిన ఒక రోడ్‌మ్యాప్‌పై ఆధారపడి ఉంటుం ది. దీనిని క్రమం తప్పకుండా సమీక్షిస్తారు. తీస్తా నది ప్రాజెక్ట్‌పై మా అభిప్రాయాలను గతంలోనే బంగ్లాదేశ్‌కు తెలియజేశాం. తీస్తా సమస్యకు సంబంధించిన మా సమగ్ర విధాన ంలోని అన్ని పరిణామాలను పరిగణనలోకి తీసుకుంటాం. బంగ్లాదేశ్‌లోని వ్యూహాత్మకమైన మోంగ్లా పోర్టు, చైనా నుంచి యుద్ధ విమానాలను కొనుగోలు చేయాలనే బంగ్లా ప్రణాళికలపై దృష్టి పెడతాం. అవసరమని భావిస్తే తగిన చర్యలు తీసుకుంటాం. –ఆణ్‌ధీర్ జైస్వాల్, భారత విదేశాంగ శాఖ ప్రతినిధివ ంరింత బలపడిన చైనా, బంగ్లా బంధంకాగా, ఇటీవలే బంగ్లాదేశ్ ప్రధాని తారిక్ రెహమాన్ చైనాలో పర్యటించారు. ఆ పర్యటన సందర్భం గానే మోంగ్లా పోర్టు సమీపంలో ప్రత్యేక ఆర్థికమండలి అభివృద్ధి ప్రాజెక్టును భారత్‌ను కాదని చైనాకు అప్పజెప్పారు. బంగ్లాలో చిట్టగాంగ్ తరవాత రెండో అతిపెద్ద ఓడరేవు అయిన మోంగ్లా బంగాల్‌లోని కోల్‌కతాకు సమీపంలోనే ఉంది. ఈ ప్రాజెక్టు ముసుగులో బంగాళాఖాతంలో బీజింగ్ నిఘా పెరిగితే భారత్‌కు కొత్త చిక్కులు తప్పకపోవచ్చనే వాదనలు ఉన్నాయి. అలాగే ఇండియా–బంగ్లాదేశ్ మధ్య వివాదాస్పద 'తీస్తా నది నిర్వహణ, పునరుద్ధరణ ప్రాజెక్ట్' విషయంలోనూ చైనా కీలక వ్యాఖ్యలు చేసింది. ఈ ప్రాజెక్ట్‌పై భారత్ ఆందోళన వ్యక్తం చేసినప్పటికీ బంగ్లాకు తన సహకారాన్ని డ్రాగన్ పునరుద్ఘాటించింది. ఈ విషయంలో మూడో పక్షం ప్రభావం తమపై ఉండబోదని స్పష్టం చేసింది. తీస్తాను బంగ్లాదేశ్‌కు జీవనోపాధి ప్రాజెక్ట్‌గా పేర్కొంది. ఈ ప్రాజెక్ట్‌కు మద్దతుగా తన వంతు సాయం చేయడానికి చైనా ఎప్పుడూ సిద్ధంగా ఉంటుందని వెల్లడించింది.'కోర్టు పరిధిలో ఉందని ఆ నిర్ణయం తీసుకున్నాం' ఆస్ట్రేలియా, కువైట్, యూఏఈలలోని కాన్సులర్ సేవలపైనా రణ్‌ధీర్ జైస్వాల్ స్పందించారు. ఆస్ట్రేలియా, కువైట్, యూఏఈలలోని భారత మిషన్లు పరిమిత కాన్సులర్ సేవలను అందిస్తూనే ఉన్నాయని స్పష్టం చేశారు. "భారత మిషన్లు అందించే కాన్సులర్ సేవలకు మద్దతునిస్తున్న ఈ దేశాల్లోని అవుట్ సోర్సింగ్ ఏజెన్సీల కార్యకలాపాలను నిలిపివేశాం. ఎందుకంటే ఈ అంశం కోర్టు పరిధిలో ఉంది. ఈ విషయంపై కోర్టు ఆదేశాల కోసం ఎదురుచూస్తున్నాం" అని జైస్వాల్ స్పష్టం చేశారు. పాక్‌కు యునెస్కో వార్నింగ్– భారత్ ఏమందంటే? పాకిస్థాన్‌లోని పంజాబ్ రాష్ట్రంలో ఉన్న ప్రపంచ వారసత్వ సంపదైన తక్షశిలలో పాక్ పురావస్తుశాఖ చేపట్టిన కొత్త నిర్మాణాలను యునెస్కో తప్పుపట్టిందని వచ్చిన వార్తలు ప్రతినిధి రణధీర్ జైస్వాల్ స్పందించారు. సాంస్కృతిక వారసత్వానికి సంబంధించినవి అందులో ముఖ్యంగా యునెస్కో గుర్తించినవి ఏ ఒక్క వ్యక్తికి లేదా దేశానికి చెందినవి కావని తెలిపారు. అవి యావత్ ప్రపంచానికి చెందినవని గుర్తు చేశారు.

## వైద్యురాలి మృతి కేసులో దోషిగా తేలిన బీజేపీ ఎమ్మెల్యే.. నాలుగేళ్ల జైలుశిక్ష






**బిహార్:** బిహార్‌లోని సాహెబ్‌గంజ్ నియోజకవర్గ బీజేపీ ఎమ్మెల్యే రాజుకుమార్ సింగ్‌కు ఢిల్లీలోని రౌస్ ఎవెన్యూ కోర్టు నాలుగేళ్ల జైలుశిక్ష విధించింది. 2019 న్యూ ఇయర్ సెలబ్రేషన్స్ సందర్భంగా జరిగిన ఫైరింగ్‌లో డాక్టర్ అర్చనా గుప్తా మృతిచెందిన కేసులో ఆయన్ను దోషిగా తేల్చుతూ తీర్పు వెలువరించింది న్యాయస్థానం. ఈ కేసులో ఆయనకు జైలుశిక్షతో పాటు రూ.25 లక్షల జరిమానా కూడా విధించింది. 2018 డిసెంబరు 31న అర్ధరాత్రి ఢిల్లీలోని ఫతేపూర్ బేరీ ప్రాంతంలో రాజుకుమార్ సింగ్ ఫామ్‌హౌస్‌లో నూతన సంవత్సర వేడుకలు నిర్వ హించారు. ఈ సెలబ్రేషన్స్‌లో ఆయన గాల్లోకి కాల్పులు జరిపారు. ఆ టైమ్‌లో అక్కడే ఉన్న డాక్టర్ అర్చనా గుప్తా(45) తలకు బుల్లెట్ తగలడంతో తీవ్రంగా గాయపడ్డారు. ఆ తర్వాత ఆస్పత్రిలో చికిత్స పొందుతూ ప్రాణాలు కోల్పోయారా మె. ఈ ఘటనపై నమోదైన కేసులో విచారణ చేపట్టిన న్యాయస్థానం.. గత జూన్‌లో రాజుకుమార్ సింగ్‌ను బీఎన్ఎస్–304(2) సహా ఆయుధ చట్టంలోని నిబంధనల్ని ఉల్లంఘించారని దోషిగా తేల్చింది. అయితే.. శిక్షను ఖరారు చేసే సమయంలో రాజుకుమార్ సింగ్‌కు ఎలాంటి హత్యోద్దేశం లేదని ఆయన తరఫు న్యాయవాదులు వాదించారు. ప్రజాప్రతినిధిగా ఆయనకు మంచి పేరుండటంతో శిక్షను తగ్గించాలని కూడా కోర్టును కోరారు. అయితే.. నేర తీవ్రతను పరిగణనలోకి తీసుకున్న న్యాయస్థానం.. జరిమానా విధించింది. ఈ తీర్పు రాజుకుమార్ సింగ్ రాజకీయ భవిష్యత్తుపై ఏమేర ప్రభావం చూపుతుందనే విషయం చర్చనీయాంశమైంది.

## పేరు, జాతీయత ఆధారంగా 'హిందూ హోదా'ను కాదనలేరు





**చెన్నై:** ఒక వ్యక్తి పేరు, జాతీయత ఆధారంగా హిందూ హోదాను తిరస్కరించలేరని, హిందూ మతంలోకి మారే వ్యక్తులకు ఎలాంటి వేడుకలు, సర్టిఫికెట్లు అవసరం లేదని మద్రాస్ హైకోర్టు సంచలన తీర్పు వెలువరించింది. హిందువుగా మారాలని అనుకునే వారికి నమ్మకం, చిత్తశుద్ధి ఉంటే చాలని పేర్కొంది. అమెరికా పౌరురాలైన లారా ఫ్రాన్సెస్ అయ్యంగార్‌ను హిందువుగా గుర్తించడంతోపాటు హిందూ సంప్రదాయ మహిళగానే భావించాలని తేల్చిచెప్పింది. ఆలయ సంప్రదాయాలు, ఆగమశాస్త్రం ప్రకారం దేవాలయాల్లోకి ప్రవేశించే ఇతర హిందూ మహిళలకు ఉన్న హక్కులను లారాకు కూడా వర్తింపజేయాలని ఆదేశించింది. ఈ మేరకు న్యాయమూర్తి జస్టిస్ డి. భరత్ చక్రవర్తి నేతృత్వంలోని మదురై ధర్మాసనం తీర్పు చెప్పింది. కాగా, తాను హిందూమతం స్వీకరిం చి, హైందవ సంప్రదాయాన్ని ఆచరిస్తు న్నప్ప టికీ తంజావూరు వరదరాజపెరుమాళ్ ఆలయ ంలోకి ప్రవేశించేందుకు నిరాకరిస్తున్నారని పేర్కొం టూ లారా ఫ్రాన్సెస్ మద్రాస్ హైకోర్టు ను ఆశ్రయించారు. ఆమె దాఖలు చేసిన రిట్ పిటిషన్‌పై ఇటీవల న్యాయమూర్తి జస్టిస్ డి. భరత చక్రవర్తి నేతృత్వంలోని మదురై ధర్మాస నం విచారణ జరిపింది. ఈ క్రమంలో తమిళనాడు హిందూ రెలిజియస్, చారిటబుల్ ఎండోమెంట్స్ విభాగం, లారా తరఫు వాదనలను, సాక్ష్యాధారాలను పరిశీలించింది. అనంతరం.. లారా ఫ్రానట?స‌కు ఆలయాల్లోకి ప్రవేశించే హక్కు ఉందని ధర్మాసనం స్పష్టం చేసింది. ఆమె ఆలయ ప్రవేశాన్ని అడ్డుకోవడం రాష్ట్ర దేవదాయశాఖను తీవ్రంగా తప్పుబట్టింది.

# ఉగ్రవాదంపై ఉక్కుపాదం- ఆ 23 మందిని 'టెర్రరిస్టులు'గా ప్రకటించిన కేంద్రం




**న్యూ ఢిల్లీ :** ఉగ్రవాదుల విషయంలో కేంద్ర హోం శాఖ కీలక నిర్ణయం తీసుకుంది. పాకిస్థాన్‌లో ఆశ్ర యం పొందుతూ జైషే మహ్మద్, లష్కరే తోయి బా సహా ఇతర టెర్రర్ సంస్థలతో సంబంధం ఉన్న 23 మందిని ఉగ్రవాద నిరోధక చట్టం కింద ఉగ్రవాదులుగా ప్రకటించింది. ఈ మేం ్కు కేంద్ర హోం మంత్రిత్వ శాఖ శనివారం ఒక ఉత్తర్వు విడుదల చేసింది. ఉగ్రవాదులు ఎవరెవరంటేజైషే మహ్మద్ ఉగ్రసంస్థకు చెందిన మసూద్ అలియాస్ కశ్మీరీ, మొహమ్మద్ ముస్సా దిక్ అలియాస్ డాక్టర్, ముఫ్తీ మొహమ్మద్ అస్గర్ ఖాన్ అలియాస్ అబూ సాద్, హాఫిజ్ అబ్దుల్ షకూర్ అలియాస్ ఖారీ జబ్రార్, అబ్దుల్లా జిహాదీ, గులాం ఫరీద్, మౌలానా ఇమ్దాద్ ఉల్లా మక్కీ, వసీం నూర్ జాట్‌లను కేంద్రం యూఏ పీఏ చట్టం కింద ఉగ్రవాదులుగా ప్రకటించింది. అలాగే లష్కరే తోయిబా టెర్రర్ గ్రూప్‌నకు చెందిన ఫిర్దౌస్ అహ్మద్ భట్, హరూన్ రషీద్ గనాయ్, బిలాల్ అహ్మద్ మీర్, అబిద్ ఖయూమ్ లోన్ నజీర్ అహ్మద్ గుజ్జర్, అబ్దుల్ రవూఫ్ అలియాస్ హాఫీజ్ రవూఫ్, అష్ఫాక్ అహ్మద్, హాఫీజ్ ఖలీద్ వలీద్, మౌలానా సైఫుల్లా, మౌలానా సైఫుల్లా తైబీ, ఓవైస్ ఫరూజ్, ఖారీ యాకూబ్ షేక్, రానా ఇఫ్తికర్, మహ్మద్ షాహిద్ ఫైసల్ (ఆల్ ఖైదా, ఐఎస్ఐఎస్‌లతో కూడా సంబంధాలు) వంటివారికి టెర్రరిస్ట్‌లుగా ప్రకటిస్తూ కేంద్ర హోం శాఖ ఉత్తర్వులు జారీ చేసింది. భారత్‌కు వ్యతిరేకంగా ఉగ్రవాద కార్యకలాపాలుకేంద్ర హోం శాఖ ప్రకటించిన ఉగ్రవాదుల జాబితాలో ఉన్న వ్యక్తులు దేశానికి వ్యతిరేకంగా అనేక రకాల ఉగ్రవాద కార్యకలాపాలకు పాల్పడ్డారు. సరిహద్దు వెంబడి డ్రోన్ల ద్వారా ఆయుధాలను సరఫరా చేశారు. అలాగే మందుగుండు సామాగ్రిని సరఫరా చేశారు. జమ్ముకశ్మీర్‌లో ఉగ్రవాద దాడులకు ప్రణాళికలు రచించడం, అలాగే టెర్రర్ కార్యకలాపాల పరిధిని విస్తరించేందుకు ప్రయత్నించారు. ఈ నేపథ్యంలో ముష్కరులను యూఏపీఏ ఉగ్రవాదుల జాబితాలో కేంద్ర హోం శాఖ చేర్చింది. "పాకి స్థాన్‌లోని నరోవాల్ జిల్లా షకం ఘర్ ప్రాంతంలో నివసిస్తున్న సుమారు 38 ఏళ్ల వయసున్న మహమ్మద్ ముసాద్దిక్ ఉగ్రసంస్థ జైషే మహ్మద్‌కు చెందిన వ్యక్తి. ఈ సంస్థను ఇప్పటికే యూఏపీఏ చట్టం ప్రకారం ఉగ్ర సంస్థగా ప్రకటించాం. జమ్ముకశ్మీర్‌లోకి పాకిస్థానీ ఉగ్రవాదుల చొరబా టుకు సంబంధించి జైషే మహ్మద్ నిర్వహించే ప్రధాన కార్యకలాపాల్లో మహమ్మద్ ముసాద్దిక్ ఒకడు. అలాగే 2023 ఏప్రిల్ 22న భద్రకార్యకలాపాల్లో పాలుపంచుకున్నాడని కేంద్ర ్తా దళాలపై జైషే మహ్మద్ ఉగ్రవాదులు జరిపిన దాడిలో ఇతడి హస్తం ఉంది" అని కేంద్ర హోం శాఖ ఉత్తర్వు లో పేర్కొంది. ప్రక్రియ ఏంటంటే చట్టవి రుద్ధ కార్యకలాపాల నివారణ చట్టం (యూఏపీఏ)–1967 ప్రకారం ఎవరైనా వ్యక్తి ఉగ్రవాద కార్యకలాపాల్లో పాలుపంచుకున్నాడని కేంద్ర ప్రభుత్వం భావిస్తే, అతడి పేరును టెర్రరిస్ట్‌గా ప్రకటించే అధికారం సర్కార్‌కు ఉంది. యూఏపీఏ జాబితాలో ఉగ్రవాదుల పేర్లను చేర్చడం వల్ల జాతీయ దర్యాప్తు సంస్థ (ఎన్ఐఏ) వారి ఆర్థిక లావాదేవీలను నిలిపివేసేందుకు, ఆయుధాల అమ్మకాలపై ఆంక్షలు విధించేందు కు, వారి ఆస్తులను జప్తు చేసేందుకు వీలు కలుగుతుంది. 2019లో ఉగ్రవాద నిరోధక చట్టాన్ని సవరించి వ్యక్తిగత ఉగ్రవాదులను కూడా యూఏపీఏ టెర్రరిస్ట్‌ల జాబితాలో చేర్చారు. ఈ సవరణకు ముందు కేవలం గ్రూప్‌లను మాత్రమే ఉగ్రవాద సంస్థలుగా జాబితాలో చేర్చేవారు. కాగా, శనివారం జమ్ముకశ్మీర్‌లో భద్రతా దళాలపై దాడుల్లో పాల్గొన్న వారితో సహా పాక్‌లో ఉన్న 23 మంది ఉగ్రవాదులను యూఏపీఏ జాబితాలో చేర్చారు. దీంతో యూఏపీఏ జాబితాలో ఉన్న ఉగ్రవాదుల సంఖ్య 80కి చేరింది. ఇటీవలి కాలంలో ఉగ్ర మూకలు భారత్‌లో దాడులకు తెగ ప్రయత్నిస్తున్నాయి. అయితే వాటి ఏటీఎస్, పోలీసులు, అధికారులు అడ్డుకుంటున్నారు. తాజాగా గుజరాత్?లో భారీ ఉగ్రకుట్రను యాంటీ టెర్రరిజం స్క్వాడ్ (ఏటీఎస్) శు క్రవారం అడ్డుకుంది. రాష్ట్రవ్యాప్తంగా విస్తరిస్తున్న స్లీపర్ సెల్ నెట్‌వర్క్‌ను గుర్తించిన ఏటీఎస్ అధికారులు దాడులు నిర్వహించి 8 మంది ఉగ్రవాదులను అరెస్ట్ చేశారు. ఈ అరెస్టులు దేశవ్యాప్తంగా సంచలనం రేపాయి. అలాగే ఏటీఎస్ అధికారులు నిర్వహించిన సోదాల్లో

# టెలిగ్రామ్‌కు కేంద్రం నోటీసులు పైరసీ సినిమాలు, ఓటీటీ కంటెంట్ తొలగించాలని ఆదేశం



**న్యూ ఢిల్లీ ::** ప్రముఖ మెసేజింగ్ యాప్ టెలిగ్రామ్‌కు కేంద్ర ప్రభుత్వం నోటీసులు జారీ చేసింది. తమ ప్లాట్‌ఫామ్ ద్వారా విస్తృతంగా వ్యాప్తి చెందు తున్న పైరసీ సినిమాలు, ఓటీటీ కంటెంట్, ఇతర ఆడియో–విజువల్ కంటెంట్‌ను వెంటనే నియంత్రించాలని టెలిగ్రామ్‌ను ఆదేశించింది. ఈ దిశగా ఇప్పటివరకు తీసుకున్న చర్యలపై 15 రోజుల్లోగా సమగ్ర నివేదిక సమర్పించాలని టెలిగ్రామ్‌ను కోరింది. ఇకపై పైరసీ కంటెం ట్‌ను గుర్తించి తొలగించే బాధ్యత పూర్తిగా ప్లాట్‌ఫామ్‌పైనే ఉంటుందని అధికారులు స్పష్టం చేశారు. ఇప్పటి వరకు ఫిర్యాదులు వచ్చిన తర్వాత ఒక్కో ఛానెల్‌ను తొలగించే విధానాన్ని అనుసరిస్తున్న టెలిగ్రామ్ ఇకపై ఆ విధానాన్ని కొనసాగించరాదని మంత్రిత్వ శాఖ స్పష్టం చేసింది. ప్రభుత్వం లేదా హక్కుదారులు ఒక్కో పైరసీ ఛానెల్‌ను గుర్తించి తెలియజేసే వరకు వేచి ఉండకుండా, టెలిగ్రామ్ స్వయంగా తన ప్లాట్‌ఫామ్‌ను నిరంతరం పర్యవేక్షించి, చట్టవిరుద్ధ కంటెంట్‌ను గుర్తించి తొలగించే వ్యవస్థను ఏర్పాటు చేయాలని సూచించింది. కేవలం ఫిర్యాదు అందిన తర్వాత చర్యలు తీసుకోవడం ద్వారా ప్లాట్‌ఫామ్ తన బాధ్యతను నిర్వర్తించినట్లు కాదని కేంద్రం పేర్కొంది. సమాచార సాంకేతిక చట్టం–2000, ఐటీ నిబంధనలు–2021 ప్రకారం మధ్యవర్తిగా టెలిగ్రామ్ తగిన జాగ్రత్తలు తీసుకోవాల్సిన బాధ్యత ఉందని గుర్తుచేసింది. ఫిర్యాదులు ఎంత పరిష్కరిస్తున్నారుఫిర్యాదులు ఎంత సమయంలో పరిష్కరిస్తు న్నారు, ఎలాంటి యంత్రాంగాన్ని వినియో గిస్తున్నారు అనే వివరాలను నివేదికలో పొందుపరచాలని సూచించినట్లు సమాచారం. ప్రభుత్వం తాజా చర్య వెనుక చలనచిత్ర పరిశ్రమ, ఓటీటీ రంగం, ప్రసార సంస్థలు, నిర్మాతలు, పంపిణీదారులు, డిజిటల్ కంటెంట్ సృష్టికర్తల ఆర్థిక ప్రయోజనాలను కాపాడట మేనని అధికారులు తెలిపారు. పైరసీ కారణంగా సృజనాత్మక రంగానికి భారీ నష్టం జరుగుతోం ద ్ని, దీనిని అరికట్టేందుకు ప్లాట్‌ఫారమ్‌లను మరింత బాధ్యతాయుతంగా మార్చే దిశగా ప్రభుత్వం అడుగులు వేస్తోందన్నారు. చట్టవిరుద్ధ కంటెంట్‌పై వెంటనే చర్యలునీట్ రీ–ఎగ్జామ్ సమయంలో ప్రశ్నపత్రాల లీకేజీకి అవకాశం లేకుండా ముందుజాగ్రత్త చర్యగా గత జూన్‌లో టెలిగ్రామ్ సేవలను భారత్‌లో తాత్కాలికంగా పరిమితం చేసిన విషయాన్ని కూడా అధికారులు గుర్తు చేశారు. ఆ అనుభవం తర్వాత డిజిటల్ ప్లాట్‌ఫారమ్‌ల బాధ్యతపై ప్రభుత్వం మరింత కఠిన వైఖరి అవలంబిస్తున్నట్లు తెలుస్తోంది. కాపీరైట్ ఉల్లంఘన అనేది కేవలం సివిల్ నేరం మాత్రమే కాదని, 'కాపీరైట్ చట్టం–1957', 'సినిమాటోగ్రాఫ్ చట్టం–1952' ప్రకారం అది క్రిమినల్ నేరంగా కూడా పరిగణిస్తారని సమాచార, ప్రసార మంత్రిత్వ శాఖ టెలిగ్రామ్‌కు గుర్తు చేసినట్లు సమాచారం. అందుకే చట్టవిరుద్ధంగా సినిమాలు, వెబ్‌సిరీస్‌లు, ఇతర కంటెంట్‌ను ప్రసారం చేసే ఛానెల్‌లపై వెంటనే చర్యలు తీసుకోవాల్సిన బాధ్యత ప్లాట్‌ఫామ్‌పై ఉందని పేర్కొంది. ఐటీ చట్టం–2000, ఐటీ నిబంధనలు–2021 ప్రకారం "డ్యూ డిలిజెన్స్" (తగిన జాగ్రత్తలు) పాటించడం ప్రతి మధ్యవర్తి సంస్థకు తప్పనిసరి అని కేంద్రం స్పష్టం చేసింది. ప్రభుత్వం స్పష్టం చేస్తోంది.

# అవి తప్పుడు వార్తలు, ఏ మాత్రం నిజం లేదు'.



**ఇరాన్ :** శాంతి చర్చల్లో పాల్గొన్న ఇరాన్ కీలక నేతలను ఇజ్రాయెల్ సైన్యం హత్య చేయాల నుకున్నట్లు అమెరికా మీడియా ప్రచురించిన కథనాన్ని ఇజ్రాయెల్ తీవ్రంగా ఖండించింది. ఆ వార్త పూర్తిగా అవాస్తవమని, అందులో ఏమాత్రం నిజం లేదని ప్రధాని బెంజామిన్ నెతన్యాహు కార్యాలయం స్పష్టంచేసింది. ఇరాన్ విదేశాంగ మంత్రి అబ్బాస్ అరాఘ్చీ పార్లమెంట్ స్పీకర్ మొహమ్మద్ గాలిబాఫ్‌లను హత్య చేసేందుకు ఇజ్రాయెల్ సైన్యం ప్రణాళిక వేసుకుందని న్యూయార్క్ టైమ్స్ తన కథనంలో పేర్కొంది. ఇరాన్ విదేశాంగ మంత్రి అబ్బాస్ అరాఘ్చీ, పార్లమెంట్ స్పీకర్ మొహమ్మద్ గాలిబాఫ్‌లను ఇజ్రాయెల్ లక్ష్యంగా చేసుకు ందని, ఈ విషయాన్ని ముందే పసిగట్టిన అమెరి కా.. ఇరాన్‌కు సమాచారం అందించిం దని న్యూయార్క్ టౌమ్స్ పత్రిక వెల్లడించింది. అయితే 'ఇజ్రాయెల్, ఇరాన్ చర్చల ప్రతినిధు లపై న్యూయార్క్ టైమ్స్ ప్రచురించిన తాజా కథనం పూర్తిగా కల్పితం. వాస్తవాలకు ఏమాత్రం దగ్గరగా లేదు' అని ఎక్స్ వేదికగా ఇజ్రాయెల్ స్పందించింది. ఏప్రిల్‌లో ప్రారం భమైన శాంతి చర్చల సమయంలో ఇరాన్ నేతలపై దాడి జరిగితే చర్చలు పూర్తిగా భగ్నమ వుతాయని అమెరికా భావించిందని న్యూయార్క్ టైమ్స్ తన కథనంలో పేర్కొన్నది. ఈ తరుణంలో ఈ కథనం వెలువడటం ప్రాధాన్యం సంతరించుకుంది. దాంతో ఇజ్రాయెల్ స్పందించాల్సి వచ్చింది.

## ఉల్లి రైతులకు కేంద్రం గుడ్ న్యూస్.. కనీస మద్దతు ధర పెంపు

**న్యూ ఢిల్లీ :** ఉల్లి రైతులకు కేంద్ర ప్రభుత్వం గుడ్ న్యూస్ చెప్పింది. ఉల్లి కనీస మద్దతు ధరను 13 శాతం మేర పెంచింది. తాజా పెంపుతో క్వింటాలు ఉల్లి ధర రూ.1,875 నుంచి రూ.2,125కు పెరిగింది. ఉల్లి సేకరణను పెంచేందుకు, రైతులకు లాభం చేకూర్చేందుకు కేంద్రం ఈ నిర్ణయం తీసుకుంది. ఈ పెంపు తక్షణం అమల్లోకి వస్తుందంటూ తాజాగా ప్రకటన విడుదల చేసింది. ఈ సీజన్‌లో కేంద్రం ఉల్లి ధరను పలుమార్లు పెంచింది. ఉల్లి బఫర్ స్టాక్ సేకరణ మందకొడిగా సాగుతున్న నేపథ్యంలో కేంద్రం ఉల్లి కనీస మద్దతు ధరను పలుమార్లు పెంచింది. జాతీయ మీడియా కథనాల ప్రకారం, జూన్ 1 నాటికి కేవలం 2 వేల టన్నుల ఉల్లినే ప్రభుత్వం సేకరించగలిగింది. దీంతో, పలుమార్లు ధరలను పెంచింది. ఉల్లి ధర కేజీకి రూ.12.7 నుంచి రూ.15.80కు పెంచుతూ మే 22న ఆదేశాలు జారీ చేసింది. జూన్ 13న ధరను కేజీకి రూ.16.50కు పెంచింది. జూన్ 20న కిలో ఉల్లిపాయల ధరను రూ.18.75కు పెంచింది. వ్యవసాయ శాఖ అంచనాల ప్రకారం, 2025–26లో ఉల్లిపాయల ఉత్పత్తి 307.33 లక్షల టన్నులకు చేరుకుంటుందది.

## రాజీనామా చేసిన పార్టీ ప్రెసిడెంట్ చంద్రిమా భట్టాచార్య



**కోల్‌కతా, జులై 4:** తృణమూల్ కాంగ్రెస్ పార్టీ అధినేత్రి మమతా బెనర్జీకి వరుస షాక్‌లు తగులుతున్నాయి. ఇప్పటికే పార్టీకి చెందిన కీలక నేతలు పెద్ద సంఖ్యలో రాజీనామాలు చేశారు. మరి కొందరు రెబల్స్‌గా మారి పార్టీని సొంతం చేసుకోవడానికి ప్రయత్నిస్తున్నారు. ఇలాంటి సమయంలో మమతకు ఊహించని షాక్ తగిలింది. సీనియర్ నేత చంద్రిమా భట్టాచార్య టీఎంసీ పార్టీ రాష్ట్ర ప్రెసిడెంట్ పదవికి శనివారం రాజీనామా చేశారు. అంతేకాదు.. పార్టీలో తనకు కేటాయించిన అన్ని పదవులకు కూడా ఆమె రాజీనామా చేశారు. నెల రోజుల్లోనే రాజీనామా..2026 పశ్చిమ బెంగాల్ అసెంబ్లీ ఎన్నికల్లో తృణమూల్ కాంగ్రెస్ ఘోర పరాజయాన్ని చవిచూసిన సంగతి తెలిసిందే. ఈ నేపథ్యంలోనే మమతా బెనర్జీ కీలక నిర్ణయం తీసుకున్నారు. పాత కమిటీలను రద్దు చేసి, కొత్త కమిటీలను ఏర్పాటు చేశారు. ఈ క్రమంలోనే చంద్రిమా భట్టాచార్యను జూన్ మొదటి వారంలో రాష్ట్ర అధ్యక్షురాలిగా నియమించారు. పదవిలోకి వచ్చిన కేవలం నెల రోజుల్లోనే ఆమె తన పదవికి రాజీనామా చేయడం గమనార్హం. ముదిరిన ఆధిపత్య పోరుతృణమూల్ కాంగ్రెస్ పార్టీ బహిష్కృత ఎమ్మెల్యే రితబ్రత బెనర్జీ నేతృత్వంలోని తిరుగుబాటు వర్గం కోల్‌కతాలోని పార్టీ ప్రధాన కార్యాలయాన్ని శుక్రవారం స్వాధీనం చేసుకుంది. తమదే అసలైన టీఎంసీ అని ప్రకటిస్తూ ఓ సమావేశం కూడా నిర్వహించింది. ఈ కార్యక్రమంలో రితబ్రతతో పాటు ఫిర్హాద్ హకీమ్, జావేద్ ఖాన్, సందీపన్ సాహా, అఖ్రూజమాన్ తదితరులు పాల్గొన్నారు.

# సంపాదకీయం

## సర్ పక్రియకు రాజకీయ పార్టీలే సహకరించాలి!





సర్ ప్రక్రియతో ఇప్పుడు తెలుగు రాష్ట్రాల్లో రాజకీయ పార్టీలు కంగారు పడుతున్నాయి. ఇబ్బడిముబ్బడిగా ఉన్న మద్దతుదారుల ఓట్లు పోతాయన్న భావనలో ఉన్నారు. ముఖ్యంగా ఆంధ్రావారిలో చాలామందికి తెలంగాణలో ఓటు ఉంది. దీనిపై వారు ఆందోళన చెందుతున్నారు. రెండు ఓట్లు ఉంటే తొలగించడం ఖాయం. అలాగే హైదరాబాద్,విజయవాడ లాంటి తదితర పట్టణాల్లో ఉన్నవారికి కూడా అటు సొంతూళ్లు, ఇక్కడా ఓట్లు ఉన్నాయి. వీటిని తొలగిస్తే ఎలా అన్న ఆందోళనలో ఉన్నారు. అన్నింటికి మించి పాతబస్తీ లోనే ఎక్కువ గందరగోళం కనిపిస్తోంది. ఇక్కడ తిష్టవేసిన రోహింగ్యాలతో పాటు, ఇతర దేశాల వారిని గుర్తించడం కొంచెం కష్టమే. ఇకపోతే అధికారులు రోజువారీ సమీక్ష చేస్తూ సర్ ప్రక్రియను క్షేత్రస్థాయిలో పర్యవేక్షిస్తున్నారు. ఇప్పటి వరకు ఎక్కడా ఎలాంటి పొరపాట్లు రాలేదు. నకిలీ ఓట్లను నిరోధించేందుకు పక్కాగా ఓ వ్యవస్థ అంటూ లేదు. ఆధార్, పాన్ కార్డులకు పర్మినెంట్ నంబర్ ఉంటోంది. కానీ ఓటుకు అలాంటిదేమీ లేదు. అలాంటి పక్కా వ్యవస్త ఉంటే తప్ప ఎన్నిసార్లు సర్ ప్రక్రియ చేపట్టినా నకిలీ ఓట్లు తొలగింపు అసాధ్యమే. ఇకపోతే ఇల్లుమారిన లేదా, చనిపోయిన వారి ఓట్లను ఎలా తొలగిస్తారన్నది కూడా ప్రశ్నే. ఇదిలావుంటే అన్ని రాజకీయ పార్టీలు సమావేశాలు పెట్టి తమ కార్యకర్తలను అప్రమత్తం చేస్తున్నాయి. ఓట్లు తొలగిపోకుండా చూడాలని జాగ్రత్తలు చెబుతున్నాయి. అందుకు బూత్‌లెవల్లో శిక్షణ కూడా ఇచ్చారు. ఓ వైపు ఈ ప్రక్రియ కొనసాగుతుండగానే సమావేశాలు కొనసాగుతున్నాయి. దీనిని బట్టి రాజకీయ పార్టీల్లో ఆందోళన స్పష్టంగా కనిపిస్తోంది. నకిలీ ఓట్లను తొలగించే విధానాన్ని కేంద్ర ఎన్నికల సంఘం సర్ ద్వారా గత కొన్నేళ్లుగా సంస్కరిస్తోంది. ఇది కొత్తగా బిజెపి ఏలుబడిలో తీసుకువచ్చిందేమీ కాదు. గతంలో యూపిఎ హయాంలోనూ సర్ ప్రక్రియ సాగింది. అయితే అప్పట్లో తూతమంత్రంగా సాగడంతో ఎవరూ పెద్దగా పట్టించుకోలేదు. 'సర్' పక్రియ చట్టబద్ధమేనని, కానీ వాటి కోసం అవలంబించే పద్ధతుల్లో మార్పులు తెచ్చుకోవాలని ఈ దేశ అత్యున్నత న్యాయస్థానం అన్ని రాజకీయ పార్టీలకు, కేంద్ర ఎన్నికల సంఘానికి హితవు చెప్పింది. ఓటు హక్కు ఒకటే యువత భవిష్యత్‌ను నిర్మించుకునేందుకు ఉన్న ఏకైక ఆయుధమని నమ్ముతుంటాం. ఓటు ఉంటేనే నేతలు ఉంటారు. అధికారం ఉంటుంది. అందుకే ఓట్ల కోసం అభ్యర్థులు, పార్టీలు డబ్బులు విరజిమ్మడం ద్వారా అధికార పీఠం దక్కించుకునేందుకు నానా గడ్డీ కరుస్తుంటారు. ఇప్పుడు సర్ ప్రక్రియ ద్వారా తమవారి ఓట్లు పోకుండా జాగ్రత్త పడడం ఇందులో భాగమే.ప్రజాస్వామ్యంలో ధనస్వామ్యం చొరబడిన తరవాత ప్రజాస్వామ్యం ఇప్పుడు వికటిస్తున్నది. ఈ పరిస్థితుల్లో 'ఓటు' దుర్వినియోగం అవుతోంది. డబ్బులు పెట్టి ఓట్లు కొనసడం అలవాటు చేసుకున్నారు. దొంగ ఓట్లతో జాతర నడిపిస్తున్నారు. స్థానికంగా లేని వారికి ఓటు హక్కు కల్పించడం, ఆ ఓటును ఎవరో వేసేస్తున్నారన్న ఆరోపణల నేపథ్యంలో సర్' పేరుతో అసలుసిసలు ఓటర్లను జాబితాలోంచి తీసేస్తున్నారన్న ఆరోపణల మధ్య రాజకీయ పార్టీలు ఓట్లను దక్కించుకునేందుకు జాగ్రత్త పడుతున్నాయి. బీహార్, తమిళనాడు, కేరళ, పుదుచ్చేరి, తదితర రాష్ట్రాలకు సర్ ప్రక్రియ పూర్తయిన తరవాతనే ఎన్నికలు జరిగాయి. కొన్ని చోట్ల ప్రభుత్వాలు మారడంతో ఓట్లను తొలగిస్తున్నారన్న ప్రచారం చేపట్టారు. ఇంత ప్రక్షాళన జరిగినా కొన్ని చోట్ల అక్రమంగా తమ ఓట్లు తొలగించారన్న ఆవేదనలు వినిపిస్తూనే ఉన్నాయి. సాధారణ పౌరులెవరికీ 'సర్' పట్ల ఎలాంటి అసంతృప్తి లేదు. ఈ పక్రియలో ఓటు హక్కు కోల్పోయామని ఆందోళన చెందిన ఓటర్లు కూడా ఇప్పుడు ఒక్కక్కరూ ఆందోళన చెందుతున్నారు. ఏ వ్యవస్థలో అయినా లోపభూయిష్టమైన విధానాలకు చెక్ పెట్టాల్సిందే. ఓటు ఉన్నవారు నిర్భయమంగా ఉండాల్సిందే. ఎలాంటి ఆందోళనలు అవసరం లేదు. ఎన్నికల సంఘం కూడా అలాంటి వారిని ఎక్కడా తప్పు పట్టడం లేదు. జాబితాలో తొలగించడం లేదు. అవగాహన లేనివారు మాత్రమే ఆందోళనతో అయోమయంలో పడిపోతున్నారు. ప్రజాస్వామ్యంలో ఓటరు జాబితా ఎంతో విశ్వసనీయత కలిగి ఉండటం అవసరం. రెండు ఓట్లు, ఇక్కడ లేని వారి ఓట్లు, చనిపోయిన వారి ఓట్లు తొలగించేందుకు ఇసికి రాజకీయ పార్టీలు సహకరిస్తే సమస్య సులువుగా పరిష్కారం అవుతుంది. కానీ రాజకీయా పార్టీలు అలా చేయడం లేదు. రాజకీయ పార్టీల చర్యలు ఓటర్లలోనూ గందరగోళంలఅఓ పడేసేలా ఉంటోంది. ఓట్లు పోతాయంటూ చేస్తున్న హెచ్చరికలు భయాందోళనకు గురి చేస్తున్నాయి. ముఖ్యంగా గ్రామీణ ప్రాంతాల్లో ఉన్నవారు తమ ఓటు ఎక్కడ పోతుందో అన్న ఆందోళన చెందుతున్నారు. శాశ్వతంగా ఒకే ప్రాంతంలో నివసించే వారిఓట్ల జోలికి ఇసి వెళ్లడం లేదు. కొన్ని చోట్ల తాము వెళ్లినప్పుడు ఓటర్లు అక్కడ లేకపోవడం, తగిన కారణాలు చూపక పోవడంతో తొలగించడం జరుగుతోంది. ఇంటింటికీ వెళ్లి ధృవీకరణద్వారా జాబితాను జల్లెడ పడుతున్నారు. ఒకటి కన్నాఎక్కువ ప్రాంతాల్లో పేర్లు నమోదై, వారు మరో చోట నివసిస్తుంటే వారి ఓటు హక్కు ఆ ప్రాంతానికే మార్చుకోవాలి. ఎక్కడ శాశ్వత నివాసం ఉంటుందో అక్కడే ఓటును పొందాలి. అంతేగానీ పలుచోట్ల ఓటును కలిగి ఉండడం కూడా నేరం. ఇలాంటి విషయాలను రాజకీయా పార్టీలు ప్రచారం చేయడం లేదు. రాజకీయ ఎత్తుగడ కోసం ఓట్లు తొలగిస్తున్నారని దుష్ప్రచారం చేస్తున్నాయి. 'సర్' పూర్తిగా చట్టబద్ధమైన పారదర్శక పక్రియ అనడంలో సందేహమే లేదు.

# కవితకు ఎన్నికల సంఘం షాక్



### టిఆర్ఎస్ పార్టీ పేరు మార్చుకోవాలని నోటీస్
### అలాంటి ప్రసక్తి లేదంటూ స్పష్టం చేసిన కవిత
### అవసరమైతే సుప్రీంపు ఆశ్రయిస్తామని వెల్లడి

**హైదరాబాద్,జులై4:** కల్వకుంట్ల కవిత స్థాపించిన 'తెలంగాణ రక్షణ సేన' టీఆర్ఎస్ పార్టీకి కేంద్ర ఎన్నికల సంఘం షాక్ ఇచ్చింది. కవిత కొత్త పార్టీ పేరును మార్చాలంటూ ఈసీ ఆదేశాలు జారీ చేసింది. తెలంగాణ రక్షణ సేన పేరుపై ప్రజల నుంచి అభ్యంతరాలు వెల్లువెత్తుతున్నాయని ఎలక్షన్ కమిషన్ పేర్కొంది. 15 రోజుల్లో మూడు ప్రత్యామ్నాయ పేర్లు సమర్పించాలని ఆదేశించింది. లేని పక్షంలో దరఖాస్తును మూసివేస్తామని హెచ్చరించింది. టీఆర్ఎస్ పేరును కొనసాగించేందుకు వీల్లేదంటూ కవితకు ఈసీ లేఖ రాసింది. పేరు వివాదంతో కవిత కొత్త పార్టీ రిజిస్ట్రేషన్‌కు తీవ్ర అడ్డంకులు ఏర్పడ్డాయి. దీంతో కొత్త పేర్లతో దరఖాస్తును సవరించాలని ఈసీ సూచించింది. ఈసీ లేఖపై కవిత స్పందించారు. తమకు అధికారికంగా ఈసీ నుంచి వచ్చిన రెండు అభ్యంతరాలకు సమాధానం ఇచ్చామని తెలిపారు. అయితే కొత్త పేర్లు ఇచ్చేది లేదని.. న్యాయపోరాటానికే సిద్ధమని కవిత స్పష్టం చేశారు. తెలంగాణ రాజకీయాల్లో సరికొత్త సంచలనంగా మారిన కల్వకుంట్ల కవిత నూతన రాజకీయ పార్టీ 'తెలంగాణ రక్షణ సేన' సంక్షిప్త నామంపై కేంద్ర ఎన్నికల సంఘం (ఇఅఎ) పంపిన లేఖ రాష్ట్ర రాజకీయాల్లో పెను దుమారం రేపుతోంది. పార్టీ పేరు మార్చుకోవాలంటూ ఈసీ పంపిన నోటీసులపై పార్టీ అధినేత్రి కల్వకుంట్ల కవిత అత్యంత ఘాటుగా స్పందించారు. కేంద్ర ఎన్నికల సంఘం లేఖ తమకు అందిందని, వారు లేవనెత్తిన రెండు ప్రధాన అభ్యంతరాలకు తాము ఇప్పటికే పూర్తిస్థాయిలో చట్టపరమైన సమాధానాలు ఇచ్చామని ఆమె స్పష్టం చేశారు. తమ పార్టీ సంక్షిప్త నామం ఎప్పటికీ 'టిఆర్ఎస్ మాత్రమేనని ఆమె తేల్చి చెప్పారు. కేంద్ర ఎన్నికల సంఘం సూచించినట్లుగా తాము కొత్త పేర్లు గానీ, ప్రత్యామ్నాయ సంక్షిప్త నామాలు గానీ ఇచ్చే ప్రసక్తే లేదని కవిత మీడియా ముఖంగా కుండబద్దలు కొట్టారు. ప్రజా క్షేత్రంలో ఇప్పటికే 'టిఆర్ఎస్ పేరుతో తాము దూసుకుపోతున్నామని, ఈ తరుణంలో వెనక్కితగ్గే ఆలోచన లేదని స్పష్టం చేశారు. ఒకవేళ ఈసీ తమ వివరణను పరిగణనలోకి తీసుకోకుండా ఏకపక్షంగా వ్యవహరిస్తే, దీనిపై అత్యున్నత న్యాయస్థానాన్ని ఆశ్రయించి న్యాయపోరాటం చేయడానికి కూడా తాము సిద్ధంగా ఉన్నామని ఆమె స్పష్టం చేశారు. పిలుపునిచ్చారు. భారత్ రాష్ట్ర సమితి నుంచి బయటకు వచ్చిన తర్వాత కవిత అత్యంత ప్రతిష్టాత్మకంగా ఈ కొత్త పార్టీని స్థాపించి, తెలంగాణ సెంటిమెంట్‌ను మళ్లీ రాజేసేలా 'టిఆర్ఎస్ ' అనే సంక్షిప్త నామాన్ని ఎంచుకున్నారు. గతంలో తన తండ్రి కేసీఆర్ నేతృత్వంలో కొనసాగిన పాత పేరును గుర్తుచేసేలా ఉండటంతో ఈ పేరు ప్రజల్లోకి వేగంగా దూసుకెళ్లింది. అయితే, టెక్నికల్ మరియు లీగల్ అభ్యంతరాల నేపథ్యంలో ఈసీ నుంచి 15 రోజుల గడువుతో నోటీసులు రావడం, దానికి కవిత ధీటుగా బదులివ్వడం తెలంగాణ పొలిటికల్ సర్కిల్స్‌లో హాట్ టాపిక్‌గా మారింది. ఈ పరిణామం కవిత రాజకీయ ప్రస్థానానికి ఒక సవాల్‌గా మారినప్పటికీ, ఆమె దీనిని చట్టపరంగా ఎదుర్కొనేందుకు వ్యూహాలు రచిస్తున్నారు.

# ఇరాన్ సుప్రీం ఖమేనీ అంత్యక్రియలు ప్రారంభం

### భారత బృందంలో బీహార్ గవర్నర్, కేంద్రమంత్రి

**టెహ్రాన్,జులై4:** అమెరికా దాడుల్లో మృతిచెందిన ఇరాన్ సుప్రీం లీడర్ అయతుల్లా అలీ ఖమేనీ అంత్యక్రియలు శనివారం అధికారికంగా ప్రారంభమయ్యాయి. అమెరికా-ఇజ్రాయెల్ సంయుక్త దాడుల్లో ఈ ఏడాది ఫిబ్రవరి 28న మరణించిన 86 ఏళ్ల ఖమేనీకి చివరి వీడ్కోలు పలికేందుకు వేలాదిగా ప్రజలు టెహ్రాన్ నగరానికి తరలివచ్చారు. దేశ జెండాతో కప్పిన ఖమేనీ పార్థివదేహాన్ని నల్ల తలపాగా ఉంచిన శవపేటికలో పెట్టి అంతిమ సందర్శనకు ఉంచారు. అమెరికా దాడుల్లో ప్రాణాలు కోల్పోయిన ఖమేనీ కుటుంబ సభ్యుల పార్థివదేహాలనూ ఆయన పక్కనే ఉంచారు. అందులో ఖమేనీ 14 నెలల మనవరాలి చిన్న శవపేటిక అందరి మనసులను కలచివేస్తోంది.



ఆ చిన్నారి శవపేటిక పక్కనే ఆమె ఫొటోను కూడా ఉంచారు. వారం రోజుల అంతిమ సంస్కారాల్లో భాగంగా శుక్రవారం సాయంత్రమే ఖమేనీ పార్థివదేహం టెహ్రాన్‌కు చేరుకుంది. దీంతో గ్రాండ్ మొసల్లా ప్రాంగణం వెలుపల భారీ సంఖ్యలో అభిమానులు, మద్దతుదారులు బారులు తీరారు. శనివారం ఉదయం గ్రాండ్ మొసల్లా ద్వారాలు తెరవగానే వేలాది మంది లోపలికి ప్రవేశించి ఖమేనీకి కన్నీటి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా ఎర్ర జెండాలు చేతబట్టి వచ్చిన మద్దతుదారులు అమెరికాకు వ్యతిరేకంగా నినాదాలు చేసారు. వారి నినాదాలతో గ్రాండ్ మొసల్లా ప్రాంగణం మార్మోగిపోతోంది. 'నా ప్రియమైన నాయకుడికి వీడ్కోలు చెప్పేందుకు వచ్చాను. ఇలాంటి రోజు వస్తుందని ఎన్నడూ ఊహించ లేదు. ఈ విషాదాన్ని చూడకముందే నేను చనిపోయి ఉంటే బాగుండేది' అంటూ ఓ యువకుడు భావోద్వేగానికి గురయ్యాడు. కాగా, రాబోయే మూడు రోజుల్లో ఒక్క టెహ్రాన్‌లోనే 1.5 నుంచి 2 కోట్ల మంది వరకు ఖమేనీ అంత్యక్రియల్లో పాల్గొనే అవకాశం ఉందని ఇరాన్ అధికారులు అంచనా వేస్తున్నారు.మరోవైపు ఇరాన్ పార్లమెంట్ స్పీకర్, అమెరికాతో చర్చలకు ప్రధాన ప్రతినిధిగా వ్యవహరించిన మహమ్మద్ బాఘర్ ఘాలిబాఫ్ సహా పలువురు ప్రముఖులు ఖమేనీకి నివాళు లర్పించారు. తాజా దాడుల్లో మరణించిన రివల్యూషనరీ గార్డ్స్ మాజీ చీఫ్ స్థానంలో నియమితులైన అహ్మద్ వాహిదీ కూడా అంతిమ సంస్కారాల్లో పాల్గొన్నారు. భారత్ తరఫున బిహార్ గవర్నర్ సయ్యద్ అటా హుస్సైనీన్, విదేశాంగ శాఖ సహాయ మంత్రి పబిత్ర మార్గరిటా ఈ కార్యక్రమాలకు హాజరయ్యారు. కాగా, సోమవారం వరకు ఖమేనీ పార్థివదేహాన్ని టెహ్రాన్‌లో ప్రజల సందర్శనార్థం ఉంచనున్నారు. అనంతరం నగరంలో భారీ అంతిమయాత్ర నిర్వహిస్తారు. మంగళవారం నాడు పవిత్ర నగరమైన ఖోమ్‌కు, బుధవారం ఇరాక్‌లోని పవిత్ర ప్రాంతాలకు తీసుకెళ్తారు. గురువారం నాడు ఈశాన్య ఇరాన్‌లోని ఖమేనీ స్వస్థలమైన మష్హద్‌లో ప్రభుత్వ లాంఛనాలతో అంత్యక్రియలు నిర్వహించనున్నారు.


# పాపికొండల యాత్ర మళ్లీ ప్రారంభం



### రాజమండ్రి, భద్రాచలం నుంచి యధావిధిగా యాత్ర

**రాజమండ్రి,జూలై4:** భద్రతా కారణాల దృష్ట్యా గత జూన్ చివరి వారంలో తాత్కాలికంగా నిలిచిపోయిన ప్రపంచ ప్రసిద్ధ పాపికొండలు బోటింగ్ విహారయాత్రకు ఎట్టకేలకు అధికారులు మళ్లీ గ్రీన్ సిగ్నల్ ఇచ్చారు. గోదావరి నది ఉధృతి తగ్గుముఖం పట్టడం, పర్యాటక బోట్ల ఫిట్‌నెస్ మరియు భద్రతా ప్రమాణాలను క్షుణ్ణంగా పరిశీలించిన తర్వాతే ఈ నిర్ణయం తీసుకున్నారు. ఈ యాత్రను అటు రాజమండ్రి పుష్కర ఘాట్ నుండి, ఇటు భద్రాచలం నుండి పర్యాటకుల సౌకర్యార్థం అందుబాటులోకి తెచ్చారు. ప్రకృతి ప్రేమికులకు, కుటుంబ సమేతంగా ఆహ్లాదకరమైన సమయాన్ని గడపాలనుకునే వారికి ఇది ఒక గొప్ప అవకాశం. గోదావరి జలవిహారంలో పర్యాటకులకు ఆధ్యాత్మికతతో పాటు ప్రకృతి అందాలను వీక్షించే అద్భుతమైన అవకాశం లభిస్తుంది. ఈ టూర్ ప్యాకేజీలో భాగంగా గండిపోచమ్మ ఆలయం, సుందరమైన పాపికొండలు, మరియు ప్రశాంతమైన పేరంటాలపల్లి ఆశ్రమం వరకు బోటింగ్ ప్రయాణం సాగుతుంది. ప్రయాణీకుల భద్రతకు పెద్దపీట వేస్తూ లైఫ్ జాకెట్లు మరియు అనుభవజ్ఞులైన సిబ్బందిని బోట్లలో అందుబాటులో ఉంచారు. ఇక టికెట్ ధరల విషయానికి వస్తే పెద్దలకు రూ. 1250, మరియు 5 నుండి 10 సంవత్సరాల లోపు పిల్లలకు రూ. 1050 గా నిర్ణయించారు. చాలా కాలం తర్వాత బోటింగ్ పునఃప్రారంభం కావడంతో పర్యాటక రంగం మళ్లీ కళకళలాడనుంది.

# అన్నవరం కల్యాణం ఎందుకంత ప్రత్యేకం ఒక్కసారి దర్శిస్తే సకల శుభాలు, ఐశ్వర్యం ప్రాప్తి!




తెలంగాణలోని మరకత శివలింగం- ఒక్కసారి దర్శిస్తే వ్యాధులు మటుమాయం!
ద్వాదశ జ్యోతిర్లింగాల్లో వైద్యనాథ్ జ్యోతిర్లింగాన్ని దర్శిస్తే వ్యాధులు దూరమవుతాయని పురాణాలు చెబుతున్నాయి. అలాంటి వైద్యనాథ్ జ్యోతిర్లింగాన్ని పోలిన శివలింగం తెలంగాణలోని చందిప్ప గ్రామంలో దర్శనమిస్తుంది. పూర్తిగా మరకతంతో తయారైన ఈ సోమేశ్వర లింగాన్ని సేవిస్తే వ్యాధులు నివృత్తి అవుతాయని, సకల ఐశ్వర్యాలు సిద్ధిస్తాయని భక్తుల నమ్మకం. ఇంతకూ ఈ పవిత్ర క్షేత్రం ఎక్కడుంది? ఆ విశేషాలేమిటో ఈ కథనంలో చూద్దాం.
మరకత సోమేశ్వర స్వామి ఆలయం ఎక్కడుంది?పరమేశ్వరుడు తన భక్తులను అనుగ్రహించేందుకు ద్వాదశ జ్యోతిర్లింగ రూపాల్లో వెలిసినట్లుగా పురాణాలు చెబుతాయి. ద్వాదశ జ్యోతిర్లింగ క్షేత్రాల్లో మహారాష్ట్రలోని పర్లిలో వైద్య నాథేశ్వరుడిగా కొలువుదీరిన శివుడు భక్తులకు ఆయురారోగ్యాలను ప్రసాదిస్తాడనే విశ్వాసం ఉంది. పర్లి వైద్యనాథుడిని పోలిన బ్రహ్మసూత్రంతో మెరిసే మరకత శివలింగం తెలంగాణలో చందిప్ప గ్రామంలో దర్శనమిస్తుంది. శతాబ్దాల చరిత్ర కలిగిన ఈ మరకత సోమేశ్వర లింగాన్ని సేవిస్తే వ్యాధులు నివృత్తి అవుతాలిసినట్లుగా పురాణాలు చెబుతాయి. ద్వాదశ జ్యోతిర్లింగ క్షేత్రాల్లో మహారాష్ట్రలోని పర్లిలో వైద్య నాథేశ్వరుడిగా కొలువుదీరిన శివుడు భక్తులకు ఆయురారోగ్యాలను ప్రసాదిస్తాడనే యని, సకల ఐశ్వర్యాలు సిద్ధిస్తాయని భక్తుల నమ్మకం. మహిమాన్వితమైన ఈ ఆలయం విశిష్టత, స్థల పురాణం గురించి తెలుసుకుందాం.

**చందిప్ప క్షేత్రం చరిత్ర**
సాధారణంగా శివలింగం పార్థివ లింగం, స్ఫటిక లింగం, సైకత లింగం వంటి అనేక రూపాల్లో దర్శనమిస్తుంది. వాటిలో మరకత లింగం ముదురు ఆకుపచ్చ రంగులో ప్రకాశిస్తూ ప్రత్యేకంగా ఆకట్టుకుంటుంది. ఇలాంటి అరుదైన మరకత లింగం కొలువై ఉన్న చందిప్ప క్షేత్రానికి దాదాపు వెయ్యి సంవత్సరాల చరిత్ర ఉంది. ముచుకుంద నది ఒడ్డున ఉన్న ఈ పవిత్ర స్థలంలో క్రీ.శ. 1076--1126 మధ్య పశ్చిమ చాళుక్య రాజు ఆరో విక్రమాదిత్యుడు ఈ లింగాన్ని ప్రతిష్ఠించినట్లుగా తెలుస్తోంది. క్రీ.శ. 1101 కార్తిక శుద్ధ పంచమి గురువారం ఈ క్షేత్రంలో మరకత శివలింగ ప్రతిష్ఠాపనోత్సవం నిర్వహించినట్లు ఆలయంలో లభ్యమైన శాసనాల ద్వారా తెలుస్తోంది.

**ఆలయ జీర్ణోద్ధరణ**
11వ శతాబ్దం నాటి ఈ ప్రాచీన ఆలయం కాలక్రమంలో శిథిలావస్థకు చేరుకుంది. ఆ పరిస్థితుల్లో సుమారు పదిహేను సంవత్సరాల క్రితం కొందరు భక్తులు పూనుకుని మరకత సోమలింగేశ్వర స్వామికి నూతన గర్భగుడిని నిర్మించి ఆలయాన్ని పునరుద్ధరించారు.

**ఆలయ విశేషాలు**
చందిప్ప సోమలింగేశ్వర స్వామి క్షేత్రంలో గర్భాలయంలో శివుని మరకత లింగం ముదురు ఆకుపచ్చ రంగులో ప్రకాశిస్తూ భక్తులకు ఆధ్యాత్మిక అనుభూతిని అందిస్తుంది.

ఆరోగ్యాన్ని అందించే మరెలిసినట్లుగా పురాణాలు చెబుతాయి. ద్వాదశ జ్యోతిర్లింగ క్షేత్రాల్లో మహారాష్ట్రలోని పర్లిలో వైద్య నాథేశ్వరుడిగా కొలువుదీరిన శివుడు భక్తులకు ఆయురారోగ్యాలను ప్రసాదిస్తాడనే కత సోమేశ్వరుడు
పర్లి వైద్యనాథ జ్యోతిర్లింగానికి, చందిప్ప మరకత లింగానికి దగ్గర పోలికలు ఉన్నాయని ఆలయ పండితులు చెబుతారు. చందిప్ప శివయ్యను దర్శించి భక్తితో పూజిస్తే సంపూర్ణ ఆరోగ్యం లభిస్తుందని భక్తుల విశ్వాసం.

**క్షేత్రపాలకుడిగా కాలభైరవుడు**
చందిప్ప మరకత సోమేశ్వర స్వామి ఆలయానికి కాలభైరవుడు క్షేత్ర పాలకుడిగా వ్యవహరిస్తున్నాడు. సోమేశ్వర స్వామి ఆలయ ప్రాంగణంలో వెలసి ఉన్న కాలభైరవుడు ఆలయాన్ని వెయ్యి కళ్లతో రక్షిస్తాడని నమ్మకం. ఆదివారం కాలభైరవ స్వామిని పూజిస్తే సమస్త గ్రహ దోషాలు తొలగిపోతాయని విశ్వాసం. అలాగే శివుని కుమారుడైన సుబ్రహ్మణ్యస్వామి సర్ప రూపంలో ఆలయ ప్రాంగణంలో సంచరిస్తాడని ప్రతీతి.

**సోమేశ్వర స్వామికి సూర్యాభిషేకం**
2007లో శివరాత్రి సందర్భంగా సోమేశ్వర స్వామికి ప్రత్యేక అభిషేకాలు నిర్వహిస్తున్న సమయంలో తొలిసారిగా శివలింగంపై పడిన సూర్యకిరణాలు పరావర్తనం కావడంతో స్వామి లింగం మరకత లింగమని గుర్తించారు. ఆనాటి నుంచి ఈ ఆలయానికి బహుళ ప్రాచుర్యం లభించింది. అప్పటి నుంచి భక్తుల సహకారంతో ఆలయం దినదినాభివృద్ధి చెందసాగింది.


**పూజోత్సవాలు**
చందిప్ప మరకత సోమేశ్వర స్వామి ఆలయంలో ప్రతిరోజూ త్రికాల పూజలు, అభిషేకాలు, త్రిసంధ్య హారతులు విశేషంగా జరుగుతాయి. ప్రతి సోమవారం విశేష పూజలు జరుగుతాయి. శ్రావణం, కార్తిక మాసాల్లో ప్రత్యేక పూజలు, మహాశివరాత్రి వేడుకలు కూడా ఈ క్షేత్రంలో ఘనంగా నిర్వహిస్తారు.
దర్శన ఫలం
చందిప్ప మరకత సోమేశ్వర స్వామి క్షేత్రంలో వెలసిన శివయ్యను దర్శిస్తే అనారోగ్య సమస్యలు దూరమవుతాయని సంపూర్ణ ఆరోగ్యం సిద్ధిస్తుందని విశ్వాసం.

**ఎలా చేరుకోవాలి?**
హైదరాబాద్‌కు సుమారు 48 కిలోమీటర్ల దూరంలో ఉన్న ఈ చందిప్ప మరకత సోమేశ్వర స్వామి క్షేత్రం భక్తులకు ఆధ్యాత్మిక ఆనందాన్ని అందిస్తుంది. మనం కూడా చందిప్ప మరకత సోమేశ్వర స్వామి క్షేత్రాన్ని దర్శిద్దాం. ఆయురారోగ్య ఐశ్వర్యాలను పొందుదాం.

**ఓం నమః శివాయ**
ముఖ్య గమనిక : పైన తెలిపిన వివరాలు కొందరు నిపుణులు, వివిధ శాస్త్రాల్లో పేర్కొన్న అంశాల ఆధారంగా అందించినవి మాత్రమే. వీటిలో అన్నిటికీ ఆధునిక శాస్త్రీయ ఆధారాలు లేకపోవచ్చుననే విషయాన్ని పాఠకులు గమనించాలి. దీన్ని ఎంతవరకు విశ్వసించాలనేది పూర్తిగా మీ వ్యక్తిగత విషయం

# పని మీద నుంచి దృష్టి మళ్లుతోందా?

ఎక్కడో ఉండి ఏదో ఆలోచిస్తాం. రకరకాల వ్యాపకాల్లో మునిగిపోయి అన్యమనస్కంగా ఉంటాం. ఫోన్?కు వచ్చే నోటిఫికేషన్లపై శ్రద్ధ పెట్టి చేస్తున్న పనిపై ఏకాగ్రత నిలపలేకపోతున్నాం. దృష్టిని ఆకర్షించే ఈ ఫీచర్లు మనలో ఒత్తిడిని పెంచి, ఉత్పాదకతను తగ్గిస్తాయని పరిశోధనలు పేర్కొంటున్నాయి. ఈ క్రమంలో మన ఏకాగ్రతను తిరిగి పొందడానికి మార్గాలున్నాయంటున్నారు నిపుణులు. మరి, అదెలాగో ఇప్పుడు తెలుసుకుందాం!
మనిషి మెదడులోని కొన్ని ప్రాంతాల నెట్?వర్క్ మన శ్రద్ధను నియంత్రిస్తుందట. దీనివల్ల మనం సంబంధిత సమాచారంపై దృష్టి పెట్టి, మిగతా వాటిని నియంత్రిస్తామని నిపుణులు చెబుతున్నారు. మన లక్ష్యాలు ఏంటి? చుట్టూ ఉన్న ప్రపంచంలో ఏం జరుగుతోంది? అనే వాటి మధ్య సమతుల్యతే మన దృష్టిని మళ్లిస్తుందని చెబుతున్నారు. దీని అర్థం.. ఆకస్మిక లేదా అత్యవసర సంఘటనలు మన దృష్టిని ఆకర్షించి అప్పటికే చేయాలనుకుంటున్న పనిసాంకేతికతతో ఏం చేటు?: సోషల్ మీడియాలో పోస్టులు, లైక్?లు లాంటివి పని సమయంలో ఏకాగ్రతకు అంతరాయం కలిగిస్తుంటాయంటున్నారు నిపుణులు. ఇవి మన ప్రాథమిక దృష్టిని నేరుగా దెబ్బతీయవట. కానీ, పనుల మధ్య తరచుగా మారేలా చేస్తూ ఏకాగ్రతను చెడగొడతాయని చెబుతున్నారు. అయితే, మల్టీ టాస్కింగ్?పై అపోహ ఏమిటంటే.. మనం ఒకేసారి రెండు కష్టమైన పనులను చేయగలమని అర్థం. అయితే, మన శ్రద్ధకు పరిమితమైన సామర్థ్యం ఉంటుందట. అంటే, మన చుట్టూ జరుగుతున్న ప్రతిదాన్నీ మనం ఏక కాలంలో గ్రహించలేమని వివరిస్తున్నారు. మల్టీటాస్కింగ్ అంటే వాస్తవానికి ఒకేసారి చేయడం కాదు, రెండు పనుల మధ్య వేగంగా మారడం (టాస్క్ స్విచింగ్) మాత్రమే. ఈ క్రమంలో ఓ పని ఎంత సుపరిచితమైనా టాస్క్ స్విచింగ్? అనేది మనం ఒకటి లేదా రెండు పనులను చేసే సామర్థ్యాన్ని దెబ్బతీస్తుందని పరిశోధనలు చెబుతున్నారు.



కొన్ని చిన్న జీవన శైలి మార్పులు చేసుకోవడం ద్వారా మన ఏకాగ్రతను పెంపొందించుకోవచ్చని నిపుణులు చెబుతున్నారు.
టీనేజర్ల ఆలోచనలను పేరెంట్స్ – తల్లిదండ్రుల ప్రేమను పిల్లలు అర్థం చేసుకుంటే అన్నీ హ్యాపీడేసే!ఆ పరధ్యానాల్ని పరిమితం చేయండి : ఎలక్ట్రానిక్ పరికరాల నుంచి వచ్చే పరధ్యానాల్ని ఫోన్?లో 'ఫోకస్' మోడ్?లను సెటప్ చేయడం ద్వారా పరిమితం చేయొచ్చని నిపుణులు చెబుతున్నారు. ముఖ్యంగా, పని లేదా డ్రైవింగ్ చేస్తున్నప్పుడు.. మనకు వచ్చే నోటిఫికేషన్?ల సంఖ్యను పరిమితం చేస్తే పరధ్యానాలు వాటంతట అవే ఫిల్టర్ అవుతాయంటున్నారు.యాప్?ల నుంచి వచ్చే అన్ని నోటిఫికేషన్?లను ఆఫ్ చేసి, వాటిని తనిఖీ చేయడానికి నిర్దిష్ట సమయాలను షెడ్యూల్ చేసుకోవాలని సూచిస్తున్నారు
భోజనానికి 10 నిమిషాల ముందు మిమ్మల్ని మీరు జవాబుదారీగా ఉంచుకోవడానికి టైమర్?లను సెట్ చేసుకోవాలని సలహా ఇస్తున్నారు.మీ స్క్రీన్ సమయాన్ని ట్రాక్ చేసే యాప్?లు సహాయపడొచ్చని తెలియజేస్తున్నారు. మొబైల్ గేమ్?లకు దూరంగా ఉండటం మేలటకార్యకలాపాల్ని ఎంచుకోండి :పనుల మధ్య నిరంతరం మారడం మన ఏకాగ్రతను బలహీనపరుస్తుందని నిపుణులు చెబుతున్నారు. దీన్ని అధిగమించడానికి నిరంతర శ్రద్ధ అవసరమయ్యే కార్యకలాపాలకు ప్రాధాన్యం సూచిస్తున్నారు.సంగీతం వాయించడం, ఆటల పోటీలు వంటి లీనమయ్యే కార్యకలాపాలను వారానికి కొన్ని సార్లు చేస్తే మెరుగుపడుతుందంటున్నారుఆరోగ్యకరమైన జీవనశైలిలోని అనేక అంశాలు, నిద్ర, వ్యాయామంతో
డిజిటల్?కు దూరంగా :నిద్రపోయే ముందు మొబైల్ ఫోన్లు ఉపయోగించకుండా, వాటిని బెడ్?రూమ్?కి దూరంగా ఉంచే వ్యక్తులు బాగా నిద్రపోతారని, కదా అని వెంటనే డిజిటల్ పరికరాన్ని తీసుకోవద్దంటున్నారు నిపుణులు.
మనస్సును స్వేచ్ఛగా సంచరించనివ్వడానికి క్రమం తప్పకుండా విరామం తీసుకోవడం ముఖ్యమని నిపుణులు చెబుతున్నారు. దీనివల్ల మెదడు సమాచారాన్ని ప్రాసెస్ చేయడానికి, విభిన్న భావనలు, అనుభవాల మధ్య కొత్త సంబంధాలను ఏర్పరచుకోవడానికి వీలు కల్పిస్తుందని పేర్కొంటున్నారు. తద్వారా సృజనాత్మకత పెరుగుతుందంటున్నారు.
చీూజు : ఇక్కడ మీకు అందించిన ఆరోగ్య సమాచారం, సూచనలు అన్నీ మీ అవగాహన కోసం మాత్రమే. శాస్త్ర పరిశోధనలు, అధ్యయనాలు, వైద్య, ఆరోగ్య నిపుణుల సూచనల ప్రకారమే మేము ఈ సమాచారాన్ని అందిస్తున్నాం. కానీ, వీటిని పాటించే ముందు కచ్చితంగా మీ వ్యక్తిగత వైద్యుల సలహాలు తీసుకోవడమే మంచిది.

# జుట్టు సమస్యలకు "మునగాకు"! - ఎలా ఉపయోగించాలో తెలుసా?



జుట్టు ఆరోగ్యంగా ఉండాలంటే కుదుళ్లు దృఢంగా ఉండాలి. ఇందుకోసం పోషకాహారం తీసుకోవడం, సహజసిద్ధమైన హెయిర్? ప్యాక్స్ వేసుకుంటుంటారు చాలామంది. అయితే, ఈ జాబితాలో మునగాకు పొడిని కూడా చేర్చుకోమని నిపుణులు సూచిస్తున్నారు. ఈ క్రమంలో దీన్ని కూరల్లో భాగం చేసుకోమంటున్నారు. అలాగే, ఈ పొడితో హెయిర్ ప్యాక్స్ లేదా మాస్కులు వేసుకోమని సూచిస్తున్నారు. దీనివల్ల కుదుళ్ల ఆరోగ్యాన్ని మెరుగుపరచుకోవచ్చని చెబుతున్నారు. మరి,
జిడ్డుదనం దూరం : కుదుళ్లు జిడ్డుగా మారడం వల్ల దురద, చుండ్రు వంటి సమస్యలొస్తాయంటున్నారు నిపుణులు. ఇవి జుట్టు రాలడానికి కారణమవుతాయని చెబుతున్నారు. ఈ క్రమంలో మునగాకు పొడి వీటికి విరుగుడుగా పని చేస్తుందని పేర్కొంటున్నారు. ఇందులో ఉండే జింక్ అనేది కుదుళ్లలోని నూనె గ్రంథులు విడుదల చేసే సీబమ్?ను క్రమబద్ధీకరిస్తుందని తెలియజేస్తున్నారు. తద్వారా కుదుళ్లు తేమగా ఉండటంతో పాటు జుట్టు పెరుగుదలను ప్రేరేపిస్తుందట. కురులు ప్రకాశవంతంగానూ కనిపించేలా చేస్తాయంటున్నారు.
"సరిపోదా శనివారం" – నీలి మేఘమాలవో, నీలాల తారవో!దురద రాకుండా : కొంతమందికి కుదుళ్లలో దురద, పొక్కుల్లా ఏర్పడడం వంటి సమస్యలు వస్తుంటాయని నిపుణులు చెబుతున్నారు. ఇలాంటి వారు మునగాకు పొడితో తయారు చేసిన హెయిర్ మాస్కులు ఉపయోగించడం.. ఈ పొడిని ఆహారంలో భాగం చేసుకోవడం వల్ల మంచి ఫలితం ఉంటుందని తెలియజేస్తున్నారు. ఈ క్రమంలో మునగాకు పొడిలోని యాంటీ బ్యాక్టీరియల్, యాంటీ ఫంగల్ గుణాలు కుదుళ్లలోని ఆయా సమస్యల్ని దూరం చేయడంలో ప్రభావవంతంగా పనిచేస్తాయంటున్నారు.ఒత్తిడిని తగ్గిస్తాయి : శరీరంలో ఉండే ఫ్రీ రాడికల్స్ చర్మ ఆరోగ్యంపైనే కాదు.. కుదుళ్లపైనా ప్రతికూల ప్రభావం చూపుతాయని నిపుణులు చెబుతున్నారు. అందుకే, వీటితో పోరాడే గుణాలున్న మునగాకు పొడిని మనం తీసుకునే ఆహారం, పాటించే బ్యూటీ రొటీన్?లో భాగం చేసుకోమని సూచిస్తున్నారు. ఈ పొడిలో అధికంగా ఉండే యాంటీ ఆక్సిడెంట్లు, విటమిన్ సి అనేవి ఫ్రీ రాడికల్స్?తో పోరాడి ఒత్తిడిని తగ్గిస్తాయని తెలియజేస్తున్నారు.
ప్రకాశవంతంగా : జుట్టు ఒత్తుగా పెరగడమే కాదు.. ప్రకాశవంతంగా ఉన్నప్పుడే దాని అందం ఇనుమడిస్తుందని నిపుణులు చెబుతున్నారు. మునగాకులోని బెహెనిక్ ఆమ్లం ఈ పనుల్ని సమర్థంగా నిర్వర్తిస్తుందని పేర్కొంటున్నారు. ఎందుకంటే, ఈ ఆమ్లం జుట్టుకు సహజసిద్ధమైన కండిషనర్?లా పనిచేస్తుందని పేర్కొంటున్నారు. తద్వారా ఆశించిన ఫలితాన్ని పొందచ్చట.
కుదుళ్లు దృఢంగా : కుదుళ్లు ఆరోగ్యంగా, దృఢంగా ఉన్నప్పుడే జుట్టు ఒత్తుగా పెరుగుతుందని నిపుణులు చెబుతున్నారు.

# కోటి జన్మల పుణ్యఫలం అందించే దక్షిణ కాశీ- కడపలోని ఈ మహిమాన్విత శివక్షేత్రం గురించి తెలుసా?




: తనను ఆశ్రయించిన భక్తుల పాపాలు పోగొట్టి ముక్తిని ప్రసాదించే పరమేశ్వరుడు వెలసిన ఎన్నో క్షేత్రాలు పుణ్యక్షేత్రాలుగా విరాజిల్లుతున్నాయి. మన సనాతన ధర్మం సర్వాధార చైతన్యమే శివుడిని అంటోంది. సాలెపురుగు, సర్పం, ఏనుగు వంటి మూగజీవాలకు కూడా మోక్షాన్ని ప్రసాదించి శివుడు భోళాశంకరుడయ్యాడు. ఈ సకల చరాచర సృష్టి మొత్తం పరమేశ్వరుడు వ్యాపించి ఉన్నాడు. అజ్ఞానంతో మనమే శంకరుని ఉనికి కనిపెట్టలేక ఆలయాలు నిర్మించి పూజోత్సవాలు జరుపుకుంటున్నాం. అందుకే తన భక్తుల కోసం శివుడు అనేక ప్రాంతాల్లో స్వయంభువుగా వెలిసాడు.

**దక్షిణ కాశీ ఈ క్షేత్రం**
దక్షిణ కాశీగా పేరొందిన కోన మల్లేశ్వరం క్షేత్రం కడప జిల్లా పులివెందుల సమీపంలోని లింగాల మండల పార్నపల్లెలో వెలసి ఉంది. దక్షిణ కాశీగా పేరొందిన ఈ క్షేత్రంలో పరమేశ్వరుడు కొలువై పూజలందుకుంటున్నాడు. సాధారణంగా శివుని ఆలయాలు తూర్పు ముఖంగా ఉంటాయి. కానీ కోన మల్లేశ్వరం క్షేత్రంలో మాత్రం శివుడు పశ్చిమాభి ముఖంగా వెలసి ఉన్నాడు. ఈ క్షేత్రంలో శివలింగాన్ని కణ్వమహర్షి ప్రతిష్ఠించినట్లుగా ఆలయ స్థల పురాణం ద్వారా తెలుస్తోంది.

**స్థల పురాణం**
పురాణాల ప్రకారం ఈ ప్రదేశంలో కణ్వమహర్షి శివలింగాన్ని ప్రతిష్ఠించి తపస్సు చేసినట్లుగా తెలుస్తోంది. సీతారామలక్ష్మణులు కూడా తమ వనవాస ప్రాంతంలో ఈ క్షేత్రాన్ని దర్శించి పూజలు జరిపినట్లుగా తెలుస్తోంది. కాలక్రమేణా పాండవుల మనవడు, పరీక్షిత్తు మహారాజు కుమారుడైన జనమేజయుడు కోన మల్లేశ్వరం ఆలయాన్ని నిర్మించినట్లుగా ఆలయ స్థల పురాణాన్ని అనుసరించి స్పష్టం అవుతోంది.

**మునులు తపస్సు చేసిన పుణ్య ప్రదేశం**
పూర్వం ఒకానొకసారి ఐదుగురు మునీశ్వరులు తూర్పు నుంచి పడమర వైపుకు ప్రవహించే నదీ తీరంలో తపస్సు చేయాలని భావించి కాలినడకన తిరుమల నుంచి బయల్దేరారు. కడప జిల్లా గండి క్షేత్రం వద్ద పాపాఘ్ని నది తూర్పు నుంచి పడమరకు ప్రవహిస్తుండడంతో వారు ఆ నదీ తీరంలో తపస్సు చేసుకుంటూ అక్కడే ఉన్నారు.

'కోన' కు చేరుకున్న మునీశ్వరులు
కాలక్రమేణా జనసంచారం పెరగడంతో మునీశ్వరులు అక్కడ నుంచి కాలిబాటన బయలుదేరి 'కోన' ప్రదేశానికి చేరుకున్నారు. ఆ మునీశ్వరులు ఈ ప్రాంతాన్ని కణ్వమహర్షి, సీతారాములు నడయాడిన పవిత్ర ప్రదేశంగా తమ దివ్యదృష్టితో గుర్తించి అక్కడే తమ తపస్సును కొనసాగించారు.

**శివ సాక్షాత్కారం**
ఒకసారి ఆ మునీశ్వరులకు శివుడు స్వప్నంలో దర్శనం ఇస్తాడు. దాంతో ఆ మునులు తత్పురుష, వాయవ్య, అమోఘ, మృత్యుంజయ, అగ్ని జ్యోత్స్న అనే ఐదు విగ్రహాలను ప్రతిష్ఠించారు. ఈ విగ్రహాలు నేటికీ అక్కడ దర్శనమిస్తాయి.

**ఆలయ విశేషాలు**
గర్భాలయంలో శివుడు పశ్చిమాభి ముఖంగా వెలసి భక్తుల పాలిట కొంగుబంగారమై పూజలందుకుంటున్నాడు. ఆలయ ప్రాంగణంలో చాముండేశ్వరి దేవి, పార్వతి దేవి, హనుమంతుడు, దత్తాత్రేయ స్వామి వంటి దేవీ దేవతల ఉపాలయాలున్నాయి. ముందుగా పరమశివుని దర్శించుకున్న అనంతరం భక్తులు ఈ దేవీదేవతలను కూడా దర్శించుకుంటారు.

**పూజోత్సవాలు**
దక్షిణ కాశీగా పేరొందిన కోన మల్లేశ్వరం క్షేత్రంలో కార్తిక మాసంలో బ్రహ్మోత్సవాలు ఘనంగా జరుగుతాయి. అలాగే మాఘమాసంలో వచ్చే నాలుగు సోమవారాలు, మహాశివరాత్రి పూజలు వీక్షించడానికి స్థానికులే కాకుండా ఇతర ప్రాంతాల నుంచి కూడా వేలాది మంది భక్తులు పెద్ద ఎత్తున తరలి వస్తారు.
పరమ పవిత్రం కోనేటి స్నానం
కోన మల్లేశ్వరం క్షేత్రంలో ఉన్న పవిత్ర కోనేటిలో ఉన్న నంది నోటి నుంచి నిత్యం జలప్రవాహం ఉంటుంది. ఈ పవిత్ర కోనేటిలో స్నానం చేసి శివుని దర్శించుకుంటే పంచారామాలు, కాశీ క్షేత్రాన్ని దర్శించిన ఫలితం లభిస్తుందని విశ్వాసం.

**కోటి జన్మల పుణ్యఫలం**
కార్తిక మాసం చివరి సోమవారం రోజు మునీశ్వరులు అదృశ్య రూపంలో వచ్చి ఈ కోనేటిలో స్నానం చేసి పరమశివుని పూజిస్తారని విశ్వాసం. అతి ప్రాచీనమైన, మహిమాన్వితమైన ఈ క్షేత్రాన్ని సందర్శించి శివయ్యకు పూజలు జరిపిస్తే విద్యాప్రాప్తి, వివాహం, ఉద్యోగం, రుణ విమోచనం, సంతానప్రాప్తి కలుగుతాయని విశ్వాసం. అసలు ఈ క్షేత్ర దర్శనమే కోటి జన్మల పుణ్యఫలమని భక్తుల విశ్వాసం.

ఈ మహిమాన్వితమైన క్షేత్రాన్ని దర్శించి మనం కూడా శివయ్య అనుగ్రహాన్ని పొందుదాం.

**ఓం నమః శివాయ!**

ముఖ్య గమనిక : పైన తెలిపిన వివరాలు కొందరు నిపుణులు, వివిధ శాస్త్రాల్లో పేర్కొన్న అంశాల ఆధారంగా అందించినవి మాత్రమే. వీటిలో అన్నిటికీ ఆధునిక శాస్త్రీయ ఆధారాలు లేకపోవచ్చుననే విషయాన్ని పాఠకులు గమనించాలి. దీన్ని ఎంతవరకు విశ్వసించాలనేది పూర్తిగా మీ విషయం.

# ప్రగతి నిరోధకులు

కంకర తేలిన రోడ్డుపై నడవడానికి..
సరైన చెప్పులు వేసుకొని నడుస్తాం
అవే చెప్పులో చిన్న రాయి వస్తే..
సరైన రోడ్డు మీద కూడా నడవలేం
జీవితం కూడా అంతే కదా !

బాహ్య శత్రువును ఓడించడానికి..
అన్ని జాగ్రత్తలు తీసుకుంటాం
అంతర్గత ఆత్మన్యూనత శత్రువును..
ఓడించడానికి మనల్ని మనమే..
సంస్కరించుకుంటూ అడుగులు వేద్దాం !

కన్నీటి వరదలు పారినపుడు..
ఆనంద భాష్పాలు ప్రవహించినపుడు..
ఒళ్లంతా చెమటతో తడిసినపుడు..
నన్ను వీడక నా వెంట నడిచే వారే కదా..
నాకు అత్యంత ఆత్మీయ ప్రాణ స్నేహితులు !

మాట మీట నిలబడని మనుషులు
నేల మీద నడవడం మరిచిన నరులు
తిన్నింటి వాసాలు లెక్కించే జనులు
నవ్వినోన్ని చూసి ఏడ్చే నరపుంగవులు
వీరే కదా అతి పెద్ద ప్రగతి నిరోధకులు !

మధుపాళీ
9949700037

## కొండగట్టు అంజన్నను దర్శించుకున్న రీజినల్ విజిలెన్స్ అండ్ ఎన్ఫోర్స్మెంట్ ఎస్పీ జి. బస్వారెడ్డి



**జగిత్యాల** జిల్లా కొండగట్టు శ్రీ ఆంజనేయ స్వామి దేవస్థానాన్ని కరీంనగర్ రీజినల్ విజిలెన్స్ అండ్ ఎన్ఫోర్స్మెంట్ విభాగానికి నూతనంగా ఎస్పీగా బాధ్యతలు స్వీకరించిన జి. బస్వారెడ్డి దర్శించుకున్నారు. ఆలయానికి చేరుకున్న ఆయనకు దేవస్థాన అధికారులు, అర్చకులు ఆలయ సంప్రదాయం ప్రకారం స్వాగతం పలికి ప్రత్యేక దర్శనం కల్పించారు. అనంతరం స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించిన అనంతరం ఉపప్రధాన అర్చకులు చిరంజీవి ఆశీర్వాదించి శేషవస్త్రం అందించారు. ఈ కార్యక్రమంలో దేవస్థాన పర్యవేక్షకులు సునీల్ ,చంద్రశేఖర్ లతో పాటుగా స్థానిక ఎస్సై సందీప్ టెంపుల్ ఇన్స్పెక్టర్ చెక్కిళ్ళ అశోక్ పాల్గొన్నారు.

## ఓటర్ల ఇబ్బందులకు ఈసీఐ సాఫ్ట్‌వేర్ లోపాలే కారణం: ఆధార్ ఓటీపీ ఆధారిత పేరు సవరణకు అవకాశం ఇవ్వాలి


**-- సీఈఓకు కేకే నగర్ రెసిడెంట్స్ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షులు రేగడమిల్లి రాధాకృష్ణ విజ్ఞప్తి**



తెలంగాణలో ప్రస్తుతం కొనసాగుతున్న 'ఎస్ఐఆర్ 2026' (SIR 2026) ఆన్‌లైన్ ఎన్యుమరేషన్ ప్రక్రియలో సాంకేతిక లోపాల కారణంగా నిజమైన ఓటర్లు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని కేకే నగర్ రెసిడెంట్స్ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షులు రేగడమిల్లి రాధాకృష్ణ ఆందోళన వ్యక్తం చేశారు. ఎన్నికల సంఘం (ECI) సాఫ్ట్‌వేర్ లోపాల వల్లే ఆధార్ వివరాలతో ఓటర్ ఐడీ పేర్లు సరిపోలడం లేదని (నేమ్ మిస్‌మ్యాచ్), దీనిపై రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి (CEO) తక్షణమే స్పందించి తగిన చర్యలు తీసుకోవాలని ఆయన కోరారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, గతంలో ఓటర్ ఐడీల కోసం దరఖాస్తు చేసుకున్న సమయంలో ఎన్నికల సంఘం సూచించిన నిబంధనల ప్రకారమే ఓటర్లు తమ ఇంటిపేరు (Surname), పేరు (Given Name)లను నిర్ణీత కాలమ్‌లలో సరిగ్గానే నమోదు చేశారని గుర్తుచేశారు. అయితే, ప్రస్తుత డేటాబేస్ ఫార్మాట్ ఆధార్‌తో సరిపోలకపోవడానికి వ్యవస్థలోని లోపాలే కారణమని, అందుకు ఓటర్లను ఇబ్బందులకు గురిచేయడం సరికాదని హితవు పలికారు. చాలా మంది ఓటర్ల పేర్లలో ఎలాంటి స్పెల్లింగ్ తప్పులు లేవని, కేవలం ఇంటిపేరు ముందు వెనుకలు కావడం వల్లే సాఫ్ట్‌వేర్ వాటిని 'మిస్‌మ్యాచ్' (తప్పులు)గా చూపిస్తోందని స్పష్టం చేశారు.?నిజమైన ఓటర్లు బూత్ లెవెల్ ఆఫీసర్ల (BLOs) చుట్టూ తిరగాల్సిన అవసరం లేకుండా, ఆన్‌లైన్‌లోనే సులభంగా ఈ ప్రక్రియను పూర్తి చేసుకునేందుకు వీలుగా ఈ క్రింది మార్పులను పరిశీలించాలని ఆయన ఎన్నికల సంఘాన్ని కోరారు: 1.సాఫ్ట్‌వేర్‌లో మార్పులు:ఆన్‌లైన్ ఎన్యుమరేషన్ ఫామ్‌లో ఓటరు యొక్క ఇంటిపేరును పేరుకు ముందు లేదా వెనుక ఎలా ఉన్నా అంగీకరించేలా ఈసీఐ సాఫ్ట్‌వేర్‌లో తగిన మార్పులు చేయాలి. 2.ఆధార్ ఓటీపీ సదుపాయం : ఒకవేళ సాఫ్ట్‌వేర్ అప్‌డేట్ సాధ్యం కాకపోతే, ఓటర్లు తమ ఆధార్ ఓటీపీ (Aadhaar OTP) సహాయంతో ఓటర్ ఐడీలోని పేరును ఆధార్ కార్డులో ఉన్న విధంగా స్వయంగా మార్చుకునే (Self-Correction) సదుపాయాన్ని కల్పించాలి. క్షేత్రస్థాయి మద్దతు: క్షేత్రస్థాయిలో ఓటర్లకు అవసరమైన సాంకేతిక సహాయాన్ని మరింత బలోపేతం చేయాలి. ఈ సమస్యపై సానుకూలంగా స్పందించి, అర్హులైన ఓటర్లు ఎవరూ ఇబ్బంది పడకుండా ఎస్ఐఆర్ 2026 ప్రక్రియను విజయవంతం చేయాలని రాధాకృష్ణ సీఈఓను డిమాండ్ చేశారు. ఈ మేరకు తన ఎన్యుమరేషన్ ఫామ్, సాఫ్ట్‌వేర్ లోపాన్ని చూపే స్క్రీన్‌షాట్‌లను కూడా ఆయన ఉన్నతాధికారుల పరిశీలనకు జతచేశారు.

## శ్రీ ప్రసన్న వెంకటేశ్వర స్వామి సేవలో ఎమ్మెల్యే పాశం సునీల్ కుమార్

**వైభవంగా 28 వ వార్షిక బ్రహ్మోత్సవాలు , లక్ష తులసీ పూజ , భారీ అన్నదానం**





**నెల్లూరు** :గూడూరు పట్టణంలోని శ్రీ ప్రసన్న వెంకటేశ్వర స్వామి ఆలయంలో జరుగుతున్న 28వ వార్షిక బ్రహ్మోత్సవాలు అత్యంత వైభవంగా కొనసాగుతున్నాయి. ఈ పవిత్ర కార్యక్రమానికి విచ్చేసిన గూడూరు నియోజకవర్గ ఎమ్మెల్యే పాశం సునీల్ కుమార్ కు ఆలయ అర్చకులు పూర్ణకుంభంతో ఘన స్వాగతం పలికారు. వేద మంత్రోచ్చారణల నడుమ ఆయనకు ఆలయ మర్యాదలతో స్వాగతం పలుకగా స్వామి వారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. భక్తులతో కలిసి అన్నదానంలో పాల్గొన్న ఎమ్మెల్యే ఈ సందర్భంగా ఎమ్మెల్యే పాశం సునీల్ కుమార్ మాట్లాడుతూ, స్వామివారి ఆశీస్సులు నియోజకవర్గంలోని ప్రజలందరిపై ఉండాలని, అందరూ సుఖసంతోషాలతో, ఆయురారోగ్యాలతో ఉండాలని కోరుకున్నారు. అనంతరం ఆలయ ప్రాంగణంలో ఏర్పాటు చేసిన భారీ అన్నదాన కార్యక్రమంలో ఆయన స్వయంగా పాల్గొని, భక్తులకు అన్నప్రసాదాలను వడ్డించారు. భక్తులతో కలిసి ఆయన భోజనం చేయడం విశేషం లక్ష తులసీ పూజ మరియు పుష్పయాగంతో ఆధ్యాత్మిక శోభ బ్రహ్మోత్సవాల్లో భాగంగా శనివారం అత్యంత భక్తిశ్రద్ధలతో లక్ష తులసీ పూజ మరియు పుష్పయాగోత్సవం నిర్వహించారు. ఈ కార్యక్రమాలకు స్థానిక మహిళా భక్తులు భారీ సంఖ్యలో తరలివచ్చారు. మహిళలందరూ భక్తిపారవశ్యంతో ప్రత్యేక పూజలు నిర్వహించడంతో ఆలయ ప్రాంగణమంతా ఆధ్యాత్మిక శోభతో వెల్లివిరిసింది. స్వామివారిని వివిధ రకాల పుష్పాలతో విశేషంగా అలంకరించిన అర్చకులు, శాస్త్రోక్తంగా ప్రత్యేక పూజలు, నైవేద్యాలను సమర్పించారు. ఈ కార్యక్రమంలో దేవస్థాన పాలక మండలి చైర్మన్ శ్రీకంటి రామ్మోహన్ రావు , దేవస్థాన పాలక మండలి సభ్యులు ధర్మకర్తలు మంగళపూరి గోపాల్ , శ్రీమతి పర్వతాల శివరంజని , శ్రీమతి గుడి మంజులమ్మ , ఆరుమూళ్ళ శ్రీరంగ , ఓబిలి బాబు, పేపళ్ళ అమరయ్య నాయుడు , శ్రీమతి యద్దలపూడి సుజన , కొమ్మా రవీంద్రబాబు , పలువురు నాయకులు , భారీ సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

# వృత్తి ఉద్యోగాలు మాత్రమే జీవితం కాదు !

**(05 జూలై "జాతీయ వర్క్‌హాలిక్స్ దినం" సందర్భంగా)**

కొందరు వృత్తి సంబంధ పనుల్లో తనమునకలై, తమ వ్యక్తిగత పనులనే కాదు తమ కుటుంబాలను కూడా నిర్లక్ష్యం చేస్తూ పని రాక్షసులుగా పిలువబడుతూనే అనేక ఇతర సమస్యలను కూడా ఎదుర్కొంటారు. ఇలాంటి అతిగా పని చేసే వారిని మనం సాధారణంగా పని రాక్షసులుగా పిలుస్తాం. అధిక సమయం వృత్తి లేదా ఉద్యోగ ఉపాధులకే కేటాయిస్తూ, తమను తాము మరిచి పోయి పలు అనారోగ్య సమస్యలకు కూడా లోనవుతున్నారు. వీరిని 'వర్క్‌హాలిక్స్' అని పిలవడం పరిపాటిగా మారింది. 'వర్క్', 'ఆల్కహాల్' అను పదాల కలయికతో ఏర్పడిన 'వర్క్‌హాలిక్స్' గుణం కలిగి ఉన్న వ్యక్తులు వృత్తి ఉద్యోగ ఉపాధుల పనిల్లో మాత్రమే మునిగిపోయి తనను తాను మరిచి పోయి, కుటుంబాన్ని నిర్లక్ష్యం చేసి, తమ వ్యక్తిగత జీవితాలకు సహితం దూరమై తమ తమ జీవితాలను దుర్భరంగా మార్చుకుంటూ, అనారోగ్యాల బారిన పడడం చూస్తున్నాం. వృత్తికి సంబంధించిన పనులను చేయాలి కాని వ్యక్తిగత జీవితానికి, కుటుంబ సభ్యులకు కూడా తగిన సమయం కూడా కేటాయిస్తూ సమతుల్యతలను సాధించడమే అసలైన జీవన మాధుర్యమని తెలుసుకోవాలి.

జాతీయ వర్క్‌హాలిక్స్ దినం-2026 ఇతివృత్తం :

పనికి అనవసర అధిక సమయాలను కేటాయించడం, పని గంటలను మరిచి పనిలో మునిగి పోవడం లాంటి గుణాలు తమ జీవితాలను దుఃఖముతో చేస్తాయని అవగాహన పర్చడానికి ప్రతి ఏట 05 జూలైన ప్రపంచ దేశాలు "జాతీయ వర్క్‌హాలిక్స్ దినం" లేదా "జాతీయ అతిగా పని చేసే వారి దినం"గా పాటిస్తారు. 2026 జాతీయ వర్క్‌హాలిక్స్ దినోత్సవం ఇతివృత్తంగా "పనితో పాటు వ్యక్తిగత జీవితం సమతుల్యత అవగాహన" అనబడే అంశం తీసుకుని ప్రచారం నిర్వహిస్తున్నారు. ఇలాంటి లక్షణాలు కలిగిన వ్యక్తులు తమకు కేటాయించిన సమయంలో మాత్రమే పని చేస్తూ, వ్యక్తిగత జీవితాలతో పాటు కుటుంబాలకు తగు సమయాన్ని కేటాయిస్తూ జీవితంలో పనికి, ఇతర అంశాలకు సమతుల్యత సాధిస్తూ, సంతోష ఆరోగ్యకర జీవితాలను గడపడానికి ప్రయత్నాలు మొదలు పెట్టాలి. మన పనులను ప్రాధాన్యతాక్రమంలో నిర్ణయించుకొని అన్నింటికీ తగిన సమయం కేటాయించాలి. మనం వృత్తి పనులు చేయడానికి మాత్రమే కాదని గమనించాలి.

ఓవర్ టైమ్ పనిలోనే మునిగితే జరిగే అనర్థాలు:

మనకంటూ ఒక వ్యక్తిగత జీవితం ఉంది. మనకు కూడా అభిరుచులు ఉంటాయి. మనకు కూడా అందరితో కలిసి ఆనందంగా జీవించాలని ఉంటుంది. అభిరుచులను తీర్చుకోవాలని ఉంటుంది. మన కుటుంబాన్ని, సంతానాన్ని ఉన్నత స్థాయికి చేర్చాలని కూడా ఉంటుంది. జీవనోపాధికి ఏదో ఒక వృత్తిని ఎంచుకుంటాం. దాని నుంచి లభించే జీతంతో మనదైన జీవితాలను గడుపుతాం. జీతం మాత్రమే జీవితం కాదని తెలుసుకోవాలి. వృత్తి పనుల్లో అధిక సమయం కేటాయించడం ఉత్తమం కాదు. మనకు కేటాయించిన దాదాపు 8 గంటల సమయంలో మాత్రమే ఏకాగ్రతతో పని చేయాలి, ఉత్తమ ఫలితాలను సాధించాలి. అధిక సమయం పని చేస్తే ఏకాగ్రత లోపించి తక్కువ ఫలితాలు లేదా ఎక్కువ తప్పులు జరుగుతాయి. దీనితో మానసిక ఒత్తిడి, ఆందోళన, నిరాశ, నిద్రలేమి, అలసట, తలనొప్పి లాంటివి ఆవహిస్తాయి. అనారోగ్యం మనల్ని ఆక్రమిస్తుంది. ఓవర్ వర్క్ మనశ్శాంతిని హరిస్తుంది. సంస్థలో చెడ్డ పేరు తెస్తుంది. మనం వృత్తిలో పని గంటలను పాటిద్దాం. సహచర ఉద్యోగులతో సరదాగా కలిసి పని చేద్దాం, పనితో ఏకాగ్రతను పెంచుకుంటూ సాఫల్యత సాదిద్దాం. సమయానుకూలంగా కుటుంబంతో కలిసి వినోదాలు, విందులు, యాత్రలకు ప్రణాళికలు వేద్దాం. జీవితాన్ని సమతుల్యతతో సంతోషాలు నిండిన మహాభాగ్యంగా మలుచుకుందాం. మన ఆరోగ్యం మన చేతుల్లో ఉందని తెలుసుకుందాం. ఆరోగ్యానికి కొంత సమయాన్ని పెట్టుబడిగా పెడదాం. ఆరోగ్యం ఉంటేనే వృత్తి ఉద్యోగాలని తెలుసుకుందాం. వర్క్-లైఫ్‌ను బ్యాలెన్స్ చేసుకుంటూ ఆనంద సుగంధాలతో జీవితాలను కొనసాగిద్దాం. అందరూ మెచ్చే విధంగా జీవనశైలినా మార్చుకుందాం.

డాక్టర్ : బుర్ర మధుసూదన్ రెడ్డి

# అందరి ఆటగా బ్యాడ్మింటన్‌కు ఆదరణ !

**(05 జూలై "ప్రపంచ బ్యాడ్మింటన్ దినోత్సవం" సందర్భంగా)**

98 ఏండ్ల క్రితం 05 జూలై 1934 రోజున "బ్యాడ్మింటన్ వరల్డ్ ఫెడరేషన్ (ప్రపంచ బ్యాడ్మింటన్ సమాఖ్య)" ఏర్పడిన శుభ సందర్భానికి గుర్తుగా ప్రతి ఏట 05 జూలైన ప్రపంచవ్యాప్తంగా "ప్రపంచ బ్యాడ్మింటన్ దినోత్సవం" జరుపుకోవడం ఆనవాయితీగా మారింది. ప్రపంచ బ్యాడ్మింటన్ దినం వేదికగా బ్యాడ్మింటన్ క్రీడను బాల్యం నుంచే ప్రోత్సహించడం, క్రీడాకారులను గౌరవించడం, ఆరోగ్యకర జీవనశైలిని పెంపొందించడం, రోజూ ఆడుకునే అలవాటు చేసుకోవడం, స్ఫూర్తిని రగిలించడం జరుగుతుంది. జిల్లా స్థాయి నుంచి ఒలంపిక్స్ వరకు బ్యాడ్మింటన్ క్రీడకు అధిక ప్రాధాన్యం ఇవ్వబడుతున్నది. ప్రపంచ బ్యాడ్మింటన్ దినం-2026 ఇతివృత్తంగా "రాకెట్ పైకి ఎత్తండి (రైజ్ ఏ రాకెట్)" అనే అంశాన్ని తీసుకున్నారు. షటిల్ కాక్, రాకెట్‌లే ప్రధాన క్రీడా వస్తువులుగా బ్యాడ్మింటన్ ఆట మనందరికీ చిరపరిచితమే.

భారతంలో బ్యాడ్మింటన్ క్రీడ:

భారతంలో బ్యాడ్మింటన్ క్రీడకు బహుళ ఆదరణ లభించడంతో పాటు ఎందరో క్రీడాకారులు జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో రాణించడం అభినందనీయం. బ్రిటీష్ ప్రజలు తొలిసారి 1867లో బ్యాడ్మింటన్ క్రీడకు నియమనిబంధనలు రూపొందించారు. బ్యాడ్మింటన్ క్రీడల్లో పురుషులకు ధీటుగా మహిళలు కూడా పాల్గొనడం శుభ పరిణామం. 1934లో బ్యాడ్మింటన్ అసోసియేషన్ ఆఫ్ ఇండియా ఏర్పడిన తర్వాత 1936లో ప్రతి ఏటా స్థానికం నుంచి జాతీయ అంతర్జాతీయ స్థాయి వరకు పోటీలను నిర్వహించడం జరుగుతోంది. భారత్‌లో ప్రపంచ ప్రఖ్యాత బ్యాడ్మింటన్ క్రీడాకారులు ప్రకాశ్ పడుకొనే, శ్రీకాంత్ కిదంబి, సైనా నెహవాల్, పుల్లెల గోపీచంద్, పి వి సింధు, లక్ష్య సేన్ లాంటి వారు ముందు వరుసలో ఉన్నారు.

బ్యాడ్మింటన్ క్రీడకు చైనా, డెన్మార్క్, ఇండోనేసియా, మలేషియా, భారత్, దక్షిణ కొరియా, తైవాన్, జపాన్ లాంటి దేశాల్లో మంచి ఆదరణ కనిపిస్తోంది. బ్యాడ్మింటన్ క్రీడకు చైనా చిరునామాగా నిలవడం చూస్తున్నాం. ప్రపంచ స్థాయిలో అత్యంత ప్రజాదరణ పొందిన బ్యాడ్మింటన్ క్రీడను ఆడుదాం, పోటీల్లో పాల్గొందాం, ఆరోగ్యాన్ని పొందుదాం.

డాక్టర్ : బుర్ర మధుసూదన్ రెడ్డి

## కరింనగర పురవీధుల్లో జగన్నాథ రథయాత్రను విజయవంతం చేద్దాం - బండి సంజయ్, కేంద్ర హోం శాఖ సహాయ మంత్రి

**తిమ్మాపూర్** జూలై 16, 2026 గురువారం రోజు మధ్యాహ్నం మహాలక్ష్మి దేవాలయ ప్రాంగణం నుంచి ప్రారంభమయ్యే శ్రీ జగన్నాథ రథయాత్ర కార్యక్రమంలో అశేష భక్తకోటి పాల్గొని రథాన్ని లాగుతూ మోక్షమా పొందాలని కేంద్ర హోంశాఖ సహాయమంత్రి బండి సంజయ్ పిలుపునిచ్చారు. ఈ రోజు ఇస్కాన్ నరహరి ప్రభు జీ నాయకత్వంలో శ్రీ జగన్నాథ రథయాత్ర ఉత్సవ కమిటీ నిర్వహించిన గోడ పత్రిక ఆవిష్కరణ మహోత్సవంలో పాల్గొని వాల్ పోస్టర్లను ఆవిష్కరించి మాట్లాడుతూ జగన్నాథ, బలభద్ర, సుభద్ర తోబుట్టువులు రథంపై కొలువైన పుణ్య యాత్రలో మహాశక్తి దేవాలయం నుంచి మంకమ్మ తోట, తెలంగాణ చౌక్, బస్టాండ్, టవర్ సర్కిల్ గుండా వైశ్య భవన్ వరకు జరుగుతుందని తెలియజేశారు. ఈ రథయాత్రకు కావలసిన ఏర్పాట్లను చేయాల్సిందిగా భక్తులను కోరారు. జగన్నాథుడి రథాన్ని లాగే అవకాశం కరినగరం హిందూ బంధువుకు దక్కడం మహా భాగ్యమని అన్నారు.





కరినగరంలో ఐదోసారి ప్రతిష్ఠాత్మకంగా నిర్వహిస్తున్న జగన్నాథ రథయాత్రలో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని తమ భక్తిని చాటుకోవాలని, రథం లాగామని అదృష్టాన్ని చేజిక్కించుకోవాలని నరహరి ప్రభు జీ అన్నారు. జగన్నాథ రథయాత్ర ఉత్సవ కమిటీ పక్షాన కన్న కృష్ణ జరుగుతున్న ఏర్పాట్లను బండి సంజయ్‌కి వివరించారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్లు బండి రమణారెడ్డి, ఉత్సవ కమిటీ అధ్యక్షులు కన్న కృష్ణతో పాటు కమిటీ సభ్యులు డాక్టర్ ఎల్ రాజభాస్కర్ రెడ్డి, తుమ్మల రమేష్ రెడ్డి, బుర్ర మధుసూదన్ రెడ్డి, కొమురవెల్లి వెంకటేశం పాల్గొన్నారు

## కేంద్ర మంత్రి బండి సంజయ్, ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనారాయణ పై వివాదాస్పద వ్యాఖ్యలు చేసిన తెలంగాణ శ్యామ్'

**ఎల్ ఎం డి పోలీసులకు ఫిర్యాదు చేసిన సర్పంచ్ సొల్లు అజయ్ వర్మ**



**తిమ్మాపూర్** మండలం కొత్తపల్లి గ్రామంలో శాంతిభద్రతలకు విఘాతం కలిగించేలా రెచ్చగొట్టే వ్యాఖ్యలు చేశారనే ఆరోపణలతో పగిడిపల్లి శ్యామ్ (తెలంగాణ శ్యామ్)పై ఎల్ఎండీ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు నమోదైంది. ఈ మేరకు శనివారం రోజున గునుకుల కొండపూర్ సర్పంచ్, బిజెపి రాష్ట్ర నాయకులు సొల్లు అజయ్ వర్మ , నాయకులు బొంతల కళ్యాణ్ చంద్ర, గాజె రమేష్, చింతం శ్రీనివాస్ , సుగుర్తి జగదీశ్వర చారి, ,గడ్డం అరుణ్ , బూట్ల శ్రీనివాస్ లతో కలిసి లిఖితపూర్వకంగా పోలీస్ స్టేషన్లో ఫిర్యాదు చేశారు. ఫిర్యాదు వివరాల్లోకి వెళితే... గత జూన్ 20న కొత్తపల్లి గ్రామంలో ఎల్లమ్మ బోనాల సందర్భంగా రెండు వర్గాల మధ్య చిన్నపాటి వివాదం జరిగింది. ఈ వివాదానికి ఎటువంటి సంబంధం లేని కేంద్ర హోం శాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమార్, స్థానిక ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనారాయణపై పగిడిపల్లి శ్యామ్ అలియాస్ తెలంగాణ శ్యామ్ బాధ్యతారహితంగా, రెచ్చగొట్టేలా మాట్లాడారని అజయ్ వర్మ ఫిర్యాదులో పేర్కొన్నారు. జూలై 2వ తేదీన ఒక యూట్యూబ్ న్యూస్ ఛానల్ (జి.8 )లో తెలంగాణ శ్యామ్ మాట్లాడుతూ కేంద్రమంత్రి , ఎమ్మెల్యే "గ్రామానికి వస్తే చెప్పులతో కొట్టండి" అంటూ ప్రజలను రెచ్చగొట్టేలా , ప్రేరేపించేలా వ్యాఖ్యానించారని ఫిర్యాదులో పేర్కొన్నారు. ఈ రకమైన వ్యాఖ్యలు గ్రామంలో శాంతిభద్రతలకు విఘాతం కలిగించడమే కాకుండా, ప్రజాస్వామ్య విలువలను, ప్రజా ప్రతినిధులను అవమానించేలా ఉన్నాయని ఫిర్యాదుదారుడు సొల్లు అజయ్ వర్మ ఆందోళన వ్యక్తం చేశారు. ఈ ఘటనకు సంబంధించిన వీడియో ఆధారాలను సిడి పోలీసులకు సమర్పించారు. ఈ విషయాన్ని పరిశీలించి, తక్షణం తెలంగాణ శ్యామ్ పై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని సర్పంచ్ అజయ్ వర్మ కోరారు.

## గూడూరు ప్రభుత్వ ఆసుపత్రిలో ఘనంగా డాక్టర్ల దినోత్సవం






**నెల్లూరు** అంతర్జాతీయ డాక్టర్ల దినోత్సవాన్ని పురస్కరించుకుని, గూడూరు ఏరియా ప్రభుత్వ ఆసుపత్రిలో శనివారం ఉదయం వేడుకలు ఘనంగా జరిగాయి. ప్రగతి సేవా సంస్థ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో వైద్య వృత్తిలో విశేష సేవలందిస్తున్న ఐదుగురు వైద్యులను ఘనంగా సన్మానించారు. ?ఆసుపత్రి ఇంచార్జ్ సూపరింటెండెంట్ డాక్టర్ ఎన్. వెంకటాచలపతి పర్యవేక్షణలో జరిగిన ఈ కార్యక్రమంలో డాక్టర్ ఎన్. వెంకటాచలపతి, డాక్టర్ యశ్వంత్ కుమార్ రాజు, డాక్టర్ పి. వెంకట కిషోర్, డాక్టర్ ఆర్. చరిష్మా, డాక్టర్ ఎం. విజయ్ కుమార్ లకు శాలువాలు కప్పి, షీల్డ్‌లతో సత్కరించారు.

వైద్యులే దేవుళ్లు: కడివేటి చంద్రశేఖర్ ఈ సందర్భంగా ప్రగతి సేవా సంస్థ అధ్యక్షులు కడివేటి చంద్రశేఖర్ మాట్లాడుతూ.. "కరోనా వంటి విపత్కర పరిస్థితుల్లో ప్రాణాలకు తెగించి రోగులకు సేవలందించిన వైద్యులను సన్మానించుకోవడం తమ సంస్థకు దక్కిన గౌరవంగా భావిస్తున్నాము" అని పేర్కొన్నారు. శ్రీకృష్ణ సేవా సమితి అధ్యక్షులు మయూరి శ్యామ్ మాట్లాడుతూ.. సమాజంలో వైద్యులు దేవుడితో సమానమని, ప్రాణదాతలుగా వారు చేస్తున్న సేవలు అమోఘమని కొనియాడారు. ?సన్మానం అందుకున్న వైద్యులు మాట్లాడుతూ, తమకు దక్కిన గౌరవం బాధ్యతను మరింత పెంచిందని, భవిష్యత్తులో ప్రజలకు మరింత మెరుగైన వైద్య సేవలు అందిస్తామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో ఏరియా ప్రభుత్వ ఆసుపత్రి సిబ్బంది, ప్రగతి సేవా సంస్థ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

## ఉపాధ్యాయుల సమస్యలను వెంటనే పరిష్కరించాలి తపస్

**చేగుంట జులై 4**

తెలంగాణ ప్రాంత ఉపాధ్యాయ సంఘం రాష్ట్ర శాఖ పిలుపుమేరకు తపస్ చేగుంట మండల అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు రావుల వెంకటేష్, తంగెళ్లపల్లి కృష్ణమూర్తి ఆధ్వర్యంలో భోజన విరామ సమయంలో ఉపాధ్యాయ సమస్యల పరిష్కారం కొరకు చేగుంట తాసిల్దార్ కి వినతి పత్రం సమర్పించడం జరిగింది. ఈ సందర్భంగా తపస్ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు చల్లా లక్ష్మణ్ ,మండల అధ్యక్షుడు రావుల వెంకటేష్ మాట్లాడుతూ పెండింగ్ లో ఉన్న డి ఏ లను విడుదల చేయాలని ,పిఆర్సి రిపోర్టు తెప్పించుకొని వెంటనే అమలు చేయాలని, సిపిఎస్ రద్దు చేసి ఓపిఎస్ అమలు చేయాలి అని, సమగ్ర శిక్ష అభియాన్ ఉద్యోగుల సమ్మె కాలపు ఒక నెల వేతనాన్ని వెంటనే విడుదల చేయాలని, పెండింగ్ నిధులను వెంటనే విడుదల చేయాలని, మోడల్ స్కూల్ ఉపాధ్యాయులకు 0 1 0 పద్దు కింద వేతనాలు విడుదల చేయాలి అని,జీఓ 317 నష్టపోయిన బాధితులకు న్యాయం చేయాలని, గురుకుల, కేజీబీవీ ఉపాధ్యాయ సమస్యలు పరిష్కరించాలని, ప్రతి సంవత్సరం పదోన్నతులు చేపట్టాలని వారు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో తపస్ జిల్లా మహిళా ఉపాధ్యక్షురాలు బాలిశెట్టి రేఖ, కార్యవర్గ సభ్యులు పట్లూరి యాదగిరి, దేశపతి కృష్ణమూర్తి,సుమతి, , మండల ఉపాధ్యక్షులు మధునాల శ్రీనివాస్ మండల కోశాధికారి శ్రీనివాస్, కాంప్లెక్స్ కన్వీనర్ చరణ్ దాస్,




కాంప్లెక్స్ కో కన్వీనర్ విజయలత మండల సభ్యులు బక్కప్ప, సరస్వతి, సంధ్యారాణి, సంగీత, మౌనిక,ప్రభాకర్ రెడ్డి శివకుమార్, ఉమాదేవి ఉపాధ్యాయులు రఘుపతి, రమాదేవి, శారద, రమ, ఉమామహేశ్వరి, కరుణ, సునీత, సునీత హెలెన్,వినోద, నరసింహ చారి, కిషన్, నాగరాజు,మౌనిక, సుమలత, ఊర్మిళ, సి అర్ పి రమేష్ తదితరులు పాల్గొన్నారు

## ఘనంగా మాజీ చైర్మన్ తుమ్మల పాండురంగారెడ్డి జన్మదిన వేడుకలు: కేక్ కట్ చేయించి శుభాకాంక్షలు తెలిపిన బిఆర్ఎస్ సీనియర్ నాయకులు ఐలాపూర్ నర్సింగ్ రావు





**అమీన్‌పూర్, జూలై 04:**

అమీన్‌పూర్ మున్సిపల్ మాజీ చైర్మన్ తుమ్మల పాండురంగారెడ్డి జన్మదిన వేడుకలు శనివారం ఆయన నివాసంలో అత్యంత వైభవంగా జరిగాయి. ఈ వేడుకలకు బిఆర్ఎస్ సీనియర్ నాయకులు ఐలాపూర్ నర్సింగ్ రావు తన బృందంతో కలిసి హాజరయ్యారు.ఈ సందర్భంగా మాజీ చైర్మన్ పాండురంగారెడ్డి చేత నర్సింగ్ రావు ప్రత్యేకంగా కేక్ కట్ చేయించారు. అనంతరం ఆయనకు పుష్పగుచ్ఛాలు అందజేసి, శాలువాతో సత్కరించి జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు.ఈ సందర్భంగా ఐలాపూర్ నర్సింగ్ రావు మాట్లాడుతూ... "అమీన్‌పూర్ అభివృద్ధిలో మాజీ చైర్మన్ తుమ్మల పాండురంగారెడ్డి గారు కీలక పాత్ర పోషించారు. ప్రజా సమస్యల పరిష్కారంలో ఆయన చూపిన చొరవ అభినందనీయం. ఆయన మరిన్ని పుట్టినరోజులు జరుపుకుంటూ, ప్రజలకు ఇలాగే నిరంతరం సేవలందించాలని మనస్ఫూర్తిగా కోరుకుంటున్నాను," అని పేర్కొన్నారు.అమీన్‌పూర్ ప్రాంత ప్రజలు మరియు పలువురు ప్రముఖులు కూడా ఈ వేడుకల్లో పాల్గొని మాజీ చైర్మన్‌కు తమ శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో మాజీ కౌన్సిలర్ బిజిలి రాజు, కొల్లూరి గోపాల్, ఐలాపుర్ నర్సింగ్ రావు బృంద సభ్యులు మల్లేష్,జీవన్, పాండు , జైవర్ధన్ , దస్తగిరి ఆనంద్, మరియు స్థానిక నాయకులు పాల్గొన్నారు.

## ఘనంగా మాజీ చైర్మన్ తుమ్మల పాండురంగ రెడ్డి జన్మదిన వేడుకలు.. వెల్లువెత్తిన అభిమానుల శుభాకాంక్షలు!







**అమీన్‌పూర్, జూలై 04:**

అమీన్‌పూర్ మున్సిపల్ మాజీ చైర్మన్, ప్రజా నాయకులు తుమ్మల పాండురంగ రెడ్డి జన్మదిన వేడుకలు శనివారం అమీన్‌పూర్‌లో అత్యంత వైభవంగా జరిగాయి. వేలాది మంది అభిమానులు, కార్యకర్తల కోలాహలం మధ్య ఆయన తన పుట్టినరోజు వేడుకలను జరుపుకున్నారు.పాండురంగ రెడ్డి గారి నివాసం వద్దకు తరలివచ్చిన అభిమానులు, టి.పి.ఆర్ యువసేన సభ్యులు, స్థానిక యువకులు ఆయనకు ఘనంగా జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో అమీన్‌పూర్ మున్సిపల్ మాజీ కౌన్సిలర్లు, బి.ఆర్.ఎస్ పార్టీ సీనియర్ నాయకులు పెద్ద సంఖ్యలో పాల్గొని ఆయనకు కేక్ తినిపించి, శాలువాలతో సత్కరించారు.ఈ సందర్భంగా టి.పి.ఆర్ యువసేన సభ్యులు మరియు బి.ఆర్.ఎస్ నాయకులు మాట్లాడుతూ.. "అమీన్‌పూర్ అభివృద్ధిలో పాండురంగ రెడ్డి గారు తనదైన ముద్ర వేశారు. నిత్యం పేదల మధ్య ఉంటూ, వారి సమస్యల పరిష్కారమే లక్ష్యంగా పనిచేసే మనసున్న మహారాజు మా పాండురంగారెడ్డి అన్న. నిస్వార్థంగా ప్రజాసేవ చేస్తున్న ఆయన నిండు నూరేళ్ల ఆయురారోగ్యాలతో, మరిన్ని ఉన్నత పదవులను అధిరోహిస్తూ ఇలాంటి పుట్టినరోజు వేడుకలు మరెన్నో జరుపుకోవాలని మనస్ఫూర్తిగా కోరుకుంటున్నాం" అని తెలిపారు.వేలాది మంది అభిమానుల మధ్య జరిగిన ఈ వేడుకలు స్థానికంగా చర్చనీయాంశంగా మారాయి. ఈ కార్యక్రమంలో మున్సిపల్ మాజీ కౌన్సిలర్లు, కృష్ణ, బిజిలి రాజు, మాది కోఆప్షన్ నెంబర్ యూనుస్, బి ఆర్ ఎస్ పార్టీ సీనియర్ నాయకులు ఉపేందర్ రెడ్డి, కొల్లూరు గోపాల్, కొల్లూరు యాదగిరి, తుమ్మల ప్రభాకర్ రెడ్డి, శ్రీనివాస్ రెడ్డి,తుమ్మల ప్రతాప్ రెడ్డి, జగదీష్, మహిపాల్ రెడ్డి, ఆంజనేయులు, కొండకళ శ్రీనివాస్, శ్రీనివాస్ రెడ్డి,మహేందర్ రెడ్డి, నల మధుసూదన్ రెడ్డి, యాదగిరి, యువ నాయకులు తుమ్మల రుశ్వంత్ రెడ్డి, బోయిని సందీప్, టి పి ఆర్ యువసేన సభ్యులు ప్రసాద్, అనిల్,నరేష్,బన్నీ, చింటూ, రఘువీర్, హేమంత్, నాగరాజు, నరేందర్, ప్రజాప్రతినిధులు మరియు పెద్ద సంఖ్యలో ప్రజలు పాల్గొన్నారు.

## నిరుపేద కుటుంబానికి ఆర్థిక సహాయం చేసిన చందాయిపేట మాజీ సర్పంచ్




**చేగుంట జూలై 4**

చేగుంట మండలం,పెద్దశివనూర్ గ్రామంలో ఇటీవల ఎర్ర నరసింహులు మరణించిన విషయం తెలుసుకుని వారి కుటుంబాన్ని పరామర్శించి ఎర్ర నరసింహులు దశదినకర్మకు చందాయిపేట గ్రామమాజీ సర్పంచ్ బుడ్డ స్వర్ణలత భాగ్యరాజ్ 50 కేజీల బియ్యం అందించారు. ఈ కార్యక్రమంలోమార్కెట్ కమిటీ డైరెక్టర్ అన్నం ఆంజనేయులు,కాంగ్రెస్ పార్టీ నాయకులు వడియారం ఎల్లం ఎర్ర బాలు తలారి స్వామి కుటుంబ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

## బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు నారాయణ రెడ్డి సతీమణి అంత్యక్రియల్లో పాల్గొన్న ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్ రెడ్డి





**చేగుంట, జూలై 04**

చేగుంట మండల బీఆర్ఎస్ పార్టీ అధ్యక్షుడు నారాయణ రెడ్డి సతీమణి శ్రీమతి మంజుల అకాల మరణం చెందడం అత్యంత బాధాకరమని దుబ్బాక శాసనసభ్యులు కొత్త ప్రభాకర్ రెడ్డి పేర్కొన్నారు. కొంతకాలంగా తీవ్ర అనారోగ్యంతో బాధపడుతున్న శ్రీమతి మంజుల హైదరాబాద్‌లోని నిమ్స్ ఆసుపత్రిలో చికిత్స పొందుతూ శుక్రవారం రాత్రి కన్నుమూశారు. శనివారం మండల పరిధిలోని ఇబ్రహీంపూర్‌లో నిర్వహించిన ఆమె అంత్యక్రియల్లో ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్ రెడ్డి స్వయంగా పాల్గొని, మంజుల భౌతికకాయానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. అనంతరం తీవ్ర శోకసంద్రంలో ఉన్న నారాయణ రెడ్డిని, వారి కుటుంబ సభ్యులను ఓదార్చి పరామర్శించారు. ఈ కష్టసమయంలో కుటుంబానికి దేవుడు మనోధైర్యాన్ని ప్రసాదించాలని కోరుతూ తన ప్రగాఢ సానుభూతిని వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో మండల ప్రజాప్రతినిధులు, బీఆర్ఎస్ పార్టీ ముఖ్య నాయకులు, కార్యకర్తలు, గ్రామస్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## హరీష్ రావు, మహిపాల్ రెడ్డిలను కలిసిన తుమ్మల పాండురంగారెడ్డి

**అమీన్‌పూర్, జూలై 04:** అమీన్‌పూర్ మున్సిపల్ మాజీ చైర్మన్ తుమ్మల పాండురంగారెడ్డి జన్మదినాన్ని





పురస్కరించుకుని, శనివారం ఆయన మాజీ మంత్రి, సిద్దిపేట ఎమ్మెల్యే తన్నీరు హరీష్ రావు మరియు పటాన్‌చెరు ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డిలను మర్యాదపూర్వకంగా కలిశారు.ఈ సందర్భంగా హరీష్ రావు, మహిపాల్ రెడ్డి పాండురంగారెడ్డిని శాలువాతో సత్కరించి, పుష్పగుచ్ఛం అందించి జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. పాండురంగారెడ్డి ఆయురారోగ్యాలతో, సుఖసంతోషాలతో నిండు నూరేళ్లు వర్ధిల్లాలని వారు ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో బిఆర్ఎస్ సీనియర్ నాయకులు దశరథ్ రెడ్డి, కొల్లూరి చంద్రకళ గోపాల్, ఐలాపూర్ నర్సింగ్ రావు తదితరులు పాల్గొని శుభాకాంక్షలు తెలియజేశారు.

## తుమ్మల వెంకటేశ్వర్ రెడ్డి, తుమ్మల చంద్రశేఖర్ రెడ్డి ఆధ్వర్యంలో అమీన్‌పూర్ మున్సిపల్ చైర్మన్ తుమ్మల పాండురంగ రెడ్డి జన్మదిన వేడుకలు

**- ఘనంగా పుట్టినరోజు శుభాకాంక్షలు తెలిపిన తుమ్మల సోదరులు**

**- ఆయురారోగ్యాలతో ప్రజాసేవలో ముందడుగు వేయాలని ఆకాంక్ష**





**అమీన్‌పూర్, జూలై: 04**

అమీన్‌పూర్ మున్సిపల్ చైర్మన్ తుమ్మల పాండురంగ రెడ్డి జన్మదినాన్ని పురస్కరించుకొని ఆయనకు శుభాకాంక్షలు వెల్లువెత్తాయి. ఈ సందర్భంగా తుమ్మల వెంకటేశ్వర్ రెడ్డి, తుమ్మల చంద్రశేఖర్ రెడ్డి ఆయనను మర్యాదపూర్వకంగా కలిసి జన్మదిన శుభాకాంక్షలు తెలియజేశారు. పాండురంగ రెడ్డికి పూలమాల వేసి, శాలువాతో ఘనంగా సత్కరించి తమ అభిమానాన్ని చాటుకున్నారు.ప్రజాసేవలో మరిన్ని విజయాలు సాధించాలి: వెంకటేశ్వర్ రెడ్డి, చంద్రశేఖర్ రెడ్డిఈ సందర్భంగా తుమ్మల వెంకటేశ్వర్ రెడ్డి, తుమ్మల చంద్రశేఖర్ రెడ్డి మాట్లాడుతూ... అమీన్‌పూర్ మున్సిపాలిటీ అభివృద్ధిలో చైర్మన్ తుమ్మల పాండురంగ రెడ్డి పోషిస్తున్న పాత్ర అభినందనీయమని కొనియాడారు. నిరంతరం ప్రజలకు అందుబాటులో ఉంటూ, నియోజకవర్గ సంక్షేమమే ధ్యేయంగా ఆయన ముందుకు సాగుతున్నారని పేర్కొన్నారు.మున్సిపల్ చైర్మన్ తుమ్మల పాండురంగ రెడ్డి గారు నిండు నూరేళ్లు ఆయురారోగ్యాలతో, అష్టైశ్వర్యాలతో వర్ధిల్లాలని భగవంతుడిని ప్రార్థిస్తున్నాం. భవిష్యత్తులో వారు మరిన్ని ఉన్నత పదవులు అధిరోహించి, ప్రజలకు మరింత సేవ చేయాలని మనస్ఫూర్తిగా ఆకాంక్షిస్తున్నాం.ఈ వేడుకల్లో పలువురు స్థానిక నాయకులు, ఉపేందర్ రెడ్డి, కొల్లూరి యాదగిరి, శీను,కార్యకర్తలు, అభిమానులు పాల్గొని చైర్మన్‌కు పెద్ద ఎత్తున జన్మదిన శుభాకాంక్షలు తెలియజేశారు.

# అంతర్జాతీయ క్రికెట్‌లోకి వైభవ్ అరంగేట్రం

ప్రపంచ క్రికెట్ అభిమానులు ఎప్పుడెప్పుడా అని ఎదురుచూస్తున్న క్షణం రానే వచ్చింది. ఐపీఎల్‌తో పాటు, ఇండియా ఏ తరఫున సత్తాచాటిన 15 ఏళ్ల వైభవ్ సూర్యవంశీ .. టీమిండియా తరఫున అరంగేట్రం చేశాడు. ఇంగ్లాండ్‌తో జరుగుతున్న రెండో టీ20 మ్యాచ్‌లో అతడు టీమిండియా క్యాప్ అందుకున్నాడు. తిలక్ వర్మ చేతుల మీదుగా వైభవ్ సూర్యవంశీ భారత జట్టు క్యాప్ అందుకున్నాడు. ఇక ఈ మ్యాచ్‌లో టాస్ గెలిచిన భారత్.. తొలుత బ్యాటింగ్ ఎంచుకుంది. వైభవ్ సూర్యవంశీ 15 ఏళ్ల 99 రోజుల వయసులో టీమిండియా తరఫున అరంగేట్రం చేశాడు. దీంతో భారత్ తరఫున డెబ్యూ చేసిన అతి పిన్న వయస్కుడిగా ఈ బుడ్డోడు రికార్డు క్రియేట్ చేశాడు. ఇక మ్యాచ్ విషయానికి వస్తే.. తొలి మ్యాచ్ వర్షం కారణంగా రద్దు అయింది. దీంతో ఇవాల్టి మ్యాచ్‌లో గెలిచి సిరీస్‌లో ఆధిక్యంలోకి వెళ్లాలని ఇరు జట్లూ భావిస్తున్నాయి. టాస్ గెలిచిన భారత కెప్టెన్ శ్రేయస్ అయ్యర్ బ్యాటింగ్ ఎంచుకున్నాడు. సంజూ శాంసన్ ప్లేసులో వైభవ్ తుది జట్టులోకి వచ్చాడు. దీంతో సంజూ బెంచ్‌కే పరిమితమయ్యాడు. కాగా ఐర్లాండ్‌తో టీ20 సిరీస్ సహా.. ఇంగ్లాండ్‌తో తొలి టీ20లో సంజూ శాంసన్ విఫలమయ్యాడు. దీంతో అతడిని తప్పించి.. వైభవ్ సూర్యవంశీని జట్టులోకి తీసుకోవాలని డిమాండ్‌లు వినిపించాయి. కానీ మేనేజ్‌మెంట్ మాత్రం సంజూపై విశ్వాసం ఉంచింది. కానీ రెండో టీ20లో మాత్రం చోటు కల్పించింది. దీంతో క్రికెట్ అభిమానులు ఎప్పుడెప్పుడా అని ఎదురుచూస్తున్న క్షణం రానే వచ్చింది. తుది జట్లు ఇవే:భారత్: వైభవ్ సూర్యవంశీ, అభిషేక్ శర్మ, ఇషాన్ కిషన్, శ్రేయస్ అయ్యర్, తిలక్ వర్మ, శివమ్ దూబె, అక్షర్ పటేల్, హర్షిత్ రాణా, రవి బిష్ణోయ్, అర్షదీప్ సింగ్, వరుణ్ చక్రవర్తి ఇంగ్లాండ్: ఫిల్ సాల్ట్, జాకబ్ బెథెల్, హ్యారీ బ్రూక్ (కెప్టెన్), టామ్ బాంటన్, విల్ జాక్స్, సామ్ కర్రన్, డాసన్, ఆదిల్ రషీద్, జోఫ్రా ఆర్చర్, జోష్ టంగ్



# కేప్ వెర్డేపై అర్జెంటీనా విజయం



## ● ఆగని మెస్సీ రికార్డుల మోత

ఫుట్‌బాల్ దిగ్గజం, అర్జెంటీనా కెప్టెన్ లియోనెల్ మెస్సీ రికార్డుల మోత మోగించాడు. అటు గోల్స్‌తో పాటు ఆడిన మ్యాచ్‌ల పరంగా సరికొత్త మైలురాళ్లను అందుకున్నాడు. రెండు వేర్వేరు ఫిఫా వరల్డ్ కప్ ఎడిషన్లలో ఏడు చొప్పున గోల్స్ సాధించిన తొలి ఫుట్‌బాలర్‌గా మెస్సీ నిలిచాడు. 2022 ఖతార్ వరల్డ్ కప్‌లో 7 గోల్స్ చేసిన మెస్సీ, ఇప్పుడు 2026 టోర్నమెంట్‌లో కూడా అదే జోరును ప్రదర్శిస్తున్నాడు. అలాగే, ఫిఫా టోర్నమెంట్‌లో అత్యధిక మ్యాచ్‌లు ఆడిన ఆటగాడిగా నిలిచాడు. శనివారం అర్జెంటీనాతో ఆఫ్రికన్ దేశం కేప్ వెర్డే జట్టు తలపడింది. ఈ మ్యాచ్‌లో ఆడటం ద్వారా మెస్సీ ఈ ఫీట్‌ను సాధించాడు. ప్రపంచకప్‌లో అతనికి ఇది 30వ మ్యాచ్. ఫిఫా వరల్డ్ కప్ చరిత్రలో వరుసగా ఎనిమిది మ్యాచ్‌లలో గోల్స్ చేసిన మొదటి ఆటగాడిగా మెస్సీ మరో చరిత్ర సృష్టించాడు. 29వ నిమిషంలో మెస్సీ చేసిన గోల్‌తో ఈ అరుదైన ఫీట్‌ను అందుకున్నాడు. ఈ తాజా గోల్‌తో ఫిఫా వరల్డ్ కప్ చరిత్రలో మెస్సీ ఖాతాలో మొత్తం 20 గోల్స్ చేరాయి. 2022లో ఖతార్ వేదికగా జరిగిన ప్రపంచకప్‌లో అర్జెంటీనాను విజేతగా నిలిపిన మెస్సీ, వరుసగా రెండోసారి ప్రపంచ టైటిల్‌ను కైవసం చేసుకునే దిశగా జట్టును ముందుండి నడిపిస్తున్నాడు. ప్రస్తుత టోర్నమెంట్‌లోనూ తన అసాధారణమైన విజన్, అనుభవం, గోల్స్ చేసే నైపుణ్యంతో అర్జెంటీనాను నాకౌట్ దశకు చేర్చాడు. ఈ ప్రపంచకప్ 'గోల్డెన్ బూట్' రేసులో అగ్రస్థానంలో కొనసాగుతున్నాడు. ఈ మ్యాచ్ కేవలం లియోనెల్ మెస్సీకి మాత్రమే కాకుండా, అర్జెంటీనా కోచ్ లియోనెల్ స్కలోనీకి కూడా అత్యంత ప్రత్యేకమైనది. 2018లో అర్జెంటీనా జాతీయ జట్టు మేనేజర్‌గా బాధ్యతలు స్వీకరించిన స్కలోనీ, కోచ్‌గా 100వ అంతర్జాతీయ మ్యాచ్ మైలురాయిని చేరుకున్నారు. స్కలోనీ మార్గదర్శకత్వంలోనే అర్జెంటీనా కోపా అమెరికా, ఫిఫా ప్రపంచకప్ వంటి ప్రతిష్టాత్మక టోర్నీలను గెలుచుకుంది. అర్జెంటీనా, కేప్ వర్డె మధ్య జరిగిన రౌండ్ ఆఫ్ 32 పోరు అత్యంత ఉత్కంఠభరితంగా సాగింది. మ్యాచ్ ప్రారంభం నుంచి అర్జెంటీనా ఆధిపత్యం ప్రదర్శించగా, మెస్సీ 29వ నిమిషంలో గోల్ కొట్టి జట్టును 1-0తో ఆధిక్యంలోకి తీసుకెళ్లారు. ఈ కీలక పోరులో కేప్ వెర్డే జట్టుపై అర్జెంటీనా 3-2 తేడాతో విజయం సాధించింది. దీంతో ఫిఫా ప్రపంచ కప్ రౌండ్ ఆఫ్ 16కు దూసుకెళ్లింది. ఈ రౌండ్ ఆఫ్ 32 నాకౌట్ మ్యాచ్‌లో గెలిచిన జట్టు నేరుగా 'రౌండ్ ఆఫ్ 16' (ప్రీ-క్వార్టర్స్) దశకు అర్హత సాధిస్తుంది. డల్లాస్‌లో జరిగిన మరో ఉత్కంఠభరిత నాకౌట్ పోరులో ఆస్ట్రేలియా జట్టును పెనాల్టీ షూటౌట్‌లో ఓడించి ఆఫ్రికన్ దిగ్గజం ఈజిప్ట్ ఇప్పటికే రౌండ్ ఆఫ్ 16కు చేరుకుంది. కాబట్టి ఈ మ్యాచ్‌లో గెలిచిన అర్జెంటీనా జట్టు తదుపరి రౌండ్‌లో క్వార్టర్ ఫైనల్ బెర్తు కోసం ఈజిప్ట్‌తో తలపడాల్సి ఉంటుంది.

# శివమ్ దూబేను ఎదుర్కోవడం ఇంగ్లాండ్‌కు పెద్ద సవాలే

భారత్, ఇంగ్లాండ్ జట్ల మధ్య జరుగుతున్న టీ20 సమరం క్రికెట్ అభిమానుల్లో తీవ్ర ఉత్కంఠను రేపుతోంది. తొలి మ్యాచ్‌లో వర్షం పడటంతో ఫలితం తేలకపోయినప్పటికీ, టీం ఇండియా హిట్టర్ శివమ్ దూబే ఆడిన మెరుపు ఇన్నింగ్స్ ఇంగ్లాండ్ శిబిరంలో వణుకు పుట్టించింది. ఈ నేపథ్యంలో రెండో టీ20కి ముందు ఇంగ్లాండ్ కెప్టెన్ హ్యారీ బ్రూక్ చేసిన వ్యాఖ్యలు ఇప్పుడు హాట్ టాపిక్‌గా మారాయి.సెస్టర్లీ స్ట్రీట్ వేదికగా జరిగిన తొలి టీ20 మ్యాచ్‌లో టాస్ గెలిచిన భారత్ ప్రారంభంలోనే ఆరు పరుగులకే రెండు వికెట్లు కోల్పోయి కష్టాల్లో పడింది. ఆ సమయంలో అభిషేక్ శర్మ, కెప్టెన్ శ్రేయస్ అయ్యర్ ఇన్నింగ్స్‌ను చక్కదిద్దారు. అయితే, ఆ తర్వాత క్రీజులోకి వచ్చిన ఆల్‌రౌండర్ శివమ్ దూబే ఇంగ్లాండ్ బౌలర్లపై నిర్దాక్షిణ్యంగా విరుచుకుపడ్డాడు. కేవలం 21 బంతుల్లోనే 2 ఫోర్లు, 3 అద్భుతమైన సిక్సర్లతో 42 పరుగులు చేసి నాటౌట్‌గా నిలిచాడు. దూబే మెరుపు దాడి వల్లే భారత్ నిర్ణీత ఓవర్లలో 189 పరుగుల భారీ స్కోరు సాధించగలిగింది. పిచ్ పరిస్థితులను బట్టి చూస్తే అంతటి భారీ లక్ష్యాన్ని ఛేదించడం ఇంగ్లాండ్‌కు అసాధ్యమని, కేవలం వర్షం వల్ల మ్యాచ్ రద్దు కావడంతోనే ఇంగ్లాండ్ ఓటమి నుంచి తప్పించుకుందని క్రికెట్



విశ్లేషకులు స్పష్టం చేస్తున్నారు. దూబేకు స్పిన్ బౌలింగ్‌ను చీల్చి చెండాడటంలో అద్భుతమైన రికార్డు ఉంది. ఐపీఎల్‌తో పాటు అంతర్జాతీయ క్రికెట్‌లోనూ అతను స్పిన్నర్లపై విరుచుకుపడతాడు. ఈ విషయం తెలిసి కూడా తొలి మ్యాచ్‌లో చివరి ఓవర్లలో ఇంగ్లాండ్ కెప్టెన్ హ్యారీ బ్రూక్ స్పిన్నర్లను రంగంలోకి దించి పెద్ద తప్పే చేశాడు. దూబే ఆ స్పిన్ బౌలింగ్‌ను ఉతికారేస్తూ సిక్సర్ల వర్షం కురిపించాడు. ఈ వ్యూహాత్మక లోపాన్ని ఇంగ్లాండ్ కెప్టెన్ స్వయంగా అంగీకరించక తప్పలేదు. రెండో టీ20 మ్యాచ్ ప్రారంభానికి ముందు ప్రెస్ కాన్ఫరెన్స్‌లో హ్యారీ బ్రూక్ ఆసక్తికర వ్యాఖ్యలు చేశాడు. టీం ఇండియా టాప్ ఆర్డర్ బ్యాటర్ల కంటే కూడా శివమ్ దూబేపైనే తాము ఎక్కువ దృష్టి పెట్టాల్సి ఉందన్నాడు. "తొలి మ్యాచ్‌లో దూబేను తక్కువ అంచనా వేసి తప్పు చేశాం, మా వ్యూహం బెడసికొట్టింది. అతని వల్లే మా ముందు భారీ లక్ష్యం నిలిచింది. కానీ, రెండో టీ20లో ఆ తప్పును పునరావృతం చేయం. దూబేను కట్టడి చేయడానికి ప్రత్యేక వ్యూహాలు రచిస్తున్నాం" అని బ్రూక్ తెలిపాడు. అలాగే తమ బౌలింగ్ విభాగంలో కూడా రెండు కీలక మార్పులు చేస్తున్నట్లు స్పష్టం చేశాడు.



# వాళ్లిద్దరి కెరీర్ త్వరగా ముగుస్తుంది!

## ● లెజెండరీ కెప్టెన్ కపిల్ దేవ్

ప్రస్తుతం టీమిండియా ఇంగ్లాండ్‌తో టీ20 సిరీస్‌తో బిజీగా ఉంది. ఐర్లాండ్‌పై రెండు టీ20ల సిరీస్ ఓడిపోయిన తర్వాత.. పటిష్టమైన ఇంగ్లాండ్‌పై గెలిచి పరువు నిలబెట్టుకోవాలని యంగ్ టీమిండియా తహతహలాడుతోంది. ఇప్పటికే తొలి టీ20 వర్షం కారణంగా రద్దు అయింది. ఇక ఈ రోజు (జూలై 4) రెండో టీ20 జరగనుంది. ఈ క్రమంలోనే టీమిండియా దిగ్గజ మాజీ క్రికెటర్, 1983 వరల్డ్ కప్ విన్నింగ్ కెప్టెన్ కపిల్ దేవ్ కీలక వ్యాఖ్యలు చేశారు. టీమిండియా స్టార్ క్రికెటర్లు విరాట్ కోహ్లీ, రోహిత్ శర్మ వయసు గురించి ఎవరు మాట్లాడాల్సిన అవసరం లేదని అన్నారు.వాళ్లిద్దరూ పరుగులు చేస్తున్నంత కాలం వారి వయసు గురించి చర్చ అనవసరం అని ఆయన అభిప్రాయపడ్డారు. అయితే కెరీర్ చివరి దశకు వచ్చిన తర్వాత వయసు రిత్యా వారి ఫిట్‌నెస్, ఫామ్ వేగంగా పడిపోతుందని పేర్కొన్నారు. అలా చూస్తే వారి కెరీర్ ఎక్కువ రోజులు కొనసాగే అవకాశం లేదని, దాని కోసం పెద్దగా చర్చ అవసరం లేదనే ఉద్దేశంతో కపిల్ దేవ్ మాట్లాడినట్లు తెలుస్తోంది. అయితే ప్రస్తుతం విరాట్ కోహ్లీ, రోహిత్ శర్మ 2027 వన్డే వరల్డ్ కప్ ఆడాలనే టార్గెట్‌తో ఉన్నారు. మరి అది ఎంత వరకు సాధ్యం అవుతోందో చూడాలి. ప్రస్తుతం అయితే ఈ నెల 14 నుంచి ఇంగ్లాండ్‌తో జరగబోయే వన్డే సిరీస్ కోసం వారిద్దరూ రెడీ అవుతున్నారు. ఇప్పటికే అలీబాగ్‌లో విరాట్ కోహ్లీ ప్రాక్టీస్ కూడా మొదలుపెట్టేశాడు. రోహిత్ కూడా ఈ సిరీస్ కోసం ఆసక్తిగా ఎదురుచూస్తున్నాడు. ఇద్దరికీ ఇంగ్లాండ్‌లో మంచి రికార్డులు ఉన్నాయి. పైగా వారికి ఉన్న అనుభవంతో ఇంగ్లాండ్‌తో వన్డే సిరీస్‌లో కచ్చితంగా రాణిస్తారని క్రికెట్ అభిమానులు ధీమా వ్యక్తం చేస్తున్నారు.

# వైభవ్ సూర్యవంశీని ఓదార్చిన సంజూ శాంసన్!



ఇంగ్లండ్ పర్యటనలో ఉన్న టీమిండియా..వర్షం కారణంగా రద్దయిన తొలి టీ20లో మోస్తారు ప్రదర్శన కనబర్చింది. ఐదు టీ20ల సిరీస్‌లో భాగంగా మరికొద్ది సేపట్లో మాంచెస్టర్ వేదికగా ప్రారంభమయ్యే రెండో టీ20లో బరిలోకి దిగనుంది. ఈ మ్యాచ్ కోసం టీమిండియా అన్ని విధాల సిద్ధమైంది. ముఖ్యంగా భారత బ్యాటర్లు నెట్స్‌లో ముమ్మర సాధన చేశారు. ఈ సిరీస్ నేపథ్యంలో టీమిండియా టీనేజ్ సెన్సేషన్ వైభవ్ సూర్యవంశీ ప్రత్యేక ఆకర్షణగా నిలిచాడు. ఈ 15 ఏళ్ల కుర్రాడు అంతర్జాతీయ అరంగేట్రం కోసం సిద్ధంగా ఉన్నాడు. అభిమానులు కూడా వైభవ్ అరంగేట్రం కోసం ఆసక్తిగా ఎదురుచూస్తున్నారు. అయితే, అతనికి తుది జట్టులో అవకాశం రావడానికి మరికొంత సమయం పడుతుందని హెడ్ కోచ్ గౌతమ్ గంభీర్ హింట్ ఇచ్చారు. ప్రాక్టీస్ సెషన్‌లో వయసులో చాలా చిన్నవాడైన వైభవ్ సూర్యవంశీని జట్టులోని సీనియర్ ఆటగాళ్లు ఎంతో గారాబంగా చూసుకుంటున్నారు. అయితే శనివారం ఉదయం జరిగిన నెట్ ప్రాక్టీస్ సెషన్‌లో ఒక ఆసక్తికరమైన ఘటన చోటుచేసుకుంది. టీమిండియా టాపార్డర్ బ్యాటర్లు అభిషేక్ శర్మ, ఇషాన్ కిషన్, సంజూ శాంసన్ నెట్స్‌లో సుదీర్ఘ సమయం పాటు బ్యాటింగ్ ప్రాక్టీస్ చేశారు. దాంతో వైభవ్ సూర్యవంశీకి బ్యాటింగ్ ప్రాక్టీస్ చేసేందుకు తగిన సమయం దొరకలేదు. ప్రాక్టీస్‌కు కూడా అవకాశం రాకపోవడంతో వైభవ్ సూర్యవంశీ తీవ్ర నిరాశకు గురయ్యాడు. నెట్స్ బయట ఒంటరిగా కూర్చొని విచారంగా కనిపించాడు. వైభవ్ నిరాశను గమనించిన సంజూ శాంసన్ వెంటనే అతని వద్దకు వెళ్లి ఓదార్చాడు. అతని భుజంపై చేయి వేసి ప్రేమగా మాట్లాడాడు. 'తమ్ముడూ.. అవకాశం రాలేదని బాధపడకు.. నీ సమయం కచ్చితంగా వస్తుంది. అప్పుడు నిన్ను ఎవరూ అడ్డుకోలేరు. ఎంతసేపైనా బ్యాటింగ్ ప్రాక్టీస్ చేయవచ్చు. ఎప్పుడూ నవ్వుతూ ఉండు.'అని సంజూ శాంసన్ ధైర్యం చెప్పాడు. అంతేకాకుండా, 15 ఏళ్ల చిన్న వయసులోనే టీమిండియా డ్రెస్సింగ్ రూమ్‌ను పంచుకోవడం ఒక గొప్ప అవకాశమని శాంసన్ గుర్తుచేశాడు. ఈ అద్భుతమైన క్షణాలను ఆస్వాదించాలని, ఇక్కడి అనుభవం జీవితాంతం గుర్తుంటుందని సలహా ఇచ్చాడు.

# గౌరవ్ రెడ్డి విధ్వంసకర శతకం



తెలంగాణ టీ20 ప్రీమియర్ లీగ్(టీజీ20) టోర్నీలో మరో శతకం నమోదైంది. అనురాగ్ నల్గొండ నైట్స్ ఓపెనర్, హైదరాబాద్ కుర్రాడు గౌరవ్ రెడ్డి(47 బంతుల్లో 6 ఫోర్లు, 9 సిక్స్‌లతో 101 నాటౌట్) విధ్వంసకర శతకంతో చెలరేగాడు. టీ20ల్లో గౌరవ్ రెడ్డికి ఇదే తొలి సెంచరీ. శుక్రవారం ఉప్పల్ స్టేడియం వేదికగా మెదక్ ఫాల్కన్స్ జట్టుతో జరిగిన మ్యాచ్‌లో గౌరవ్ రెడ్డి ఈ ఫీట్ సాధించాడు. అతని సెంచరీ ధాటికి అనురాగ్ నల్గొండ నైట్స్ 8 వికెట్ల తేడాతో మెదక్ ఫాల్కన్స్‌ను ఓడించింది. ఈ మ్యాచ్‌లో ముందుగా బ్యాటింగ్ చేసిన నిర్ణీత 20 ఓవర్లలో 4 వికెట్లకు 180 పరుగులు చేసింది. విక్రమ్ నాయక్(31 బంతుల్లో 4 ఫోర్లు, 2 సిక్స్‌లతో 48 నాటౌట్), వరుణ్ ఎర్రమ్(29 బంతుల్లో 2 ఫోర్లు, సిక్స్‌తో 44 నాటౌట్) టాప్ స్కోరర్లుగా నిలిచారు. శ్రుంజిత్ రెడ్డి(30), రవి తేజ(33) దూకుడుగా ఆడారు. నల్గొండ బౌలర్లలో రక్షణ్ రెడ్డి, అనికేత్ రెడ్డి, ఇయాన్ సతని తలో వికెట్ తీసారు. అనంతరం అనురాగ్ నల్గొండ నైట్స్ 16.3 ఓవర్లలో 2 వికెట్లకు 181 పరుగులు చేసి విజయాన్ని అందుకుంది. గౌరవ్ రెడ్డితో పాటు జశ్వత్ మోతే(34), కెప్టెన్ రాహుల్ బుద్ధి(20 నాటౌట్) రాణించారు. మెదక్ ఫాల్కన్స్ బౌలర్లలో మధుకర్ మన్నె, అర్జున్ గొర్రపల్లి తలో వికెట్ తీసారు. ఈ టోర్నీలో ఇప్పటి వరకు 6 మ్యాచ్‌లు ఆడిన అనురాగ్ నల్గొండ నైట్స్ 4 విజయాలతో పాయింట్స్ టేబుల్‌లో రెండో స్థానంలో కొనసాగుతోంది. మరోవైపు మెదక్ ఫాల్కన్స్ వరుసగా 5 మ్యాచ్‌ల్లో ఓడి పాయింట్స్ టేబుల్‌లో అట్టడుగు స్థానంలో నిలిచింది. తిలక్ వర్మ సారథ్యంలో తొలి మ్యాచ్‌లో గెలిచిన మెదక్ ఫాల్కన్స్.. ఆ తర్వాత ఒక్క మ్యాచ్ కూడా గెలవలేదు. తిలక్ శతకంతో ఆ జట్టుకు అద్భుతమైన ఆరంభం అందించినా.. అతని గైర్హాజరీలో మెదక్ బలహీనంగా మారిపోయింది. 5 మ్యాచ్‌లకు 5 గెలిచిన హైదరాబాద్ ఈ ఛాంపియన్స్ 10 పాయింట్స్‌తో టేబుల్ టాపర్‌గా కొనసాగుతోంది. ఐదు మ్యాచ్‌ల్లో మూడేసి విజయాలు సాధించిన కరీం నగర్, రంగారెడ్డి, ఖమ్మం వరుసగా మూడు, నాలుగు, ఐదు స్థానాల్లో కొనసాగుతున్నాయి. టాప్-4లో నిలిచిన జట్లు ప్లే ఆఫ్స్‌కు అర్హత సాధించనుండగా.. జులై 12న జరిగే ఫైనల్‌తో ఈ టోర్నీకి తెరపడనుంది.

# 10న విడుదలవుతున్న లెనిన్

## నేడు తిరుపతిలో ప్రీ రిలీజ్ ఈవెంట్

అక్కినేని అఖిల్ హీరోగా, అందాల తార భాగ్యశ్రీ బోర్సే కథానాయికగా నటించిన చిత్రం 'లెనిన్'. మురళీ కిషోర్ అబ్బూరు దర్శకత్వంలో తెరకెక్కిన ఈ సినిమా జూలై 10న ప్రపంచవ్యాప్తంగా ప్రేక్షకుల ముందుకు రానుంది. అఖిల్ కెరీర్‌లో ఎంతో కీలకంగా భావిస్తున్న ఈ సినిమాపై ఇప్పటికే భారీ అంచనాలు నెలకొన్నాయి. విడుదల తేదీ దగ్గరపడుతున్న నేపథ్యంలో చిత్రబృందం ప్రచార కార్యక్రమాలలో మరింత వేగవంతం చేసింది. ఇప్పటికే విడుదలైన 'లెనిన్' ట్రైలర్ కు ప్రేక్షకుల నుంచి మంచి స్పందన వచ్చింది. ముఖ్యంగా యాక్షన్, ఎమోషన్స్, నాగార్జున వాయిస్ ఓవర్‌తో రూపొందిన ట్రైలర్ సినిమాపై ఆసక్తిని పెంచింది. తాజాగా ఈ సినిమా ప్రీ రిలీజ్ ఈవెంట్ తేదీ, వేదికను మేకర్స్ అధికారికంగా ప్రకటించారు. జూలై 5న తిరుపతిలోని నెహ్రూ మున్సిపల్ గ్రౌండ్స్‌లో లెనిన్ ప్రీ రిలీజ్ ఈవెంట్‌ను చిత్ర యూనిట్ ఘనంగా నిర్వహించనుంది. ఈ ఈవెంట్‌కు సంబంధించిన ఏర్పాట్లు ఇప్పటికే ప్రారంభమైనట్లు తెలుస్తోంది.




# నేనూ కాస్టింగ్ కౌచ్ ఎదుర్కొన్నా

నటి పరిణీత బోర్తకుర్



సినీ ఇండస్ట్రీలో కాస్టింగ్ కౌచ్‌పై ఎన్నో ఆరోపణలు వస్తూనే ఉన్నాయి. చాలామంది భయంతో బయటకు చెప్పకుండా మౌనం పాటిస్తుంటే, కొంతమంది మాత్రం సమయం వచ్చినప్పుడు తాము ఎదుర్కొన్న చేదు అనుభవాలను ధైర్యంగా పంచుకుంటున్నారు. తాజాగా ప్రముఖ నటి పరిణీత బోర్తకుర్ కూడా తన కెరీర్ ప్రారంభంలో ఎదురైన ఒక షాకింగ్ సంఘటనను బయటపెట్టడం ఇప్పుడు చర్చనీయాంశంగా మారింది. తాజాగా ఒక ఇంటర్వ్యూలో పరిణీత బోర్తకుర్ సౌత్ సినీ ఇండస్ట్రీలో తనకు ఎదురైన అనుభవాన్ని గుర్తు చేసుకున్నారు. సినీ రంగంలో చేదు అనుభవాలు తాను కూడా ఎదుర్కొన్నానని ఆమె స్పష్టం చేశారు. అయితే ఈ పరిశ్రమలో ఒక మంచి విషయం కూడా ఉందని, ఒక వ్యక్తి అనుమతి లేకుండా ఎవరూ ఏమీ చేయలేరని చెప్పారు. ఇలాంటి పరిస్థితుల్లో మన ప్రవర్తన కూడా కీలకంగా ఉంటుందని ఆమె అభిప్రాయపడ్డారు. తన కెరీర్ ప్రారంభ దశలో ఒక దక్షిణాది సినిమా కోసం తన ఫొటోలు షార్ట్‌లిస్ట్ అయ్యాయని సమాచారం వచ్చిందని పరిణీత చెప్పారు. ఆ తర్వాత ఆఫీస్‌కు వెళ్లగా అక్కడ మరికొందరు అభ్యర్థులు కూడా ఉన్నారని తెలిపారు. కొంతసేపటి తర్వాత తననే హీరోయిన్‌గా ఎంపిక చేశామని చెప్పి ఒప్పందంపై సంతకం చేయాలని కోరారని వివరించారు. ఆ సమయంలో అంతా సాధారణంగానే అనిపించిందని, సినిమా అవకాశం రావడంతో ఆనందపడ్డానని గుర్తు చేసుకున్నారు. అయితే ఆ తర్వాత జరిగిన సంఘటన మాత్రం తన జీవితంలో ఎప్పటికీ మరిచిపోలేనిదని ఆమె చెప్పారు. మొదట తన శరీర కదలికలు తెలుసుకోవాలని దర్శకుడు చెప్పడంతో డ్యాన్స్‌కు సంబంధించిన విషయమే మాట్లాడుతున్నారని భావించానని తెలిపారు. కానీ వెంటనే మన ఇద్దరి మధ్య శారీరక సంబంధం ఉండాలని కోరుకుంటున్నానని అతను చెప్పడంతో ఒక్కసారిగా షాక్‌కు గురయ్యానన్నారు. అప్పటికి తన వయసు కేవలం 21 ఏళ్లు మాత్రమేనని, భయంతో గుండె వేగంగా కొట్టుకోవడం మొదలైందని చెప్పారు. వెంటనే అక్కడి నుంచి లేచి నిలబడి తాను ఆ సినిమా చేయనని చెప్పి బయటకు వచ్చేశానని వెల్లడించారు.ఆ సంఘటన తర్వాత వెంటనే తన తండ్రికి ఫోన్ చేసి జరిగిన విషయం మొత్తం చెప్పానని పరిణీత తెలిపారు. తన తండ్రి కూడా సినిమా అవసరం లేదని, వెంటనే ఇంటికి వచ్చేయమని చెప్పారని గుర్తు చేసుకున్నారు. అనంతరం ఆ దర్శకుడు ఫోన్ చేసి ఈ విషయం బయటకు చెప్పొద్దని, తాను కుటుంబానికి పెద్దవాడినని వేడుకున్నాడని వెల్లడించారు. సినిమాలో మంచి పాత్ర ఇస్తానని చెప్పినా, అలాంటి వ్యక్తితో కలిసి పనిచేయడం తనకు ఇష్టం లేదని స్పష్టం చేసి ఆ అవకాశాన్ని పూర్తిగా తిరస్కరించానన్నారు. పని కోసం ఎప్పుడూ అక్రమ మార్గాలను ఆశ్రయించలేదని, కెరీర్ కంటే ఆత్మగౌరవానికే ఎక్కువ విలువ ఇచ్చానని పరిణీత బోర్తకుర్ స్పష్టం చేశారు. ఇక పరిణీత బోర్తకుర్ 'బేపన్నా', 'సావధాన్ ఇండియా', 'గుప్తా బ్రదర్స్', 'ఏక్ థా రాజా ఏక్ థీ రాణి' వంటి పలు టెలివిజన్ షోలతో ప్రేక్షకులకు చేరువయ్యారు.




# శరవేగంగా ప్రభాస్ స్పిరిట్ షూటింగ్

## నగర శివారులో జెట్ స్పీడ్‌తో చిత్రీకరణ

రెబల్ స్టార్ ప్రభాస్, సెన్సేషనల్ దర్శకుడు సందీప్ రెడ్డి వంగా కాంబినేషన్‌లో తెరకెక్కుతున్న మోస్ట్ అవైటెడ్ యాక్షన్ ఎంటర్‌టైనర్ 'స్పిరిట్' షూటింగ్ శరవేగంగా కొనసాగుతోంది. భారీ అంచనాల మధ్య రూపొందుతున్న ఈ చిత్రానికి సంబంధించిన తాజా అప్‌డేట్ అభిమానుల్లో మరింత ఆసక్తిని పెంచుతోంది. ప్రస్తుతం హైదరాబాద్ పరిసర ప్రాంతాల్లో చిత్రీకరణ జెట్ స్పీడ్‌లో సాగుతుండగా.. చిత్ర బృందం ఎలాంటి విరామం లేకుండా వరుస షెడ్యూళ్లతో దూసుకెళుతోంది. స్పిరిట్ షూటింగ్‌లో ఇప్పటికే దాదాపు 70 శాతం పూర్తయినట్లు, కేవలం 30 శాతం చిత్రీకరణ మాత్రమే మిగిలి ఉన్నట్లు తెలుస్తోంది. ఈ సినిమా కోసం ప్రభాస్ కూడా పూర్తిస్థాయిలో సమయం కేటాయిస్తూ.. ప్రతి యాక్షన్ సన్నివేశాన్ని డూప్ లేకుండా స్వయంగా చేస్తున్నారని సమాచారం. యాక్షన్ సీక్వెన్స్‌లలో ప్రభాస్ అంకితభావం చిత్ర యూనిట్‌ను కూడా ఆకట్టుకుంటోందని సినీ వర్గాలు చెబుతున్నాయి. ఇక దర్శకుడు సందీప్ రెడ్డి వంగా పనితీరు గురించి ప్రత్యేకంగా చెప్పాల్సిన అవసరం లేదు. ప్రీ-ప్రొడక్షన్ దశలోనే ప్రతి సన్నివేశాన్ని, షూటింగ్ షెడ్యూల్‌ను పక్కాగా సిద్ధం చేసుకునే ఆయన.. సెట్స్‌పైకి వెళ్లిన తర్వాత మాత్రం శరవేగంగా చిత్రీకరణ పూర్తి చేసే దర్శకుడిగా పేరొందాడు. 'స్పిరిట్' విషయంలోనూ అదే వ్యూహాన్ని అమలు చేస్తున్నట్లు తెలుస్తోంది. ముందస్తు ప్రణాళిక కారణంగానే షూటింగ్ ఎలాంటి ఆటంకాలు లేకుండా వేగంగా కొనసాగుతోందని సమాచారం.

# ప్యారడైజ్ మూవీపై నాని ఫోకస్

## కొత్త చిత్రాలకు డేట్లు కుదరక నో




నేచురల్ స్టార్ నాని హీరోగా, దర్శకుడు శ్రీకాంత్ ఓదెల తెరకెక్కిస్తున్న భారీ యాక్షన్ ఎంటర్‌టైనర్ ది ప్యారడైజ్ పై ఇప్పటికే భారీ అంచనాలు నెలకొన్నాయి. 'దసరా' వంటి బ్లాక్‌బస్టర్ తర్వాత ఈ ఇద్దరి కాంబినేషన్‌లో వస్తున్న రెండో చిత్రం కావడంతో ప్రేక్షకుల్లో ఆసక్తి మరింత పెరిగింది. ఎస్ఎల్‌వీ సినిమాస్ బ్యానర్‌పై నిర్మాత సుధాకర్ చెరుకూరి భారీ బ్జడెట్‌తో ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నారు. ఈ సినిమాలో నాని 'జడల్' అనే పూర్తి స్థాయి మాస్ పాత్రలో కనిపించనున్నారు. ఆయనకు జోడీగా కయాదు లోహర్ 'సుబ్బలక్ష్మి' పాత్రలో నటిస్తోంది. విలక్షణ నటుడు మోహన్ బాబు ప్రధాన ప్రతినాయకుడిగా కనిపించనుండగా, సోనాలి కులకర్ణి, రాఘవ్ జుయల్, సంపూర్ణేశ్ బాబు కీలక పాత్రలు పోషిస్తున్నారు. ఈ చిత్రానికి అనిరుధ్ రవిచందర్ సంగీతం అందిస్తుండగా, జీకే విష్ణు సినిమాటోగ్రఫీ, నవీన్ నూలి ఎడిటింగ్ బాధ్యతలు నిర్వహిస్తున్నారు. మొదట ఈ సినిమాను ఆగస్టు 21న విడుదల చేయాలని భావించినప్పటికీ, నిర్మాణ పనులు ఆలస్యం కావడంతో విడుదల తేదీ సెప్టెంబర్ 25కు మారే అవకాశాలు ఉన్నట్లు సినీ వర్గాల్లో ప్రచారం జరుగుతోంది. ది ప్యారడైజ్‌'పై పూర్తి దృష్టి పెట్టిన నాని, ఇతర సినిమాలను తాత్కాలికంగా పక్కన పెట్టినట్లు తెలుస్తోంది. షూటింగ్ ఆలస్యం కావడం వల్ల ఆయన రెండు ప్రతిష్టాత్మక ప్రాజెక్టులను వదులుకోవాల్సి వచ్చినట్లు సమాచారం. మొదటిది, 'హాయ్ నాన్న' దర్శకుడు శౌర్యువ్ సిద్ధం చేసిన కొత్త సినిమా. కథ నచ్చినా డేట్స్ అందుబాటులో లేకపోవడంతో, ఆ ప్రాజెక్ట్‌ను వేరే హీరోతో ముందుకు తీసుకెళ్లాలని నాని సూచించినట్లు తెలుస్తోంది. ప్రస్తుతం ఆ కథ విజయ్ దేవరకొండ వద్దకు వెళ్లినట్లు ప్రచారం జరుగుతోంది. ఇక రెండోది, 'జై భీమ్' దర్శకుడు టీజే జ్ఞానవేల్ రూపొందించాలనుకున్న చిత్రం. కథపై నానికి మంచి అభిప్రాయం ఉన్నప్పటికీ, డేట్స్ సర్దుబాటు కాకపోవడంతో ఈ కాంబినేషన్ కార్యరూపం దాల్చలేదని తెలుస్తోంది. ప్రస్తుతం జ్ఞానవేల్ హీరో సూర్యతో తన తదుపరి చిత్రాన్ని రూపొందిస్తున్నారు. 'ది ప్యారడైజ్' పూర్తయిన తర్వాత దర్శకుడు సుజీత్‌తో కలిసి 'బ్లడీ రోమియో' అనే సినిమా చేయాలని నాని భావిస్తున్నట్లు ఇండస్ట్రీలో టాక్ వినిపిస్తోంది. అయితే సుజీత్ ప్రస్తుతం పవన్ కళ్యాణ్‌తో 'ఓజీ–2' ప్రాజెక్ట్‌పైనా దృష్టి పెట్టడంతో, నాని–సుజీత్ సినిమా ఎప్పుడు ప్రారంభమవుతుందన్నది ఆసక్తికరంగా మారింది.నిర్మాతపై అదనపు ఆర్థిక భారం పడకుండా ఉండాలనే ఉద్దేశంతో నాని తన తదుపరి కమిట్‌మెంట్లను వాయిదా వేసి, 'ది ప్యారడైజ్‌'ను పూర్తి చేయడంపైనే పూర్తి దృష్టి సారించినట్లు సమాచారం.

# నా లైఫ్ పార్ట్‌నర్ సెన్సిబుల్‌గా ఉండాలి

## నటి శ్రీలీల మనోగతం

టాలీవుడ్ మోస్ట్ వాంటెడ్ అండ్ ఎనర్జిటిక్ బ్యూటీ శ్రీలీల పెళ్లి, రిలేషన్‌షిప్‌పై ఆసక్తికర వ్యాఖ్యలు చేసింది. వరుస సినిమాలతో ఫుల్ బిజీగా ఉన్న బ్యూటీ.. తనకు కాబోయే వాడు ఎలా ఉండాలి? తన లైఫ్ పార్ట్‌నర్‌లో ఎలాంటి క్వాలిటీస్ వెతుకుతుంది? అనే విషయాలపై తాజాగా క్లారిటీ ఇచ్చింది. ఒక ఇంటర్వ్యూలో శ్రీలీలను రిలేషన్‌షిప్ గురించి అడగగా, తన మనసులోని మాటను పంచుకుంది. తనకు కాబోయే వాడు ముఖ్యంగా మూడు లక్షణాలు కలిగి ఉండాలని స్పష్టం చేసింది. 'నాకు లైఫ్ పార్ట్‌నర్‌గా వచ్చే వ్యక్తి చాలా సెన్సిబుల్‌గా ఉండాలి. అలాగే ఇతరుల భావాలను గౌరవించే సెన్సిటివ్ మనస్తత్వం ఉండాలి. వీటన్నింటితో పాటు మోస్ట్ ఇంపా÷–టగ్గ÷ంట్ క్వాలిటీ.. అతనికి మంచి సెన్స్ ఆఫ్ హ్యూమర్ కచ్చితంగా ఉండాలి' అని శ్రీలీల పేర్కొంది. కేవలం లుక్స్ మాత్రమే కాకుండా, వ్యక్తిత్వానికి, ఎదుటివారిని అర్థం చేసుకునే గుణానికే తాను మొదటి ప్రాధాన్యత ఇస్తానని ఈ బ్యూటీ హింట్ ఇచ్చేసింది. ప్రస్తుతం శ్రీలీల చేసిన ఈ కామెంట్స్ సోషల్ మీడియాలో వైరల్ అవుతున్నాయి. గ్లామర్, యాక్టింగ్, అదిరిపోయే డాన్స్‌లతో కుర్రకారు మనసు దోచుకున్న ఈ ముద్దుగుమ్మ.. రిలేషన్‌షిప్ విషయంలో ఇంత క్లారిటీగా ఉండటంపై ఫ్యాన్స్ ఫిదా అవుతున్నారు. శ్రీలీల చెప్పిన క్వాలిటీస్ విన్నాక.. 'బాస్.. ఆ క్వాలిటీస్ మనలో ఉన్నాయో లేదో ఒకసారి చెక్ చేసుకోవాల్సిందే' అంటూ నెటిజన్లు, అబ్బాయిలు సోషల్ మీడియాలో సరదా కామెంట్స్ పెడుతున్నారు.




Printed, Published & Owned by CH. Rajkumar, Published at H.no. 5-5-616, Kothirampur.Dist- Karimnagar 505001. TELANGANA State printed at SRI BALAJI PRINTING PRESS, H.NO.4-4-55, Tilak Road, Karimnagar -505001,

Head office: 2-66-121/122 near ramky one Marvel gajullaramaram Quthbulapur medchal Malkajgiri district. TELANGANA STATE. CHIEF EDITOR : K.SRAVAN KUMAR 9866330400 , RNI. NO. APTEL/2010/35724. EMAIL:Peoplesnews0909@gmail.com